శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము
సుల్తాన్ బజార్, హైదరాబాద్. 1.

శ్రీరస్తు.

శ్రీ మహాగణేశాయనమః

శ్రీ సిద్ధేశ్వరీయము.

పూర్వము చంద్రగిరితాలుకా పాకాలపేట వాస్తవ్యులును
నిపుడు వేలూరు మిషన్ కాలేజి ప్రధానాంధ్రోపాధ్యాయులును నగు
ఆలూరు. వాసుదేవయ్యగారిచే
రచితము.

894.8131
VAS-S

తం. తేవప్పెరుమాళ్లయ్యగారిచేఁ
బరిశోధితము.

THE PROGRESSIVE PRESS,
MADRAS.

Copyright Registered.] 1911. [వెల 10 అణాలు.

విజ్ఞాపనము.

మిత్రులారా?

పూర్వము "కాంభోజపురం" బనంబడి, పిదప "సురఘటపురం" బంచుఁ బేరొంది తర్వాత "కల్లుకడవపాడి" లని పిలువంబడి యిప్పుడు "కల్కాడ" యనునామంబున నొకపురంబు కడపజిల్లావాయల్పాడు తాలూకాలోఁ బ్రసిద్ధినొంది యున్నది.

ఆ కల్కాడయనుపురంబునకు నుత్తరభాగంబునందుండు భాస్కరనదిగట్టున మగధదేశాధిపతి యగుచంద్రగుప్తమహారాజు సిద్ధవట పురంబును దనకు రాజధానిఁ జేసికొని రాజ్యమేలుచుండి పుత్రులు లేకుండుటంజేసి శివయోగీంద్రుం డనుమహామునివలనఁ బంచాక్షరీమంత్రరాజోపదేశంబు నొంది తత్ప్రభావంబుచేఁ గొన్నాళ్లకు నొకపుత్రికను గాంచి సత్యవతియని దానికి నామకరణం బొనరించె.

అంత నాసత్యవతికిఁ గొన్నిదినంబులు గడచినపిదప నా శివయోగీంద్రుం డొకసమయంబున "సారమంత్రం" బుపదేశింపఁ దన్మహిమ వలన నాకన్నియ గర్భంబుదాల్చె. అది తండ్రియెఱింగి దానికి హేతువడుగ నాసత్యవతి యేమియుం జెప్పక పోవుటంజేసి దానిసత్యంబుఁ బరిశీలింపఁ దలంచి యా నిండు చూలాలిని గొల్వుకూటంబునకుం బిలిపించి యొకసర్పంబును దెప్పించి దానిని శిరంబునఁ గుడుగుచుట్టవలెఁ జేసి పెట్టుకొమ్మనిచెప్పి యొకపచ్చికుండను దానిపై నిడుకొనఁజేసి యందు సంపూర్ణంబుగఁ గల్లుదెప్పించి పోయించి "యీకుండ నెచ్చోటఁ గాని దింపక యిందుండి కాంభోజపురిమార్గంబునం బోయి సూర్యుఁ డస్తమింపకమునుపే యాపురిసమీపముననుండు భాస్కరనదిగట్టునడించి తివేని నీసత్యంబునిజంబు, లేకున్న నిన్నువధింతు"నని చెప్పి యట్లు సే

యింప, నాసత్యవతి యమ్మోయింజేయ నంగీకరించి తనమనమ్మున నాసిద్ధవటపురంబునం బ్రసిద్ధి గనియుండు సిద్ధేశ్వరుని వేడుచు నాకల్లుకుండ నెందేని దింపక జనకునానతిచొప్పున నాభాస్కరనదిగట్టున దించె. దాని భక్తికి నాసిద్ధేశ్వరుండా కల్లుకుండలో నుద్భవించి యాసత్యవతికిం బ్రసన్నుండై యాకన్యకామణి కభీష్టసిద్ధి గావించె ఆ కారణంబునం గల్లుకడవ ప్రోలని. కాంభోజపురంబునకు నామంబుగల్గె ఇప్పుడు కల్కడయంచుం జెప్పుటయేకాక కొందఱుజనులు "కల్కడకాంభోజపురం" బనియే వ్రాయుచున్నారు. తక్కినకథ నీ చరిత్రముచదువ నెఱుంగఁబడును గదా! మఱియు నేనీవఱలో—జనయిత్రీయము, చంద్రసేనవిజయము, చంద్రరేఖ, మఱికొన్ని చిన్నపుస్తకములను వచనకావ్యంబులుగ రచించితిని గాని పద్యకావ్యములను రచింపకుండుటంజేసి యిపుడీసిద్ధేశ్వరీయమను గ్రంథంబును కాశీపాకపురీమహాత్మ్య మనుగ్రంథంబును రచించితి. నాకుఁ బద్యకావ్యంబులందు నిది మొట్టమొదటి రచనయగుటంజేసి చదువు వారలు దమకుఁ దప్పులెందేని దోఁచిన పక్షమునఁ గృపతో నాకెఱింగింతురేని రెండవకూర్పున సవరించు కొనుచున్నాను.

ఇట్లు, విధేయుఁడు.

ఆలూరు-వాసుదేవయ్య.

శ్రీ ర. స్తు.

శ్రీ గణేశాయనమః.

శ్రీసిద్ధేశ్వరీయము.

ప్రథమాశ్వాసము.

శ్రీ సురగణసంసేవ్యుఁడు
శ్రీ సురఘటపురవరుండు శ్రీమత్కామా
క్షీసహితుఁడు సిద్ధేశుఁడు
శ్రీసమధికుఁ జేయుఁగాతఁ గృప నన్నెపుడున్. 1

మ. ప్రతిరోధించి దశాస్యుఁ డద్రిని గదల్పన్వాని శిక్షింప కా
తత కారుణ్యముతోడఁ బ్రోచితివి శాంకతస్వాంతుఁ డౌసీకు నే
గతి రుద్రుం డని యుగ్రుఁ డంచు బిరుదుల్ గల్గెన్ భళా యంచుఁదాఁ
బతితో మేలము లాడు శైలసుత నన్ బాలించి రక్షించుతన్. 2

ఉ. శ్రీయుతకల్పసాల మని చెప్పఁగ లోకులు చూచినారొ లే
దో యని యెంచి కోరికల నోజ నొసంగుచుఁ దద్ద్రుమంబు దా
నే యన వేంకటాద్రిపయి నిమ్ముల నిల్చె ననంగ నొప్పు శ్వ
శ్రేయసదాయకుండు హరి సేయుత నన్నుఁ గడుం గృతార్థుఁగాన్.

చ. నలువుగ మాయ వన్నిమతి నన్ను మొఱఁగి మెఱుంగుబోండ్ల లా
తులవలలందుఁ జిక్కి ననుఁ దోయరుహాక్షుఁ డుపేక్ష సేయ నా
వల నెటు లోర్తు నంచుఁ బతి వక్షముఁ బాయక నిల్చెనో యనం
జెలఁగురమావధూటి దయ సేయుత నా కనిశంబు సంపదల్. 4

మ. అలశైలాత్మజ యాత్మవల్లభుని నర్ధాంగీకృతుం జేసెఁ దాఁ
జెలువౌనాథుని ఱొమ్ముఁ ద్రొక్కి నిలిచెన్ శ్రీకాంత నాకాంత యి
మ్ముల నామాటనె యుండుఁగాత మని యాపూఁబోఁడి నెమ్మోములం
దెలమిం దాల్చెనొ నాఁ దనర్చునలవాణీశుండు నన్ బ్రోచుతన్.

ఉ. సంచితరాగమాధురి పొసంగదు నీ కిటు నాకు నీడుగా
నం దొకచేత నంకమునఁ గల్లన తాఱిచి యొందుచేతితో
నించినవేడ్క నంటుచును నేర్పెడినో యన వీణఁ బట్టి వా
యించెడువాణి నాకు నలరించుత మంజుకవిత్వవైఖరుల్. 6

శా. శ్రీలాలిత్యగుణాతిగణ్య యగుగౌరీదేవి చన్నిచ్చుచో
నోలిం దా నొకచన్నుఁ ద్రావుచును వేఱొక్కంటఁ దుండాగ్రమున్
లీలన్ రాయుచుఁ దల్లి ముద్దిడుచు లాలింపంగ నింపారునా
బాలాగ్రేసరుఁ డావినాయకుఁడు నన్ బాలించు నశ్రాంతమున్.

చ. అలర మదిష్టదేవతల నార్తశరణ్యులఁ జారుపుణ్యరూ
పల భవరోగహారిపద పద్మమహామహిమభాసమానలన్
సలలితసౌఖ్యదాయినులఁ జండవిపత్ఫణిబృందబర్హిణాకాం
తల నలసప్తమాతల నెదం దలపోయుదు నిష్టసిద్ధికిన్. 8

చ. సకలకళాప్రవీణుఁడు ప్రశస్తగుణాఢ్యుఁడు తత్త్వమార్గబో
ధకుఁడు యశోవిశాలుఁడు నుదారమనస్కుఁడు వేదమార్గదీ
పకుఁడు మదీయచిత్తవర పద్మదివాకరుఁ డైనయాత్మదే
శికునిపదారవిందములఁ జిత్తమునన్ భజియింతు నెంతయున్. 9

పురాతనకవీంద్రగుణకీర్తనము.

మ. తగ వైకుంఠమునందు నుండి యెలమిం దా మున్ను రామాహ్వయం
బగుదివ్యామృతబిందు వొందు రహిమై నానారదుం డీయ నిం
పుగ దానిం గొని దివ్యరామచరితాంభోరాశిఁ గావించియున్
మిగులన్ మించుగుణాతిరేకి యగు వాల్మీకిం బ్రశంసించెదన్. 10

తే. ఎలమి వేదార్థముఁ బురాణ§ములు జగానఁ
దనరఁజేసి మహావిష్ణు§వనఁగ నెవఁడు
భూరివిఖ్యాతిఁ గాంచె న§మ్మునివరేణ్యుఁ
గోర్కి నిండార నాత్మలోఁ§గొలుఁతు నెపుడు. 11

సీ. ప్రకటకవీంద్ర కై§రవరాజరాకాసు
ధాభానుఁ డగుకాళి§దాసు నెంచి
ప్రథితసుధృగ్జాల§పద్మాకరోదార
రవి యై రహించుభా§రవి నుతించి
ప్రతివాదిజనచిత్త§బాధైకహేతునిశాత
బాణుఁ డై రాణించు§బాణుఁ దలఁచి
కుకవికాలోరగ§కుటిలతాహారిమ
యూరుఁ డై మించుమ§యూరుఁ గొలిచి
పండితకలాసముద్దండి§దండి కెఱఁగి
భూరివాగ్భూతి యగుభవ§భూతిఁ బొగడి
మహితకావ్యార్థపేటి యా§మాఘుఁ దలఁచి
ప్రౌఢరచనానిబంధు సు§బంధు నెంచి. 12

తే. శ్రీమహాభారతంబు నాం§ధ్రీకరించి
యనుపమానకవిత్వవి§ఖ్యాతిఁ గాంచి
నట్టినన్నయఁ దిక్కన§యజ్వ శంభు
దాసకవిపుంగవుని నాత్మఁ§దనరఁ దలఁచి. 13

కుకవినిరాకరణము.

చ. శుకములు మంచిపండ్లు దిని§సొం పగుపల్కులఁ గుల్కునట్లుగా
సుకవులు నాప్రబంధమునఁ§జూచిననొప్పుల మెచ్చి పల్కరే
బకములు మీలగుంపు దిని§పల్కవె కర్ణకఠోరభంగిగాఁ
గుకవులు నట్ల తప్పు లని§కూయరె దాన గుణంబు ప్రోవునే. 14

తే. సకలశాస్త్రంబు లె ట్లైనఁ§జదువ వచ్చుఁ
గాని కవితాచమత్కృతి§గల్గు టరుదు

కలిగి కావ్యము రచియించు కవికి ఘనత
తనరకుండునె కుకవు లేమనినఁ గాని. 15

వ. అని యిష్టదేవతాప్రార్థనంబును బురాతనకవీంద్రగుణ కీర్తనం
బును గుకవినిరాకరణంబునుం జేసి మద్వంశావతారం బభివర్ణించెద.

వంశానుక్రమణిక.

సీ. శ్రీమదాలూరువంశామలాంభోరాశి
పూర్ణిమాచంద్రుండు బుధనుతుండు
కాశ్యపగోత్రసంకలితుఁ డాపస్తంబ
సూత్రుఁడు సుగుణసంశోభితుండు
వెంకయార్యునకు సాధ్వీమణీ సుబ్బమాం
బకు దత్తపుత్త్రుఁ డాప్తజనయుతుఁడు
ప్రథితజ్యోతిశ్శాస్త్ర పారంగతుండు పం
చాక్షరీమంత్రరహస్యవిదుఁడు
మహితకీర్తివిహారుండు మానధనుఁడు
సత్యసంధుండు నయవిచక్షణుఁడు ధర్మ
వర్ధనుఁడు రామకృష్ణదైవజ్ఞుఁ డవనిఁ
బరిఢవిల్లెడుపాకాల పుర్యమునందు.
[శుఁడు

సీ. వఱులుకంభమువంశవారాశిచంద్రుఁడు, కౌండిన్యగోత్రసంకలితయ
సంగీతవిద్యావిశారదుం డుత్తమ, చరితుండు సజ్జన సన్నుతుండు
ప్రవిమలాత్ముఁడగును బ్రహ్మణ్యవిబుధుండు, పార్వతి కై వడిఁ బరఁగునట్టి
సుబ్బమయన్ప్రియసుదతిలలామగ,ర్భంబునఁ గాంచినఁ బడఁతిఁగృష్ణ
మాంబఁ గడుప్రీతిఁ దాఁ బెండ్లియాడి యామె
యందుఁ బుత్త్రిల నేవురఁ బొంది కలిమి
కిరవుగా నుండుపాల్కలపురమునందుఁ
దనరుచుండెను నంత నాదంపతులకు. 18

తే. ధర్మనిష్ఠితచిత్తులుదారకీర్తు
లాత్మజన్ములు గలిగి రాయలఘుసుగుణ

భాసమానుల కనుజుండ వాసుదేవ
నామకుండను విబుధజన ప్రియుండ. 19

తే. ఏ నొకదినంబు నాత్మలో నిద్ధరిత్రి
నేది శాశ్వత మగుకార్య మేదిహితము
కల్మషంబుల దేనిచేఁ గ్రాఁచఁ గల్గుఁ
దలఁపఁగా నాకు నని యిట్లు దలఁచు చుండ. 20

వ. సప్తసంతానంబులయందుఁ గృతి శాశ్వతం బంచు నార్యులు వక్కా-
ణించినవచనం బాత్మకుం దోఁప నంత సురాఘటపురీశ్వరుం డగు
శ్రీసిద్ధేశ్వరస్వామిచారిత్రం బంతయుం బద్యకావ్యంబుగ వ్రాయం
బూని యాత్మగతంబున. 21

క. శ్రీసురఘటపురవరుఁ డగు, శ్రీసిద్ధేశ్వరుఁడు దప్పఁ బృథ్విమ ఱెవ్వాఁ
డీసుకృతికన్యకుం బతి, భాసురముగ నని తలంచి ప్రమదం బారన్.

షష్ఠ్యంతములు.

క. శ్రీసర్వజ్ఞునకుం గరు, ణాసాగరపూర్ణచంద్రునకుఁ బ్రణవగృహా
వాసునకుఁ శ్రీకామా,క్షీసహితున కనఘునకును సిద్ధేశునకున్.

క. శ్రీసుభగచరిత్రునకుఁ, భాసురధవళాంబుజునకును భవ్యాత్మునకుఁ
శ్రీసురఘటపురవరునకు, శ్రీసర్వవిభూషణునకు సిద్ధేశునకున్. 24

వ. సమర్పణంబుగా నాయొనర్పం బూనినసిద్ధేశ్వరీయ మనుమహాప్రబం
ధంబునకుఁ గథాక్రమం బెట్టి దనిన. 25

నైమిశారణ్యవర్ణనము.

సీ. సత్యలోకము వ్రోలె శారదాశాండిల్య
కపిలగాలవకౌశి కవరు లెసఁగ
వైకుంఠమునుబోలె వైజయంతీశుక
మాధవీనారద మదను లెసఁగఁ

గైలాసమును బోలె ఘనవృషకుంభచం
  ద్రార్క హైమవతీ గుహాదు లెసఁగ
నింద్రలోకము వోలె నింద్రాణిసుమనోవ
  రైరావతసురభి శక్రాదు లెసఁగ
భూరివిఖ్యాతిఁ గాంచును భూతలమున
  మునివరేణ్యులవరతపోధనగృహముగఁ
గలుషవారాశితరణము గా విశాల
  పుణ్యదేశము నైమిశారణ్య మరయ. 26

వ. అప్పుణ్యారణ్యంబునఁ బరిశుభ్రతరంగగంగాప్రపూర్ణం బగుగోమతీ తరంగిణీకూలంబున ద్వాదశవార్షికసత్రయాగంబు ప్రవర్తిల్లుచు నుండ శ్రీశౌనకాదిమహామునులు రోమహర్షణపుత్త్రి బాదరాయణిప్రియశిష్యుఁ బౌరాణికు సూతాహ్వయసంభవు సూతు నర్చించి యిట్లనిరి నిఖిలపురాణవ్యాఖ్యానవిఖ్యాతుండ వైనయోసూతా! పంచాశత్ఖండమండితంబును బహుసంహితాసమాకీర్ణంబును నగు స్కాందపురాణరత్నంబునందలియగస్త్యసంహితయందుఁ జెప్పం బడినహాలాస్యనాథునిచతుష్షష్టివిలాసంబు లన్నియు నీవలన నాకర్ణించి పరమానందంబు నొందితిమి కావున నివు డెద్దియేని యొక పుణ్యచరిత్రంబు గర్ణరసాయనంబుగ నుడువు మని ప్రార్థింప నప్పౌరాణికుం డాదరాయత్తచిత్తుం డై సావధాను లై వినుం డని యిట్లనియె. 27

క. మునులారా! శ్రీశైలంబునకుం దక్షిణముగాను ముక్తిప్రద మై
ఘనకల్మషహర మై ధరఁ దనరారుఁ బినాకినియనఁ దనరెడునది దాన్.

వ. ఆనదీతీరంబున. 29

——◆ సిద్ధవటపురవర్ణనము. ◆——

సీ. దేవతాజనవిహారావాసభాసుర, బహువిధప్రాకారపరివృతంబు
  గోపురవిలసితగోపురసంకాశ, రమణీయగోపురభ్రాజితంబు

రాజతాహార్యరాజరాజితశృంగోప, మానమానితసుధామహితసౌధ
మజితాతపత్రసద్ధ్వజసముత్తుంగశ, తాంగమాతంగసమంచితంబు
ఆజి భార్గవు గెల్చుభటాళిపట్టు
సకలధనధాన్యసంచయసమధికంబు
ఖ్యాత మౌజయలక్ష్మికిఁ గాఁపురంబు
పరమసుఖప్రదంబు శ్రీసిద్ధవటపురంబు. 30

తే. మఱియు భూదేవి నవరత్నమయవిభూష
ణావళిం దాల్చి తనచెలువారఁ జూచు
కొనఁగఁ జేఁగొన్నదర్పణంబనఁగఁ బుడమిఁ
దనరు నాపురి శృంగారమునకు నిధిగ. 31

సీ. ఆపట్టణంబునం దమరేజ్యునకునైన
శంక దీర్చెడువిప్రసంఘ మలరు
నమరేంద్రునకునైన నాజిఁ దోడ్పడి శత్రు
జయ మొనర్చెడురాజసంఘ మలరు
ధనధాన్యసంపన్నత వహించి ధనదుని
సరకు సేయనివైశ్యసంఘ మలరుఁ
బాఁడిపంటలకు మాపాటి లే రని సంత
సంపడువరశూద్రసంఘ మలరు
నృత్తగీతంబులందును నేర్పు మీఱి
ఖేచరాంగనలను బిల్చి గేలి సల్పు
సరసగుణయుతగణికానికరము నలరు
దాని వర్ణింప నేరికిఁ దరమె జగతి. 32

సీ. క్షితి నాపురీశుఁ డాశ్రితకోటిమందారుఁ
డభియాతికోటికాలాంతకుండు
కుజనబలాహకవ్రజసమీరుండు స
జ్జనపుష్పసంచయషట్పదుండు

సన్మిత్రకోట్యంబుజవనైకమిత్రుండు
బాంధవకుముదక్షపాకరుండు
బుధలోకచాతకాంబుధరుండు మానిత
మహితవిద్యాధనమందిరుండు
ప్రమదభటకోటిపరివృతప్రాభవుండు
ఘనచంద్రాన్వయాబ్ధిసుధాకరుండు
శమదమాది గుణోపేతుఁ డమలయశుఁడు
చంద్రగుప్తమహీపాలచంద్రముఁడు. 33

సీ. అతనిపాలనమునం దవనీసురేంద్రులఁ
గ్రూరులై దూషించువారు లేరు
తాలుమాలుగఁ దల్లిదండ్రుల నిందించి
కొట్టెడువారు కన్గొన్న లేరు
విత్తంబుఁ గొని కులవృత్తిని విడి తొత్తు
వృత్తికిఁ జనెడుదుఃస్త్రీలు లేరు
జారచోరులు దురాచారాన్వితులు లేరు
వంచనతో బొంకువారు లేరు
ధనముఁ గొని కూఁతు నొసఁగుపాతకులు లేరు
జనులబ్రతుకులు చెఱుచుదుర్జనులు లేరు
దైవవిత్తాపహారులు దలఁప లేరు
గురుజనంబుల దూఱెడునరులు లేరు. 34

తే. చంద్రగుప్తనరేంద్రుఁ డీచాడ్పున మహి
సకలసామ్రాజ్య విభవాతిశయము నొంది
జనులు మనరాజు శ్రీరాముఁ డనుచుఁ బొగడ
నెలమి ధర్మంబుగా రాజ్య మేలుచుండె. 35

వ. ఇట్లుండి యొకనాఁ డారాజేంద్రుండు సుబుద్ధి యనుమంత్రిశేఖరుం జూచి "రే పరుణోదయంబున నాఖేటవిహారార్థముగ నరణ్యంబునకుం బోవలయుఁ దగుప్రయత్నంబు సేయుఁ"మనవుడు నాయమాత్యుండు మహాప్రసాదం బని మృగయుల రావించి తేనియానతి నెఱింగించె.

తే. అంత నవ్వార లరుణోద । యంబు గాఁగఁ
బ్రమద మారంగఁ దగునాయు । ధములు వట్టి
వెంట జాగిలములు రాఁగ । వెడలి నృపుని
నగరిముంగిట నిల్చిరా । నతి మెలర్ప. 37

చంద్రగుప్తుఁడు వేఁటకుఁ బోవుట.

సీ. అప్పు డాచంద్రగు । ప్తావనీశుఁ డలంకృ
తిం గలమహితశ । తాంగమునను
మంత్రియుం దాను స । మ్మదలీలమై నెక్కి
పురజనంబులు వేడ్కఁ । బొంది చూడఁ
బరిజనంబులు వెంటఁ । బలుతెఱంగులు వల్కి
కలకలారావముల్ । గడలుకొనఁగ
మృగయులెల్లరుఁ దమ । మగతనంబులు సెప్పి
కొంచు ముందట గుంపు । గూడి నడవ
నిశితశరఖడ్గకాంతులు । దిశల వెలుఁగ
నమదగజబృంహితాశ్వహే । షలు సెలంగ
వివిధవాద్యంబు లొగి వియ । ద్వీథి నొలయ
వెడలి రతిముఱి వేఁటాడ । విపినమునకు. 38

వ. ఇట్లరిగి యడవిసమీపంబున నొక్కెడ నరదంబు డిగ్గి తురగంబులనుం గొందఱిఁ బరిజనంబుల నచ్చో నిల్పి మృగయులతోఁ గూడి వనాంతంబునం బ్రవేశించి. 39

సీ. కొందఱు మృగయులు । కొండలకోనలఁ
జేరి మెకంబులఁ । జెదరి పాఱ
నట్లు భయప్రదం । బగువాద్యములు సేయఁ
బొదలందు గవులందు । నిదురఁబోవు
శార్దూలభల్లూక । సమదవరాహఖ
డ్గలులాయసంఘము । నలువలంకు

లకుఁ బాఱఁ గ్రాంచి తలంపార భూపాలుఁ
డతివిక్రమము మెఱయంగ నిశిత
ఖడ్గమును బూని పుండరీకముల నఱకి
మహిషభల్లూకముల రూపుమాపి క్రోడ
ఖడ్గమృగములఁ జెండాడి కరుల గిరుల
కరణి నేలకుఁ బడఁగొట్టి కను మొఱంగి. 39

క. పలుదెసలఁ బాఱుపెఱమెక
ముల వలలం జిక్కువడఁగ మోఁదుచు నిటు భూ
తలనాథుఁడు వేఁటాడుచు
నలసి జలంబులను గ్రోల నాగహనములోన్. 40

వ. తా నొక్కండ పినాకినీనదికిం జని నీ రాని వచ్చుచు నుత్తరభాగం
బునుం జూడ నయ్యెడ. 41

చంద్రగుప్తుఁడు సిద్ధగణమును గనుట.

క. ఉరుతరశాఖాగ్రము లం
బర మంటుచు మూలచయము పాతాళమునం
బరఁగుచు సహస్రశిరముల
నరయఁగ నయ్యాదిపురుషుఁ డన నొకవటమున్. 42

క. తనరెడు నవ్వటవృక్షం
బును జూడఁ దలంచి యటకు ముదమునఁ జని దాఁ
గనుఁగొనియె దానిక్రిందను
ఘనకల్మషవిజితసిద్ధ గణమును సరవిన్. 43

వ. పరమభక్తి నాసిద్ధగణంబునకు సాష్టాంగదండప్రణామంబు లాచరిం
చి యొక్కెడ నిలువంబడి ముకుళితహస్తుం డై తనమనంబున. 44

క. ఇమ్మునిపుంగవు లుండువ, నమ్మున కే నేల పరిజనంబులతో మో
దమ్మున వేఁటకు రావలె, నిమ్మహనీయులును మనల నేమొంతురొకో.

వ. మఱియుఁ దొల్లి విశ్వామిత్రునియాశ్రమంబునకు హరిశ్చంద్రుండు మృగయావిహారార్థంబుగఁ జని యమ్మునివర్యువలనఁ గడుం గడగండ్లు వడియెఁ దద్విధంబున నా కెట్టియిడుములు గల్గింతురో యిఁ కేమి సేయువాఁడ నని భయాకులితచిత్తుం డై నిలువంబడి యుండ నాచంద్రగుప్తుం గని సిద్ధగణంబులందు శివయోగీంద్రుఁ డిట్లనియె. 46

క. ఈలీల విచారంపడ, నేలా రాజేంద్ర! రాజు లెవ్వరికైనన్
మే లొందెడుకార్యం బను, కూలంబొనరింప దానఁ గోపము గలదే.

చ. అని నరనాథచంద్రునిఁ బ్రియంబున దగ్గఱఁ బిల్చి యివ్విధం
బునఁ దగఁ బల్కె నో మనుజపుంగవ! నీవు భయంబు మాని న
న్నుఁగొన వచ్చుచుండు భవకల్మషవార్ధిఁ దరించుమంత్ర మిం
పొనరఁగ నీకుఁ జెప్పెదను బుణ్యదినంబున నద్ది నీ కొగిన్. 48

తే. సమరకేళి జయం బిచ్చు సఖులఁ గూర్చు
సకలసంపద లొడఁగూర్చు శాంతి నిచ్చుఁ
బుణ్యనిధిఁ జేర్చు సత్కీర్తి పొసఁగఁ దెచ్చు
దానిమహిమను గొనియాడఁ దరమె జగతి. 49

వ. కావున నీనిజచిత్తవృత్తి నెఱింగితి నమ్మంత్రరాజం బొకతఱి నుపదేశింతు నిపు డొకపుణ్యకార్యంబు సేయుము తొల్లి మహాసిద్ధులు నిర్మించిన సిద్ధేశ్వరదేవాగారం బీపినాకినీనదీకూలంబున నున్నది. అయ్యది శిథిలం బగుటం జేసి పునరుద్ధారణంబు సేయు మనుడుఁ జంద్రగుప్తనరేంద్రుఁ డమ్మెయిం జేయింతు నని భక్తిమై నాయోగివరున కిట్లనియె. 50

క. సద్ధర్మనిలయ! యీపురి, కిద్ధాత్రీతలమునందు నేహేతువుచే
సిద్ధవటం బను బేరు ప్ర, సిద్ధంబయ్యెను ముదమున జెప్పుమ నాకున్.

తే. అనిన నాయోగివర్యుఁ డిట్లనియెఁ బ్రీతి
వటతరువుక్రింద శ్రీసిద్ధవరగణంబు
తపముచేసెడుకతన నిద్ధాత్రియందు
సిద్ధవటపుర మనఁగఁ బ్రసిద్ధ మయ్యె. 52

మ. అని యాయోగివరుండు సెప్ప నరనాథాగ్రేసరుం డమ్మహా [నే
మునివర్యుం గొనియాడి మ్రొక్కులిడి యామోదంబుమైఁ బోదు
యనుచుం బీడ్కొనఁ బ్రీతి నాతఁడును భూపాధీశుఁ బొమ్మంచు దీ
వెన లియ్యం గొని వచ్చి వేఁటయెడకున్ స్వమంత్రిశార్దూలుతోన్.

వ. సిద్ధులం గాంచినసంగతి నుడివి యిచ్చో వేఁటాడఁ దగ దంచుఁ దా నందఱం దోడ్కొనిపురంబుం జేరి మృగయులకుం బసదనం బొసంగి వీడ్కొలిపి యంతిపురంబునకుం జని మజ్జనభోజనాదికృత్యంబులు దీర్చికొని సుఖం బుండుసమయంబున భార్యాలలామం బగుపుణ్యవతీదేవికిఁ దాఁ జూచినమునులవృత్తాంతం బంతయు నెఱింగింప నాకర్ణించి విస్మయపరీతచిత్తయై యాపడఁతి ప్రియవల్లభునకు నిట్లనియె. 54

తే. నాకు నాయోగిజనదర్శనంబు సేయు
భాగ్య మెప్పుడు గల్గును బ్రాణనాథ
మనకు వారిసుదర్శనంబును లభించు
టరుదు గద యంచుఁ బల్కెనఁ దరుణిఁ గాంచి. 55

క. వనితా! యాయోగిగణం
బును జూడఁగ వచ్చు వారి ముదలం గొనినాఁ
డను నొకదినమున నచటికిఁ
జని వారిసుదర్శనంబు సల్పుద మెసఁగన్. 56

తే. అని ముదం బారఁ జెప్పి తానంత మదిని
సిద్ధవర్యుండు సంప్రీతిఁ జెప్పినట్టి
సిద్ధలింగేశ్వరాలయ మద్దరిత్రి
వెలయఁ గట్టింపవలె నంచుఁ దలఁచి యవుడు. 57

వ. సుబుద్ధి యనుమంత్రివర్యుని రావించి యాలయనిర్మాణంబునకు శిల్పిసత్తముల రావింపు మనుడు నతం డట్లు రావించి ఱేని కెఱింగింప నతం డాశిల్పులను శిథిలం బైయుండుదేవాగారంబునకుం దోడ్కొనిపోయి యత్యంతమనోజ్ఞంబుగ దీని నిర్మింపుఁ డని యానతియ్య వారలు మహాప్రసాదం బని. 58

ఆ. పటుతరోజ్జ్వలోరు ప్రాకారపంక్తులు
బహువిచిత్రమండపములు వివిధ
రత్నరచితకలశ రాజరాజితగోపు
రములు గర్భమందిరములగములు. 59

క. విరచించిరి కైలాసము, కరణిం జెలువార భూమిఁ గాంతుం డంతన్
ధరణీనిర్జరవరులను, సరగున రావించి మ్రొక్కి సవినయమతితోన్.

వ. ప్రశస్తం బగునొకశుభముహూర్తంబు చూడుఁ డందు శ్రీసిద్ధలింగే శ్వరుం బ్రతిష్ఠింపవలయు ననిన వా రొకలగ్నంబును బరిశోధించి చెప్ప నాలగ్నంబునందు రాజేంద్రుండు సకలవస్తుసముదాయంబు దెప్పించి తాను బుణ్యావతీసమేతుం డై నిత్యకృత్యంబులు నిర్వర్తించి కొని భూసురనారీరత్నంబులను సకలవేదశాస్త్రపారంగతు లగు విప్రేంద్రులను దోడ్కొని తదాలయంబునకు మంగళవాద్యవిశే షంబులతోఁ జని యర్చించుటకు నిర్ణయించినధరణీసుపర్వుల ము న్నిడుకొని నాసిద్ధలింగంబును నమకచమకమహాన్యాసాదిమంత్రంబు లచే నభిషేకంబు గావించి వేదమంత్రఘోషంబులు సెలంగ వివిధ వాద్యాభిరవంబులు మిన్నుముట్ట నాసిద్ధలింగంబును బ్రతిష్ఠించి భూ సురబృందంబునకుం గనకవస్తువాహనాంబరాదులచే సన్మానింపఁ బంచి శిల్పోత్తములకు వలసినపసదనంబు లొసంగి నాఁటంగోలె నా స్వామికి నృత్తగీతవాద్యములతో నిత్యోత్సవంబులు సేయించుచుఁ దద్భక్తి మనంబున నెలకొల్పి రాజ్యంబు పాలించుచు నుండ నొక్క నాఁడు భార్యాలలామం బగుపుణ్యావతీదేవి డగ్గఱకు నేతెంచి కడుఁ జింత ని ట్లనియె. 61

పుణ్యావతీదేవి సంతానహీనతకు భర్తతోఁ జింతించుట.

సీ. వల్లభా! వినుము భూవలయంబునందుఁ బు
త్త్రిణ లోకాఞ్జయతి యనుశ్రుతిని
బుధులు వక్కాణింపఁ బొనఁగ వింటిని గొంత
పుత్త్రులు లేనట్టి భోగ మేల?

గజతురంగము లేల ఽ కనకసౌధము లేల?
 రథము లేల? మఱియా ఽ రాజ్య మేల?
పుత్త్రభాగ్యం బుండి ఽ భూరిసంపద లున్న
 దానికంటె సుఖంబు ఽ ధరణిఁ గలదె?
కాన ననపత్యదోషంబు ఽ కంటె జగతి
పాప మొక్కండు గలదె? భూ ఽ పాలచంద్ర!
మోక్షధన మెట్లు లభియించు? ఽ మొనసి దీని
కిపుడు పెద్దల రావించి ఽ యెఱుఁగఁ జేయు. 62

క. ధన మెంత నీకుఁ గల దని
జను లడుగరు నీకుఁ బుత్త్ర ఽ సంపద గలదే
యని యడుగుదు రాత్మేశ్వర
ధన ముండిన నేమి పుత్త్ర ఽ ధనసదృశంబే. 63

క. తనయులు గలపుణ్యాత్ములు
ధనికులు గా కున్న ఽ ధనము తనయులు గారే!
ధన మున్నఁ గులము పెరుఁగునె?
తనయులు గల రేని కులము ఽ ధాత్రిం బెరుఁగున్. 64

వ. మఱియుం దగినసుందరాలంకారంబులఁ బుత్త్రుల నలంకరించి వారాడుముచ్చటలం గన్నులపండువుగఁ జూచి సంతసంపడుపుణ్యాంగనలకన్నులు కన్నులు వారిం గన్నదేహమే దేహము నా కట్టిపున్నెము లభించునే యంచు వెండియు ని ట్లనియె. 65

సీ. వాసరేశుఁడు లేని ఽ వాసరంబుసరణి
 రేదార లేనట్టి ఽ రేయిపగిదిఁ
గవిపుంగవులు లేని ఽ ఘనరాజసభవోలె
 దీపంబు లేనిమం ఽ దిరమురీతి
ఫలపుష్పములు లేని ఽ పాదపంబుగతిని
 వరపికంబులు లేని ఽ వనముభంగి

హంసలు లేనిప ద్మాకరంబునక్రియఁ
  ప్రణవంబు లేనిమంత్రంబుభాతి
సలిలములు లేనిమఱిపెద్ద సరసిమాడ్కి-
నెఱి హిరణ్యము లేనిమా నికములీల
సత్సుగంధంబు లేనివా సంతికరణి
నెంత యుండిన నేమి భూ కాంత మనకు. 66

మ. అకటా! పుత్త్రులు లేక యుండుఁ డను చక్రయ్యంభోజగర్భుండు వే
ఱొకకార్యం బొనరింపకుండ నొసటన్ యోచించి యీరీతి నిం
చుక కారుణ్యము లేక వ్రాసెఁ దగ నంచుం బల్కుచున్నట్టిభా
ర్యకుఁ జింతింపకు మంచు ని ట్లనియె నాగరాజేంద్రుఁ డొప్పారఁగన్.

క. మును చేసికొన్నకర్మం
బనుభోగింపంగవలయు నది బ్రహ్మకు నై
నను వదలదు దీనికి యో
చన సేయఁగఁ బుత్త్రఫలము సమకొనఁ గలదే. 68

తే. జలధిఁ గలశంబు ముంచి యాజలధి నుండు
జలము నంతయుఁ గొంపోవఁ దలఁచి తేని
కలశమును బట్టినంతకు జలము వచ్చు
గాన మనభాగ్య మధికంబు గల్గఁ గలదె. 69

తే. అయిన నిప్పుడు పెద్దల నడుగుకొఱకు
గరిమరావింతు నని మంత్రిఁ గాంచి యిపుడు
మహితయశు లగుదైవజ్ఞ మణులఁ బ్రీతిఁ
దనర రావింపు మనవుడుఁ దత్క్షణంబ. 70

వ. వార్తాంతికశిఖామణు లగువిభావసుచిత్త యజ్ఞదత్తు లనుబల్యాంకి
కలంపి రావించి యుచితాసనంబుల నాసీనులం జేసి రాజున కెఱిం
గింప నతండు పుణ్యవతీసమేతుం డై ఫలపుష్పతాంబూలంబుల నొక
పసిండిపళ్లెరంబున నిడికొని యాజ్యోతిషికవరిష్ఠుల ముందిడి వారికి
దండప్రణామంబు లాచరించి తనజన్మపత్త్రిక యొసంగి యి ట్లనియె.

ఆ. బుధవరేణ్యులార! ఽ పుత్త్రు లింతకు మాకుఁ
గల్గ కుండుటకును ఽ గారణంబు
దెలియ కున్న దదియుఁ ఽ దెల్పుఁడు యోచించి
దాఁచిపెట్టకుండఁ ఽ దలఁపుమీఱ. 72

చ. అన విని వారు జాతకము ఽ నంతయుఁ జూచి మహీతలేంద్రుతో
ననిరి"నరేంద్ర!పుత్త్రవిష ఽ యంబును జూచితి మందుఁ బుత్త్రికా
జనన మొకండు శంభుదయ ఽ సంభవ మా నిది నిశ్చయంబు మీ
రనుముదమందుఁ డీశ్వరుని ఽ రూఢిగ నర్చితుఁ జేయుఁ డెప్పుడున్.73

క. తొలి మీరు పేదబిడ్డలఁ
దిలకించి యసూయపడుచుఁ ఽ దిట్టినపాపం
బిల నంటె నదియ నృపవర
కలిగినదోషంబు వింటె ఽ కావున మహిలోన్. 74

ఆ. కలిమి యున్న దంచు ఽ గర్వంబుతోడ బీ
దలను జూచి తిట్టి ఽ యలఁతిచేయఁ
దగునె యెరికైన ఽ దాన నుమాపతి
కరుణఁ గనఁడు వారి ఽ నరవరేణ్య! 75

వ. అని చెప్పి రాజు నాశీర్వదించి యిఁకేము వోవుద మనుఁడు నాభూ
పాలుం డవ్వారికి వలసినకనకం బొసంగి మర్యాద నంపినవాఁ డయ్యె
నంత. 76

తే. పుణ్యవతి వింటె పెద్దలు ఽ పుత్త్రవిషయ
మెఱుఁగఁ జేసిన దంతయు ఽ నిపుడు మనము
సేయునది యేమి భక్తిమై ఽ శివునిపూజ
తప్ప వే ఱద్ది లేదు పాతకము తలఁగ. 77

మ. విను మాత్త్రేశ్వర రాజ్యనై భవముచే ఽ విశ్వంబు గాన్పింప ద
మ్మునులం గాంచితివారిపాదకమలం ఽ బుల్ భక్తి సేవించి తం
చును నాతోఁ గడువేడ్కఁ జెప్పితివి యఽచ్చో వారిఁ జూడంగ ని
న్నెనియుం బోమ్మెద నంచుఁ బల్కితివి పోకుండంగ మేల్గందుమే.78

వ. ఇప్పు డాయోగివీరులకడకుం జని పుత్త్రదోషపరిహారార్థం బడుగుద మూరకుండ ఫలం బేమి యనిన నారాజేంద్రుండు సంతోషించి యా సిద్ధులకడకుం బోవ నిశ్చయించినవాఁడై మఱునాఁ డరుణోదయంబున. 79

తే. మునులపాలికిఁ బోవుచు మనము రథము
నెక్కి పోవుట తగవు గాదెవుడు తరుణి
నడచిపోదము రమ్ము మానంబు లెసఁగ
నంచుఁ బరిజనములఁ గూడి యరుగుదెంచి. 80

వ. అవ్వనాంతరంబునం బ్రవేశించి పినాకినీ నదియందు దంపతులు స్నానంబుచేసి మడుంగులు గట్టుకొని వచ్చినపరిజనంబుల నట నిల్పి తాము ఫలపుష్పతాంబూలాదు లిడినట్టిబంగరు పళ్లెరంబు చేఁ బూని సిద్ధగణం బుండువటవృక్షమూలంబుకడకుం బోయి వారిముందట నా పళ్లెరంబు వెట్టి సభక్తిపూర్వకంబుగ దండప్రణామంబు లాచరించి బద్ధాంజలులై నిలువంబడిన నాదంపతులం జూచి శివయోగీంద్రుండు. 81

క. జననాథచంద్ర! నీవ
చ్చినకార్య మెఱింగినాఁడఁ జింతింపకు నీ
యనుపమభక్తికి మెచ్చితి
ననఘాయోగిగారుచుండు మని యిట్లనియెన్. 82

శివయోగీంద్రుఁడు చంద్రగుప్తనరేంద్రునకుఁ బంచాక్షరీ మంత్ర ముపదేశించి తత్ప్రభావంబు చెప్పుట.

సీ. ధరణీతలేంద్ర! సంతానభాగ్యము నీకుఁ
బురహరుఁ డియ్యఁడె పూజసేయ
సమరకేళిజయంబు సమకూడునట్లుగఁ
బురహరుఁ డియ్యఁడె పూజసేయ
సకలపాపచయంబు సమయఁ జేసిసుఖంబు
పురహరుఁ డియ్యఁడె పూజసేయ

నజ్ఞానతిమిరంబు నడఁచి సుజ్ఞానంబు
పురహరుఁ డియ్యెఁడె పూజసేయ
నరవిఁ బురహరుమంత్రరాజంబు నీవు
పరఁగ నుపదేశమునఁ బొంది భక్తి నెపుడు
జపము చేసినచో నభీష్టంబు గల్గు
గాన నామంత్రమహిమ శక్యంబె పొగడ. 83

క. పురహరునివలనఁ గాలుఁడు
హరివలన ధనంజయుండు హరిదశ్వునిచే
హరిసుతుఁడు గార్గ్యమునిచే
హరియును నామంత్ర మెఱిఁగి రవనీనాథా. 84

సీ. మఱి మంత్రముల కాది మంత్రరాజం బిది
గ్రహములయందు భాస్కరునికరణిఁ
బరమవస్తువులందుఁ బ్రాణంబు కైవడిఁ
దరువులలోఁ గల్పతరువుమాడ్కి
నస్త్రంబులందు బ్రహ్మాస్త్రంబువిధమున
ధేనువులం గామధేనువుగతి
నవతారములను రామావతారముపోలె
దానములం దన్నదానముక్రియ
మహితశైలములందు హేమాద్రికరణి
సర్వతీర్థంబులం దొగి జాహ్నవివలె
మంత్రములయందు మేటి యై మహిమఁ గాంచు
బరఁగ నామంత్ర మెఱుఁగనినరుఁడు నరుఁడె. ? 85

వ. అని శివయోగీంద్రుండు నుడువ నాచంద్రగుప్తనరేంద్రుం డాకర్ణించి యమ్మంత్రరాజంబు నా కుపదేశింపుఁ డని పెక్కువిధంబులం బ్రార్థింప నమ్మునివర్యుం డనుకంపాయత్తచిత్తంబున నాఱేనిం గూర్చుండఁబెట్టుకొని యంగన్యాసాదిపూర్వకంబుగ నప్పంచాక్షరీ మంత్రరాజం బుపదేశించె నంత నమ్మనుజేంద్రుం డాయోగివీరుని పదపద్మంబులకు దండప్రణామంబు లాచరించి యి ట్లనియె. 86

చంద్రగుప్తునకు శివయోగీంద్రుఁడు కళావతీచరిత్రంబు చెప్పుట.

తే. మహితగుణసాంద్ర యిమ్మంత్ర మహిమవలన
నెవరు శుభ మందిరవ్వారి నెఱుఁగఁ జెప్ప
వలయు నని వేఁడుచున్న భూవలయపతికి
నమ్మహాయోగివర్యుఁ డిట్లనియెఁ బ్రీతి. 87

చ. మనుజవరేణ్య యిమ్మహిత మంత్రవిశేషముచేతఁ గీర్తి నొం
దినజను లెందఱో కలరు దెల్పెద నొక్కచరిత్ర మిప్డు నె
మ్మనమున నాలకింపు జనమాన్యుఁ డుఁ ధీరుఁడు వజ్రదేహుఁ డం
చును విలసిల్లె ధర్మగుణ శోభితుఁ డర్థిజనానుకూలుఁడై. 88

వ. అతండు కాశికాపురపాలకుఁడై సకలవిభూతిం బొందినవాఁ డయ్యు ననపత్యదోషంబునం బెద్దకాలం బుండి పర్యవసానంబున సానంద మహర్షి వలన నిమ్మంత్రరాజం బుపదేశింపఁబడి తత్ప్రభావంబునం గొన్నాళ్లకు సర్వలక్షణసమన్విత యగు నొకకన్యకారత్నంబునుం గనియె. 89

ఆ. అంతఁ గన్నపట్టి కవనిం గళావతి
యనఁగ నామ మిడి ప్రియముగఁ బెంపు
సేయుచుండ నెలమిచేఁ గోమలం బైన
తరుణమల్లికాలతయునుం బోలె. 90

వ. ప్రవృద్ధమాన యగుచు గురువువలన సకలవిద్యాదు లభ్యసించి సవయస్కలతో నాటలపాటలం గాలంబు గడపుచు నుండం గ్రమంబుగఁ బండ్రెండేఁడులు నిండారె నంత నొక్కనాఁడు. 91

క. గంగాతీరమునం దా, గంగాధరుఁ బోలు నొక్క ఘనయోగి కృపన్
గంగాధరమంత్రం బు, ప్పొంగఁ గళావతికిఁ జెప్పి పోయె దానిన్.

ఆ. ఒరుల కెఱుఁగనీయకుండ నెల్లప్పుడు
మానసమున భక్తిఁ బూని జపము

చేసికొంచు నుండెఁ జెలువుగ జవ్వనం
బంతకంత నిండె నపుడు మదిని. 93

వ. జనకుం డగువజ్రదేహుండు కళావతికి వివాహంబు సేయం దలంచి వర్హ్హ్వరాన్వేషణంబునకు విప్రోత్తములం బంపుటం జేసి వారి యందు. 94

సీ. బ్రాహ్మణుండొక్కఁడు వరుని నన్వేషింప
వచ్చుచుఁ బాండ్యభూవరునిసుతుఁడు
దశరథుం డనువానిఁ దగఁ గాంచి యీతండు
మనరాజపుత్త్రికి మగఁ డటంచు
మది నిర్ణయించి నెమ్మది నిజరాజచం
ద్రునికడకుం జని గని ముదమునఁ
దాఁ గన్న రాజనందనులకు మేటిగఁ
బాండ్యరాజసుతుండు బా గటంచుఁ

బాగడి చెప్పఁగ నారాజపుంగవుండు
సంతసము నొంది మీఁది కర్జంబు సిద్ధ
పఱచి యాపాండ్యదేశభూపాలుసుతున
కెలమిఁ దనకూఁతు నొసఁగి పెండిలి యొనర్చె. 95

తే. అంతఁ గొన్ని దినంబులకు గాన్నృపుండు
కూఁతు నల్లునిఁ దగఁ బంపఁ గోరి వారి
కెలమి సద్భూషణాంబరంబుల నొసంగి
పాండ్యదేశంబునకుఁ బంపెఁ బ్రజలు పొగడ. 96

వ. అంత నా పాండ్యదేశాధిపతిపుత్త్రుండు కళావతిం దోడ్కొని పురంబుం జేరి. 97

క. సరగమఱునాఁటిరే బల్సరసుం డాదశరథుఁడు గళావతితోడన్
సురుచిరశయ్యాగృహమున, మరుకేళింగూడఁబోవ మగనికినదియొన్.

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము
సుల్తాన్‌బజార్, హైదరాబాద్. 1.

సీ. జననాథ యేను బం చాక్షరీమంత్రంబు
మద్గురు నానతి మది జపింతు
దానిచే ననుఁ గూడఁ దగ దదేమన్నను
జెప్పెద మఱి తాల్మిఁ జెంది వినుము
మహి రాజులకు బుద్ధిమాంద్యవిశేషంబు
చేత సద్బుధులతోఁ జేరకుండ
దుశ్చరిత్రులఁ గూడి దుష్కార్యములు సేయు
చుండుట సత్కీర్తి చూఱగొనుట
మద్యపానం బొనర్చుట మాంసభక్ష
ణంబు సేయుట యన్యాంగనలను గనుట
జూదమాడుట విబుధులఁ జూచి నగుట
విహితధర్మంబు విడుచుట వేఁటసనుట. 99

తే. ఇట్టిదుర్గుణములుచాల నెసఁగియుంట
వలన రాజులు పరమపావనులు గారు
గాన నీయందుఁ బరిశుద్ధి లేనికతనఁ
జెప్పితిని రాకు మింక నా చెంత కనఁగ. 100

తరలవృత్తము. విని కళావతితోడ నానృప వీరు డిట్లనియెం బ్రియం
బున మృగాక్షి మనోజబాధకుఁ బోవుచున్నది ప్రాణముల్
కనికరంబున నన్నుఁ జేరిచి కావవే యని కౌఁగిలిం
చెను మదంబునఁ దాళఁ జాలక చెచ్చెరం దమి దీరఁగన్. 101

తే. అంత నారాజపుత్త్రిఁ డాయింతి నట్లు
గలయుటం జేసి యగ్గిచేఁ గాల్చినట్లు
దేహ మెరియంగ నఱచి ధాత్రీతలంబు
నందుఁ గడు సోలి వడి వెఱపొంది లేచి. 102

తే. చిచ్చులోఁ బడి పాఱెడు చిలువకరణి
మృగయునిం జూచి పఱచెడు మృగముభంగి

పఱచునాదశరథుని నఽప్పుడఁతి చూచి
పట్టి యొక్కెడఁ గూర్చుండఁఽబెట్టె నంత. 103

వ. ఎట్టకేలకు నాదశరథుం డోడ లెఱింగి నలువలంకులం గలయం
జూచి డగ్గఱ నుండుకళావతితో నిట్లనియె. 104

మ. తరుణీ యే మిది వింత నాతనువు ప్రఽత్యక్షంబుగా నగ్నిచేఁ
బరితప్తం బగునట్టు లున్నయది యోఽపంజాల నీబాధకుఁ
సరసిం గ్రుంకెదఁ బోయి చల్లఁబడ నీఽచాడ్పాటకుం గారణం
బరయం గన్పడకున్న దం చనునిజాఽత్మాధీశ్వరుం బ్రీతితోన్. 105

వ. కనుంగొని యి ట్లనియె. 106

తే. మహితపంచాక్షరీమంత్రఽమహిమవలన
నివ్విధం బయ్యెఁ గావునఽనిప్డు భక్తిఁ
బరమపంచాక్షరిం దగుఽగురుని వేఁడి
తెలిసికొని రమ్ము సుఖ మగుఽదేహ మనిన. 107

క. విని యాదశరథుఁ డమ్మొయి
ఘనగురుపదపద్మపూజఁఽగావించి సుభ
క్తిని బంచాక్షరి మంత్రం
బును బొంది జపింప దేహఽమొగి సుఖమయ్యెన్. 108

తే. అంత నామంత్రమునఁ బుణ్యుఁఽడయితి నంచు
సంతసంబునఁ దనభార్యఽచెంతఁ జేరి
మహితపంచాక్షరీమంత్రఽమహిమ యిపుడు
దెలిసితి నటంచుఁ జెప్ప నాఽపొలఁతి వేడ్క. 109

వ. హృదయేశ్వరుం గనుంగొని యిపుడు పంచాక్షరీమంత్రప్రభావం
బెఱింగినవాఁడ వగుటంజేసి నీదేహంబు పావనం బయ్యె నిఁక నా
తోడిసుఖక్రీడాదులతో ముదంబున నుండు మని నుడువ నా దశ
రథుం డమ్మొయి నుండఁ బర్యవసానంబున నాదంపతు లిద్దఱు శివలోక
వాసు లై రని శివయోగీంద్రుండు వక్కాణింప నాచంద్రగుప్తుం డా
కర్ణించి యాయోగివీరున కి ట్లనియె. 110

మత్తకోకిలము. ఓమునీశ్వర యిట్టిమంత్రముఁగొంచినట్టిజనంబు లె
ట్లో మహేశునిఁ బూజ సేయుదు రావిధిం గృపఁ జెప్పు మం
చామహీపతి వేఁడ నామహిమాత్ముఁ డానృపవర్యునిం
బ్రేమఁ జూచి శివార్చనం బొనరించుమార్గము నంతయున్. 111

చంద్రగుప్తునకు శివపూజాక్రమంబు శివయోగిచెప్పుట.

వ. ఇట్లు చెప్పం దొడంగె "ప్రాతఃకాలంబున నఘపావనమంత్రరాజంబులు పఠించుచు శుద్ధతోయంబులందు స్నానంబుచేసి శుద్ధవస్త్రంబు ధరియించి జాబాలోపనిషదుక్తప్రకారంబున నుత్తమాంగలలాటభుజకంఠోరస్స్థలం బంచమంత్రంబుల నుడువుచు విభూతిం ద్రిపుండ్రంబులు దాల్చి సంధ్యావందనాది నిత్యకృత్యంబులు దీర్చుకొని వల్మీకమృణ్మయంబుగా శివలింగం బొనర్చి కరతలంబునం బెట్టికొని నమకచమకమహాన్యాసాదిమంత్రంబులు పఠించుచు గంధోదకంబున నభిషవంబుచేసి సుగంధపుష్పశ్వేతాక్షతల నర్చించి ధూపదీపనైవేద్యంబుల నప్పార్వతీపతికిం బరితృప్తిచేసి రుద్రాక్షమాలిక చేతం బూని తన్మంత్రరాజంబును నిశ్చలభక్తి జపింపవలయు నని వెండియు ని ట్లనియె. 112

ఆ. నరవరేణ్య యట్లొనర్చినవారికి
శంకరుండు మెచ్చి సకలభాగ్య
మిచ్చు నట్టిపూజ నెవఁడు సేయునొ వానిఁ
గనులఁ జూడఁ బాయుఁ గల్మషంబు. 113

వ. కావున శివపూజావిధానం బిది యనిన నమ్మనుజేంద్రుఁడు విభూతి మహిమ నెఱింగింప వేఁడెద ననిన నయ్యోగీశ్వరుం డి ట్లనియె. 114

శివయోగి చంద్రగుప్తునకు విభూతిమహిమ చెప్పుట.

సీ. రాజేంద్ర తొల్లి విక్రమభానుఁ డనురాజు
దుర్జనస్నేహంబు దొడరి విప్ర
జనుల నిందింపంగఁ గని విప్రుఁ డొక్కఁ డా
గ్రహమున నాతనిఁ గాంచి నీవు

భువి బ్రహ్మరాక్షసుండవు గ మ్మటంచు శా
పంబు వెట్టంగ భూపాలుఁ డట్లు
శాపంబు నొంది దుస్సహా మగుక్షుత్పీడ
కోపక కాననలోఁ దాపసుఁ డగు
వామదేవమహామునీశ్వరునిఁ జూచి
పట్టి భుజియింపఁ గోరి చొప్పడఁగ వచ్చి
కౌఁగిలింపఁగ నమ్మహాఘనుఁడు భూతిఁ
దాల్చియుండుటఁ జేసి యాదైత్యవరుఁడు. 115

ఆ. ఒడలు మంట లెత్తి హాహాయని యఱచుచుం
బఱచి పుడమియందుఁ బడియె నంత
దత్ప్రభావమునకు దైత్యరూపము ప్రోవఁ
దొంటితనువు దాల్చి దురిత మెడలి. 116

సుధర్ముం డనువిప్రుని చరిత్రము.

వ. మఱియు నొకవిప్రేంద్రునిచరిత్రంబు నుడివెద నాకర్ణింపుము. 117

సీ. కాశ్మీరదేశభూకాంతుండు వజ్రదే
హుం డనురాజుపేరోలగమున
నుండి పురోహితు నండఁ జీరి కరంబు
కోపించి నీతి నెక్కొనఁగ ననియె
ఓసుధర్ముండ నీకీసుధర్మాభిధే
యము సార్థకంబు గాదవని మఱియు
ధాత్రృవంశమున నుద్భవమొందుటే కాని
వేదాదివిద్య లెవ్వియును రావు
ముఖమునం బ్రేతవర్చస్సు మొనయ నిట్లు
సిగ్గు లేకుండఁ గొల్వులోఁ జేరి గొప్ప
పండితులకును సరి గాఁగ భయము లేక
కూరుచుండుట తగునె పాపక్రూరమతుఁడ. 118

వ. అనిన విని సుధర్ముండు మోము వాంచి విన్నఁదనంబున నన్నరేంద్రున కిట్లనియె. 119

మ. వదలక యోనృపాల బుధవర్యులడగ్గఱఁ జేరి చక్కఁగాఁ
జదివితిఁగాని నాకు నొక శాస్త్రమునైనను రాకపోయె నే
నదిమొద లూరకుంటి నిఁక నాపయి నేనొనరించుకర్జము
న్నదియె యటంచుఁ బల్క నరనాథుఁడు విస్మయ మంది యి ట్లనెన్.

సుగంధివృత్తము. ఓసుధర్మ నీవు లజ్జనొందకిట్లు కొల్వులో
భూసురుండ వయ్యు నోటఁ బూని విద్య రా దటం
చీసు కూడ లేక పల్కుటింతె చాలు పో బళీ
మానిసై జనించి విద్యమాని వేయ వచ్చునే. 121

వ. అని యాభూపాలుండు పల్కుటం జేసి యాసుధర్ముం డత్యంతరోషా
యత్తచిత్తుం డై ఘటికాద్రికిం జని నారసింహునిమనంబునం గడు
భక్తిఁ గొలువ నాహరి సత్కృపాంతరంగుం డై సకలవిద్యాపారం
గతుండవు గ మ్మని వరం బిచ్చి యంతర్హితుం డయ్యె నంత. 122

తే. నిజపురంబున కేతెంచి నెమ్మి మీఱ
బంధుజనములు మిత్రులు పండితుఁ డని
పొగడఁ దనకంటె నిఁక జగంబునఁ గవీంద్రు
డుండఁ డని గర్వమును బొందియుండె నెలమి. 123

వ. ఒకనాఁ డావజ్రదేహభూపాలాగ్రణి నిత్యశ్రీమంతు లగుసామంతు
లును సురూపజితమారు లగురాజకుమారులును రాజ్యతంత్ర స్వ
తంత్రు లగుసుమంత్రులును సద్గుణసుధాసింధువు లగుబంధువులును,
సకలవిద్యాంబుజాకరరవు లగుకవులును మనోసుఖసంధాయకు లగు
గాయకులును గొలువ నిండుకొలు వుండుసమయంబునఁ దనయ
సమానపాండిత్యంబు మెఱయింప విచ్చేయుటం జూచి నృపవరేణ్యుం
డెదు రేఁగి తోడ్కొనివచ్చి యుచితాసనాసీనుం జేసి దండంబు లిడి
విస్మయపరీతచేతస్కుం డై యాసుధర్మవిప్రున కి ట్లనియె. 124

క. పండుని తెఱఁగున నీవిధ
ముండుట సరి గా దటంచు నురుకోపముతోఁ

పండితులయొద్దఁ జదువను
దండించితిఁ బొమ్మటంచు దానికి మదిలోన్. 125

తే. ఏమితప్పు తలంచితో యిపుడు నీవు
ఖాంబుజము చూడ దివ్యతేజంబు దనరి
యుండుటం జేసి భయ మొందు చున్నవాఁడఁ
గాన మన్నింప వేఁడెదఁ గవివరేణ్య. 126

వ. అనిన విని రాజేంద్రున కాసుధర్ముం డి ట్లనియె. 127

క. దండించినందులకు నిం
దుండక ఘటికాద్రి కేఁగి యురుభక్తి హరిన్
మెండుగ నుతించి వేడ న
తండు మనోభీష్ట మొసఁగె దయ దయివాఱన్. 128

వ. అంత నచ్చోటు వాసి మద్విద్యాపాటవంబు భవత్సభాంతరాళం
బున మెఱయింప విచ్చేసితి ననిన నమ్మనుజేశ్వరుం డం దుండుకోవి
దోత్తములం జూచి "మీర లీసుధర్మభూనిర్జరునితోఁ బ్రసంగం బీదినం
బు సేయుం డని ముదల నియ్య వా రట్లు దమవిద్యానైపుణ్యము మెఱ
యించి పర్యవసానంబున నాసుధర్మునివలన నపజయంబు నొందినవా
రై రప్పు డారాజు సుధర్మునకు వివిధభూషణాంబరాదులు బహు
మానం బిచ్చి నిజవిద్వత్సభానాయకుం జేసినవాఁ డై యంత నొక్క
నాఁడు. 129

తే. ధారుణీపతి శూలివ్రతంబు చేసి
భూసురేంద్రులకున్ భక్తి పూర్వకముగ
దానములు సేయు చుండ సుధర్ముఁ డేఁగి
వచ్చి రాజేంద్రు నని యె నిర్వ్యాదువు మీఱ. 130

సీ. విను రాజవర్య యీ విప్రులయం దుండు
పండితులం గొన్ని ప్రశ్న లడిగి
పాండిత్యమును గాంచి బహుమానము లొసంగ
నది యుక్త మగు నూర కందఱకును

భూదానగోదానములు లొసంగ ఫల మేమి
    యనఁగ నమ్మను జేసెఁ డాసుధర్ముఁ
గని యిట్టు లనియె నో కవిపుంగవా నీకుఁ
    దోఁచినరీతిగఁ దాఁడరి చేయు
మంచు నానతియ్య నాసుధర్మాఖ్యుండు
బ్రాహ్మణోత్తములను బరిభవించి
హా మ్మటంచుఁ బల్కి భూదేవునిం జూచి
వృద్ధవిప్రుఁ డగువికరించి యచట. 131

తే. కూరుచుండియు ననియె మూల్గుచును లేచి
విప్రేంద్ర! నీవు నాకంటె విశ్వమందుఁ
బండితుఁడు లేఁ డటంచు ని బ్భంగి బుధులఁ
బరిభవము సేయు టుచితంబె పాఱుఁ డయ్య. 132

వ. మఱియు బ్రాహ్మణులను వేదములను గులస్త్రీలను బేదవాండ్రను నతిథులను వృద్ధులను గ్రుడ్డివాండ్రను సన్న్యాసులను గురువులను మాతాపితలను స్వరాజును స్వబంధుజనంబులను విద్వాంసులను గౌరవింపందగు నట్లు సేయం బరమశోభనం బిట్టిధర్మ మెఱింగి మిన్నక వదరుచున్నాఁడ వీఁక నూరకుండు మని వెండియు నిట్లనియె. 133

సీ. కలహంస లేనట్టి కమలాకరంబునఁ
    గులుకుచుఁ దిరిగెడు కొంగ హంస
కోయిల లేనట్టి కొమరారువనమునఁ
    గూయుచుం డెడుగూబ కోకిలంబు
ధేనువు లేనట్టి దేశంబులోనుండు
    మహిషంబు పరికింప మహితగోవు
చూడవృక్షము లేని చోట నుండెడు తాళ
    వృక్షంబు గద కల్ప వృక్ష మింక
పండితుఁడు లేనిరాజసభాస్థలమునఁ
బరఁగునీవంటిశుంఠయ పండితుండు

చదువుకొన్నట్టివాఁ డని ఽ జనము లెల్లఁ
దెలిసికొన్నారు పొ మ్మింకఁ ఽ బలుక నేల. 134

వ. అని మాయయజుండుపల్కుటం జూచి సుధర్ముం డలుక మించి యవ్విరించి కి ట్లనియె. 135

తే. పొగరు మించెనో బడుగువిఽప్రుండ నీకు
నూర కిచ్చోటఁ గూర్చుండిఽయుండ కుండఁ
బ్రల్లదము లాడె దారార ఽ ప్రజ్ఞ దప్పి
చదువు లేనట్టిమూఢుఁడా! ఽ చాలుఁ బొమ్ము. 136

క. ఈమీఁదట మాటాడిన
చో మానము పోవు నడచు ఽ చుండుము మఱి నీ
వే మేమి చదివి నాతో
సామర్థ్యము సూప నిట్లు ఽ చనినాఁడ వనన్. 137

తే. మాయవిప్రుఁడు గాంచి యో ఽ మాయవాది!
బ్రహ్మకులఘాతకా! నన్నుఁ ఽ బ్రబలయరుద్రుఁ
డైన మొండొడ్డి మాటాడ ఽ కవలఁ బొమ్మ
టంచుఁ బల్కెనె! యేమిధైర్యం బయారె! 138

తే. మఱియు నే మేమి చదివి సా ఽ మర్థ్య మిందుఁ
జూప వచ్చితి వంటివి ఽ చుల్కఁదనము
చేత నీ వేమి చదివితోఁ ఽ జెప్పు కొంత
చూత మూరక యీరాజుఽచూచి నిన్ను. 139

వ. పండితుం డని మెఱమెచ్చుసేయుంగాని యీసభాసదు లెవ్వరు నిన్నుఁ గొనియాడ రింకఁ గపటవిద్యాప్రసంగం బేసభయందుం గాని సేయకు మనిన నాసుధర్ముం డిభరాజేంద్రుమీఁది కుఱుకుకంఠీరవంబుచందంబున సరగున నమ్మాయావిప్రునికరంబువట్టి సభనుండి యీవలకు నీడ్చి పొమ్మనుటం జూచి యయ్యజుం డి ట్లనియె. 140

తే. ఓరిపాపాత్మ! రాజు వి ఽ ప్రోత్తములకు
నీవు లిచ్చెడు వేళ నీ ఽ వెచటనుండి

వచ్చితివి పాఱునీటికాల్వను జెడంగఁ
బోఁచవడినట్లు దాన మీఁకబోకుఁ డంచు. 141

వ. వచియించి విప్రుల కొసంగ నీక వారిం బరిభవించుటం జేసి దగవు
గాదని నీతిచెప్పి తండులకుం గావరంబున. 142

సుగంధివృత్తము. నోరు మూయు మంటి నన్ను నోరికొద్ది ధాత్రిలో
నోరు లేక యుండు నీమ నోరథంబు దీరఁగా
నోరి మూఢ యంచు నజ్జ యోని నాల్గుమోములం
బే రెఱుంగఁ జూపి ప్రోయె భీతిఁ జూడ నెల్లరున్. 143

వ. అంత నాసుధర్మునకు మూఁగతనంబు వాటిల్లుటం జేసి రాజేంద్రుండు
తనమనమ్మున. 144

ఆ. ఏల యీసుధర్ముఁ డెదిరించి పండితో
త్తములతోడ లేని తర్కమాడి
పరిభవం బొనర్చె బ్రహ్మశాపం బిప్డు
తొలఁగుమార్గ మెద్ది తలఁప నంచు. 145

తే. ఆసుధర్మునిసోదరుఁ డంతఁ జూచి
యోవిశుద్ధుఁడ! నీయన్న కావిరించి
యిడినశాపంబు వాయంగ నెద్ది యైనఁ
జూడు మొక్కయుపాయంబుఁ జొప్పడంగ. 146

వ. అన విని విశుద్ధుం డట్లు చేసెద నంచు నన్నం దోడ్కొని యింటి కేఁ
గి శాపం బెవరివలనం బాయు నని తలంచుచునుండి "తొల్లి విద్యా
దానంబు చేసినఘటికాచలేశ్వరుపాలికిం బోవ నీశాపం బుడివోవం
జేయు నని యాఘటికాద్రీశుఁ గూర్చి. 147

చ. తప మొనరించె నన్నకుఁ బితామహుఁ డిచ్చినయుగ్రశాపముం
గృపఁ దొలఁగింప నానరహరి న్మది నిల్పి సుభక్తి నంత నా
తపమున కార మేశుఁడు ముదంబును బొంది విశుద్ధుఁ జూచి స
త్కృప న నె నిట్లు విప్రుఁడ విరించియొసంగినశాప మే నొగిన్. 148

ఆ. తొలఁగఁ జేయ నేరఁ దొలి యొసంగినవరం
బునకు విప్రకోటిఁ బూని నింద
చేసి రా జొసంగుకా సియ్యనీ కుండఁ
జేసె నజునిఁ దిట్టెఁ జేవ మించి. 149

వ. అట్టిదుష్టున కిడం బడినశాపకార్యంబు దక్క నితరంబు వేఁడు మను
గ్రహించెద ననిన నవ్విశుద్ధుండు పలువిధంబులం బ్రార్థించినం గా
నిఫలంబు లేదయ్యె నంత నానరహరిం జూచి విశుద్ధుండు దురాగ్ర
హంబున నిట్లనియె. 150

క. ధర నీవ దైవమని యి
క్కరణిం దపమాచరింపఁ గా నిక్కర్జం
బరయఁగ నాచేఁ గాదని
దిరముగఁ బల్కితివి మంచి దేవుఁడవె బళీ. 151

తే. మును త్రిశంకుని గౌశిక మునియు స్వర్గ
మందుఁ జేర్పఁడె యాకీర్తి నెందఱైన
నుండరే ధాత్రియందును నుల్ల మలరఁ
బ్రోచువారలు కరుణింపఁ బోలదొక్క. 152

వ. అని గర్వంబు మించి పల్కునట్టివిశుద్ధుం గాంచి నరహరి కోపోద్రిక్తుం
డై యిట్లనియె. 153

తే. కలుషచిత్తుండ నీయన్న కంటె నీవు
కావరము మించి ననుఁ దిరస్కారముగను
మాటలాడితి వింక నానాఁటి కొడలు
చెడి కృశించెద వని హరి చెప్పి చనియె. 154

వ. అంత నావిశుద్ధుఁ డాశాపంబునకుం గడుభీతి నొంది "యన్నము భ
క్షింపంబోయి తద్భాండముఖంబును గంఠంబునం దగిలించికొన్నసా
రమేయంబుభంగి నా కిట్లు సంభవించెను గదా యంచుఁ జింతించు
చు నిజగృహంబునకుం జని యన్న కెఱింగింప నతఁడు భయభ్రాం

తచ్చిత్తుండై యూరకుండె నంత నావిశుద్ధుండు వజ్రదేహరాజుకడకుం
బోయి జరిగినవృత్తాంతం బెల్ల నుడువ నాతఁడు కోపించి యిట్లనియె.

ఆ. సర్పపేటిఁ గొఱకి సర్పంబుచేఁ దినం
బడినమూషికంబు భంగి యన్న
కొఱకు నీవు వోయి క్రూరశాపము నొంది
వచ్చితే దురాత్మ వగచు చిట్లు. 156

ఉ. ఇంతకు మీయదృష్ట మిల నిమ్మయి నేర్పడియుండ నూరకే
చింత పడంగ నేల యికఁ జేసెడుకార్యము చూడఁ దోఁపదే
దింతకు మిమ్ముఁ దోడ్కొని మహీం గలతీర్థములందు ముంచెదన్
స్వాంతము మీఱఁ దన్మహిమ వారక కావదె యంచు నెమ్మదిన్.

క. ఆవిప్రులఁ దోడ్కొని తా, దేవాగారంబులకును దీర్థంబులకుం
బోవుచుఁ గేదారేశుని, భావం బారంగఁ గొల్వ బార్థివుఁ డెలమిన్.

మ. చని యవ్విప్రులు దాను నచ్చటఁ బ్రశస్తం బైనతీర్థంబునం
దును పాపం బుడివోవఁ గ్రుంకి మడుఁగుల్తోఁ దాల్చి కేదారనా
థునిఁ బ్రార్థింపఁగ వచ్చునప్పు డట వృద్ధుం డర్కతేజుం డుమే
శునిచారిత్రము చెప్పుచుండఁగ జనుల్ సొంపార నాలించుచున్.

తే. కూరుచుండంగ వారితోఁ జేరి తాము
కొంత నాశివచరిత మత్యంతభక్తి
విని ముదంబునఁ బౌరాణికునకు మ్రొక్క
నతఁడు దీవించి మీ రెవ్వరనుచు నడుగ. 160

క. ఆవజ్రదేహభూవరుఁ
డావృద్ధుం బ్రీతిఁ గాంచి యనఘాత్మ ధరి
త్రీవలయమునం దేనొక
భూవరుఁడను వజ్రదేహ భూపాహ్వయుఁడన్. 161

తే. వీరు నాకుఁ బురోహితు లీవ్వరి కిపుడు
కమలజాచ్యుతు లిడినశాపములు తలఁగ

వెంటఁ దోడ్కొని వచ్చితి విమలతీర్థ
సేవనము సేయ ననఁగ భూదేవుఁ డంత. 162

తే. క్షితి నరేంద్రుఁడ తమపురోహితుల కిట్టి
యాపదలు వచ్చెనేని నరాధిపతులుఁ
బ్రోతురే ప్రేమ నిజకార్యపూజ ముడిగి
యింతకంటె శుభంబు నీకెద్ది తలఁప. 163

క. అని తచ్ఛాపవిమోచన
మును జెప్పఁ దొడంగె రాజపుంగవ యటకుం
జనకుం డిటుఁ గూర్చుండుఁడు
ఘనమహిమాఢ్యుండు శిష్యగణసంయుతుఁ డై. 164

వనమయూరవృత్తము. వచ్చెను దధీచిమునివర్యుఁ డిటకుఁ మీ
వచ్చినది చెప్పుకొని వందనము లోలిం
గ్రచ్చఱ నొనర్చు ననుకంప వెలయం దా
నిచ్చును వరంబు భయమేటి కని వేడ్కన్. 165

వ. అప్పౌరాణికుం డగువృద్ధవిప్రేంద్రుండు చెప్ప నాసుధర్మవిశుద్ధులతో నావజ్రదేహభూపాలుం డయ్యెడం బాయక కూర్చుండు సమయంబున ధవళభస్మరుద్రాక్షమాలికాసమలంకృతుండును మహాదేవసంకాశుండు నగుదధీచిమునివరేణ్యుండు శిష్యబృందంబుతో వచ్చుటం జూచి యచటిబ్రాహ్మణోత్తములు సమర్యాదంబుగా నుచితాసనాసీనుం జేసి శిష్యగణంబులం గూర్చుండంజేసి కుశలప్రశ్నంబు లడిగిరాసమయంబున వజ్రదేహుండు సుధర్మవిశుద్ధుల నమ్మునిపదపద్మంబులకు నమస్కరింపుఁ డనితాను భక్తిపూర్వకంబుగ దండప్రణామంబులాచరించి శాపకారణంబు నుడువ నమ్మునీంద్రుఁడు విస్మయపరీతమానసుం డై యన్నరేంద్రున కిట్లనియె. 166

తే. బ్రహ్మవంశోద్భవులకు గర్వంబు గూడ
దెప్పుడును శాంతమును బూని యేరికైనఁ

ప్రీతిఁ గని పల్కవలయును నృపుఁడు ధర్మ
పథము చరియింపవలె దీనబంధుఁ డగుచు. 167

వ. ఇట్టిధర్మం బెఱుంగనివారల కాయుమానాథుం డైనం దోడ్పడఁడు గావున నీవు బ్రాహ్మణభక్తి గలవాఁడ వగుటం జేసి యివ్విప్రుల యందు నీయందుం గల్గిన ప్రేమ నెఱపి యిప్పటిశాపంబు వాయం జేసెద నని పంచమంత్రంబులం బఠించుచు ఘోరపాతకవ్రజవిధ్వంసి యగుభూతిం జేకొని యవ్విప్రుల దేహంబులకుం బూసి వారివక్త్రం బులం గొంత యిడి మీశాపంబు లుడిపోయె నిఁకఁ బరమశాంత స్వాంతులై సుఖం బుండుఁ డని యాశీర్వదింప నవ్విప్రులు పునఃపునః ప్రణామంబు లమ్మునివరేణ్యునకుం జేసి రాజేంద్రునితోడ నాకేదారేశ్వరునిఁ బూజించి నిజపురంబునకుం జని శాపవినిర్ముక్తులై సుఖం బుండి రనిన విని చంద్రగుప్తుండు రుద్రాక్షమహిమ కొంత వక్కాణింపు మనుడు శివయోగీంద్రుం డాకర్ణింపు మని యిట్లనియె.

శాంతికుం డనువిప్రునిచరిత్రము.

సీ. వినుము రత్నాకర మనుపురంబున శాంతి
కుం డనునొక్కవిప్రుండు హితులఁ
గూడి బాల్యమునందు నాడుచుండంగ రు
ద్రాక్ష యొండు లభించె దానిఁ బ్రీతిఁ
గంఠంబున ధరించి కాలకంఠునియందు
నతిభక్తి గల్గి తానాఁటఁగోలెఁ
దనయన్నదమ్ములఁ దల్లిదండ్రులఁ బాసి
విహరించుచుండె నివ్విధిని నుండ

జనులు గని గేలిచేయుచు మొనసి వెంటఁ
దిరుగుచుండినవారలఁ దిరిగికూడ
చూడ కందందుఁ దిరుగుచుఁ జూపఱకును
వెడగువాని తెఱంగును దొడరి యుండె. 169

వ. ఇట్లుండ మహదైశ్వర్యంబుకొఱకుఁ గేరళదేశాధిపతి ప్రతివత్సరంబున నాశ్వయుజ శుద్ధాష్టమినాఁడు దుర్గాదేవికి నరబలి యొసంగుటం జేసి తద్బలిదినంబున నొకమనుజుం డైన బలికి లభింపకుండుటం జూచి తనపురంబున నున్మత్తవృత్తిం దిరుగుశాంతికునిఁ దెం డని చారులం బంప వా రాశాంతికుం దోడ్కొని రాజేంద్రునెదుట నిల్పి రంత మానవేశ్వరుండు పురోహితప్రోక్తసంకల్ప పూర్వకంబుగఁ బావనమంత్రంబులతో గంధోదకంబున స్నానంబు సేయించి నూతన రక్తవస్త్రాలంకారంబుల నలంకృతుం జేయించి మేన జొబ్బిల్ల మృగనాభిఘనసారమిళితచందనం బలఁదఁ జేసి రక్తపుష్పమాలికలు గంఠంబునఁ బెట్టించి ముఖంబునం గుంకుముబొట్టును బెట్టించి పరిజనాళితో నానగరమార్గంబునం దప్పెటలు భేరులు డోళ్లు బాఁకాలు తారలు ఢక్కలు కంచుబూరలు శంఖంబులు కొమ్ములు గగ్గరెట్లు పీరరుంజలు పంబాలు మద్దెలలు తాళంబులు మున్నగువాద్యంబులు చెలంగ నర్ధరాత్రంబునఁ గాళికాలయంబునకుఁ గొంపోయి దేవిముందట నిలువంబెట్టి యాదుర్గను బూజించి వివిధమాంసభక్ష్యంబులును సారతరరసాయనంబులును దధిఘృతసూపపక్వాన్నశాకమద్యగుడోదకఫలగోక్షీరశర్కరాదులు నివేదించి శాంతికుని బలి యిచ్చుటకుఁ గరవాలంబు గొనుటం జేసి యాదేవి హాహాకారంబు సేయుచు నాఱేనిం జూచి యిట్లనియె. 170

సీ. ధరణీశ రుద్రాక్ష । ధరియించి శంభుని
పగిది నివ్విప్రుండు । వఱలువాఁడు
భళి యిట్టివానిని । బలికిఁ దేఁ బాడియె
మోఱకుఁడా యిప్డు । మొనసి నిన్ను
నాహారముగఁ గొందు । ననఁగ నానరపతి
భయచిత్తుఁ డగుచుఁ గా । పాడు మంచుఁ
బ్రార్థింప నాదేవి । పరమదయార్ద్రి యై
బలి పుచ్చుకొనక యీ । పగిది నింకఁ

జేయకుండు మంచుఁ జెప్పి పొమ్మని యంత
భవునిభక్తి యొసఁగి పల్కకుండ
మ్రోల నిలచి యుండు శూలిసముం డగు
శాంతికునకు ననియె సంతసమున. 171

మ. నిను భక్షింపను విప్రవర్య మది దేనిం గోరెదో దాని ని
త్తు నటంచుం బలుకంగ శాంతికుఁడు సంతోషించి ప్రార్థించి యి
ట్లనియెం గోరెద నిమ్ము మీబలిభయం బైనట్టి దీభూతలం
బున నింకెప్పుడుఁ గోరకుండు జననీ స్ఫూర్జత్కృపాస్వాంత వై.

తే. అంచుఁ బ్రార్థింప నాజగదంబ గాంచి
వర మొసంగెను భూసురవర్యుఁ డెలమిఁ
గోరినట్లుగ నాఁగి శాంతికుండు భక్తి
మ్రొక్కి యేఁగెను భూవర ముదము మీఱ. 173

వ. అన విని చంద్రగుప్తుఁడు శివరాత్రివ్రతమహిమ విన బుద్ధిపొడము
చున్న దన నాయోగీంద్రుం డిట్లనియె. 174

శివరాత్రివ్రతమహిమము.

సీ. శివరాత్రిదినము నిశ్చింతమై నుపవాస
ముండి గంధోదకంబున భవునకు
నాల్గుయామంబుల నమకాదిమంత్రరా
జంబుల నభిషేచనంబొనర్చి
భూతిగంధాక్షత పుష్పాదులం దగఁ
బూజించి దివ్యనీరాజనాదు
లొసఁగి సత్ఫలచయాద్యుచితభక్ష్యంబుల
నెసఁగ నివేదించి యొఱఁగి రేయి
నిదుర వోక మహేశుని పదసరోజ
ములఁ దలంచుచు మఱునాఁడు చెలఁగి విప్ర
పుంగవుల కెల్ల మృష్టాన్న భోజన మిడి
సంతస మొనర్ప శివుఁ డిచ్చు సంపదలను. 175

విబుధుండను విప్రునికథ.

వ. మఱియు నీశివరాత్రివ్రతమహిమచే నొకభూసురుండు శివలోకవాసుఁ డయ్యె నవ్వానిచరిత్రంబు గొంత వక్కాణింతు వినుము తొల్లి కుంజరపురంబునందు విబుధుం డనునొకబ్రాహ్మణుఁ డుండె నతండు శైశవదశ నుండి శివాలయంబున కేఁగి బిల్వంబు గోసి శివస్మరణంబు చేయుచు లింగంబుపైఁ బెట్టి పూజించి తనకుఁ దినుటకుం దల్లి యొసంగినయడుకుల నాశివున కర్పించి తిను మని ప్రార్థించుచు నమస్కరించుచు నాశివపూజయం దిట్లతిభక్తి కల్గియుండె నంతకంతకుఁ బ్రాయంబు వచ్చుటం జేసి కోడెకాండ్రతోఁగూడి శివార్చన మఱచి తలిదండ్రులమాట లాలింపక చేత దొరకినధనంబెల్లం గొంపోయి యాటకత్తియల కొసంగుచు వారియం దనురాగంబు మించి యుండె నిట్లుండ నొక్కనాఁ డావారాంగనలకు నిచ్చుటకు ధనంబు లేమిం జేసి దుర్మార్గప్రవర్తనంబునకు లోఁబడి యొకశివరాత్రి నాఁడు శివాలయంబులోనికిం జని విగ్రహంబులకు నలంకరించిన యాభరణాంబరంబులం గొనిపోవ సమకట్టి యొక్కెడ మఱుంగి యుండె నారాత్రి విప్రోత్తములు శివలింగంబునకు మహాన్యాసాది మంత్రరాజంబుల నభిషేచనాదిపూజలు సేయుచుండ నవ్విబుధుండు కనులారం జూచి యమ్మంత్రంబు లాకర్ణించుచుండెం గాని భూషణంబులు సంగ్రహించుటకు సమయంబు రా కుండి యోకించుక నాల్గవజామున సమయంబు లభించుటం జేసి తద్భూషణాంబరంబులు గ్రహించుకొని వచ్చుచుండ నర్చకుండు చూచి పట్టుకొని దేవుని వస్త్రభూషణంబు లెట్లు నీకు లభించె నని యడుగఁ బ్రత్యుత్తరంబు చెప్పమికి వీఁడు చోరుం డని కొట్టుటం జేసి యామోఁదుటల కోపక భూమిపయిం బడి కాలధర్మంబు నొందుటం జేసి యమభటులు వాని వచ్చి కొంపోవుసమయంబున శివకింకరులు వచ్చి యమభటుల నివారించి యి ట్లనిరి. 176

క. ఈవిబుధుని మీరలు గొం, పోవుట ధర్మంబు గాదు ✻ పుణ్యాత్ముఁడితం
డీవసుధ నితని బోలిన, పావనుఁ డొక్కండు గలఁడె ✻ పాటింపంగన్.

తే. ఇతఁడు బాల్యంబునందు ను ✻ మేశుఁ బూజ
చేసె వారాంగనలకుఁ దాఁ ✻ జిక్కి పాప
కృత్యముల్ చేసినను శ్రీగి ✻ రీశునిలయ
మున ముదంబున శివరాత్రి ✻ దినమునందు. 178

వ. ప్రాణావసానంబునం జేరి నిద్ర లేక మహాన్యాసాదిమంత్రంబు లాక
ర్ణించుచు శివలింగార్చనంబుం జూచుచు నుండి శివాలయంబునం
దనువు విడిచెం గావున నితం డాయుమానాథునిపదపద్మంబులకడ
నుండువాఁ డని నుడివి విబుధునిం గొంపోయి కైలాసంబునం జేర్చిరి
కావున. 179

తే. మానవేశ్వర శివరాత్రి ✻ మహిమ వింటె
మఱియు శివనామమహిమచే ✻ మాన్యు లమిత
భూతిఁ జెన్నొంది శివలోక ✻ మాతతరతి
జేరి రాశివుభజనన ✻ చేయు మెపుడు. 180

వ. దాన నీకుఁ బుత్త్రికాప్రాప్తి యై మహాయశోధనంబుఁ గాంతువు పొ
మ్మని దీవించుటం జేసి చంద్రగుప్తుండు పత్నీసమేతుం డై యమ్మ
హాయోగిగణంబునకు దండప్రణామంబు లాచరించి పరిజనంబులతోఁ
బురంబు సేరి యోగివర్యోపదేశమంత్రరాజంబును బఠించుచు నిజ
రాజ్యశ్రీధురంధరుం డై యుండె. 181

ఆశ్వాసాంతము.

క. శంకరహిమాద్రిజాత్మవ, శంకరయోగీంద్రమాన ✻ సాలయ బాలై
ణాంకకళాధర పృథురో, మాంకారి త్రిశూలపరశు ✻ హస్తమఖారీ.

తోదకవృత్తము. పరమదయాకర భాసురదేహా
వరవిబుధవ్రజ వంద్యపదాబ్జా
పురహరకాంచన భూధరచాపా
సురరిపుదుర్మద శోష మహేశా. 183

గద్యము.

ఇది శ్రీమదాలూరువంశపయోధిరాకామృగాంక రామ
కృష్ణదైవజ్ఞపుత్త్రి సుజనవిధేయ వాసుదేవనామ
ధేయప్రణీతం బైన శ్రీసిద్ధేశ్వరీయం
బను మహాప్రబంధంబునందుఁ
ప్రథమాశ్వాసము.

సంపూర్ణము.

శ్రీరస్తు.

శ్రీగణేశాయనమః.

శ్రీసిద్ధేశ్వరీయము.

ద్వితీయాశ్వాసము.

శ్రీమత్ప్రణవనివేశా
కామితసత్ఫలవిధాయక కా సర్వేశా
కామాక్షీహృదయేశా
శ్రీమత్సురఘుటపుకేశ శ్రీసిద్ధేశా. 1

వ. ఆవలివృత్తాంతంబు వినుం డని యమ్మునులకు సూతుం డిట్లనియె. 2

శిశిరఋతువర్ణనము.

తే. భువనములు గెల్వఁ బోయెడు పుష్పశరుని
చమువునను రేఁగురేణుసంచయ మనంగఁ
బ్రవిమలాంబుదసితతుషారంబు దిశల
నొలసి శిశిరంబు చనుదెంచె నుత్కటముగ. 3

క. తనరాక తెలియఁ దుహినం
బును బుచ్చెనొ పగతుఁ డంచుఁ బొల్పఱి దైన్యం
బున నున్న వనఁగ సరసుల
వనరుహషండంబు మిగుల వాఁడి కృశించెన్. 4

తే. కొదమతేఁటులు తేనెలు గ్రోలి పూల
గుత్తులం బాయ నోపక మత్తు నొంది

యున్న వనఁ బూలరేకులు వన్నె మాసెఁ
బూదుమారంబుతోఁ గూడి పొడిమి చెడి. 5

ఆ. సరసులకును బోక పురుషులు తరుణుల
నాభిసరసులకుఁ జనం దలంత్రు
వసుధ వస్త్ర మయ్యె వైశ్వానరుం డొగి
వృద్ధజనులఁ బ్రక్క విడకచేరె. 6

పుణ్యవతీదేవిగర్భంబు ధరియించుట.

క. భూరమణవర్యుఁ డావలి
కారునఁ బుణ్యవతిఁ గూడి కర మనురాగం
బారఁగ నుండం గరుణా
భోరాశి హిమాచలేంద్ర పుత్త్రిసుకృపన్. 7

వ. కొన్నిదినంబులకుఁ బుణ్యవతీదేవి గర్భంబు దాల్చె నంత. 8

క. నెల మసలెఁ బుణ్యవతి కొగిఁ
దెలిగేదఁగిరేకుఁబోలెఁ దెలుపారె ముఖం
బలసటలు దోఁచె నుదలికి
నలుపెక్కెను జన్నుఁగవమొనలు నలువారన్. 9

క. చెలువారెడువల్వలు సా
మ్ములు దాలిచి చెలులఁ గూడి ముదమున నెలదోఁ
టల కేఁగి మావిసీడలఁ
గలవంటకములను మెసవఁ గల్గెఁ దలంపుల్. 10

వ. ఇట్లు దార్హృదోద్రేకంబున నుండుపుణ్యవతిం జూచి ప్రియంబున నరే
శ్వరుం డిష్టాపూర్తి సేయుచుండె ననంతరంబ. 11

తే. నెలలు నిండారె నుపచారకములు ప్రియమునఁ
జేయుచుండిరి పొలఁతులు పాయకుండ
నొక్కదినమునఁ జూలుకట్టొదవి గిరిజ
నాథుకృపచేత సుశుభలగ్నంబునందు. 12

చంద్రగుప్తునకుఁ బుత్త్రిక జనించుట.

తే. తమ శుభస్థానములను సత్త్రగ్రహములు
దనరుచుండఁగ వంశపావనము గాను
బుణ్యవతికిని నెలమిఁగ బుత్త్రి గల్గె
పూర్ణదుగ్ధాబ్ధిలో లక్ష్మి పుట్టినట్లు. 13

క. జనియింపఁగ నవ్వార్తను
విని రాజోత్తముఁడు వేడ్క విప్రుల కెల్లన్
ధనధాన్యశర్కరాదులు
ఘనసంతోషమున నొసఁగె గౌరవమారన్. 14

సీ. అంత నాపుట్టిపాపలంతికి నెలఁతలు
నానాఁటిపురుడు సనంగఁ జేయ
మేదినీశుఁడు బంధుమిత్త్రుల రావించి
పండ్రెండవదినంబు పత్ని యెలమి
మంగళస్నాత యై రంగార వాద్యముల్
చెలఁగ విప్రేంద్రు లాశీర్వదింప
బంగరుపీఁటపైఁ బత్నితోఁ గూర్చుండి
రహిని బురోధఃపురస్సరముగ
సరవిఁ బుణ్యాహవాచన జాతకర్మ
ములను దగఁ దీర్చి శివయోగి మునిఁ దలంచి
నామకరణంబు చేసె జనాళి మెచ్చ
సత్యవతి యని పట్టికి శంభు నెంచి. 15

వ. అంత బ్రాహ్మణోత్తములకు ధనకనకాభరణాంబరంబులును భూగోగజాశ్వదానాదులును సంతోషంబుగ నొసంగి నిజపురోహితునకమూల్యాభరణాంబరంబు లొసంగి సమర్యాదంబుగా నంపి వచ్చిన బాంధుమిత్రజనంబులను భక్ష్యభోజ్యాదులం దనిపినవాఁడై నాఁటఁ గోలెఁ బుత్త్రికయం దత్యంతానురాగంబు గల్గి యుండెఁ బూర్వపక్షచంద్రుంబోలె నాశిశువు క్రమంబునం బ్రవృద్ధమానం బగుచుండె.

క. అడుగులు తడఁబడఁ బుడమిం
గడుకొని నడనంగ నేర్చె గజ్జెలు మ్రోయం
గడు వేడ్కఁ దల్లిదండ్రులు
పాడనూడఁగ నడచు బెడఁగు పొంపిరివోవన్. 17

తే. చిల్కపల్కులవలెఁ దేనె లొల్కుపల్కు
లాడ నేర్చెను సరవిగఁ దోడిబాలి
కావళిం గూడి యాటలనాడ నేర్చె
భూరిభూషలు వస్త్రములు గోర నేర్చె. 18

వ. ఇట్లు శైశవదశ గడచి దశవర్షవయస్కురాలై జననీజనకులకుం బ్రి
యంబు చేయుచుండ నామాతాపితలు నిజపురోహితోత్తముని
కడకు నంపి సత్యవతిని జదివింప నాబాలిక తొల్లింటిపుణ్యంబుచే వి
విధవిద్యానైపుణ్యంబును దైవభక్తియుం గల్గి ప్రతిదినంబును. 19

క. తనజననీజనకుల కి
ట్లని చెప్పక తెల్లవాఱు నప్పటికిఁ బినా
కిని కేఁగి మునిఁగి వస్త్రం
బును దాల్చి సుపుష్పతతులఁ బుట్టకు నెసఁగన్. 20

తే. కోసికొని సిద్ధలింగేశు గుడికి నేఁగి
సిద్ధలింగేశ్వరుని మదిఁ జేర్చి పూలఁ
భక్తిఁ బూజించి మ్రొక్కి తా భయము గదుర
మందిరంబునకుం జని మాతయెదుట. 21

వ. అట్టిట్టు దిరుగుచుం దల్లితోఁ బ్రియవచనంబు లాడుచు నన్నంబు
భుజించి శృంగారసౌధోపరిభాగంబునం బ్రియబాలికారత్నంబుల
తోఁ జేరి యాటలుం బాటలుం గాలంబు పుచ్చుచు నుండి యొక్క
నాఁడు. 22

ఉ. ఎప్పటియట్ల లేచి నదికేఁగి మునింగి మడుంగుఁ గట్టి తా
నప్పరమేశునిం బొగడుచానదిగట్టునఁ బూలతోఁటలో

నొప్పెడుపూలు గోసికొనుచుండఁగ శ్రీశివయోగిపుంగవుం
డప్పుడు త్రోవ నేఁగుచుఁ బ్రియంబున నానృపకన్య కిట్లనెన్. 23

శివయోగీంద్రుఁడు సత్యవతికి సౌరమంత్రం బుపదేశించుట.

ఉ. అమ్మ యిదేమి యొంటి యిట కర్కుఁడు పుట్టక మున్న వచ్చి పూ
లిమ్మెయిఁ గోయుదానవు మహీశునిపుత్రికగావె నిన్ను నో
యమ్మ నెఱింగినాఁడ మహితాత్మ శివాధవు సత్కృపాకటా
క్షమ్మున నుద్భవించితివి గావున రమ్మిట బాలికామణీ. 24

వ. అని డగ్గఱకుం బ్రియంబునం జీరి కూర్చుండఁ బెట్టికొని "నీకు మ
హేశ్వరభక్తి వొడముటకు నమ్మహేశునను గ్రహంబున నీవు జనిం
చుటకారణంబు గావున నీ సచ్చరిత్రంబునకును దైవభక్తికిని మెచ్చి
వచ్చేసితిఁ దొల్లి దూర్వాసోమునీంద్రుఁడు కుంతికుపదేశించిన శ్లోక
మంత్రరాజం బుపదేశింతు నయ్యది. 25

తే. సకలపాపహరంబు మోక్షప్రదంబు
నఖిలరిపుచయగహనదావానలంబు
సర్వరోగాపనీధ్రివజ్రంబు చుమ్మీ
సౌరమంత్రంబు వేదవేద్యంబు తన్వి. 26

శా. దానిం జెప్పెద నిశ్చలత్వమునఁ బ్రాతఃకాలమం దొప్పఁగ
ధ్యానంబుం దగఁ జేయు శాశ్వతనితాంతైశ్వర్యముం గల్గు ని
త్యానందం బొనరించు శత్రువిజయం బైకీర్తి వాటిల్లు నే
దేనిం గోరినఁ గాంతు విమ్మహి నిజం బేపారు నమ్మా యనన్. 27

క. విని సత్యవతి మహాముద
మున నాశివయోగిపాదముల వ్రాలి ప్రియ
మ్మున నుపదేశింపుఁడు గై
కొనియెద నామంత్ర మనఁగఁ గూర్మి మెసంగన్. 28

వ. అమ్మహాయోగివర్యుం డాసౌరమంత్రరాజంబును సత్యవతి కుపదే
శించి శాశ్వతకీర్తి పొందుఁ గాత మని యాశీర్వదించి యంతర్హితుం
డయ్యె నంత సత్యవతి యాత్మగతంబున. 29

శా. ఔరా యీతఁడు పంకజాసనుఁడో పద్మాక్షుండో గౌరీశుఁడో
యీరూపంబున వచ్చి ముగ్ధ యగునా కిమ్మాడ్కిఁ గారుణ్యవి
స్ఫారుం డై రవిమంత్రరాజ ముపదేశం బారఁగాఁ జేసి యే
దారిం బోయెనో యెట్లు గాంతునో యికం దత్ప్రాప్తి యింతేయొకో.

చ. అని శివయోగిపుంగవుని యం దతిభక్తి దలిర్ప నావనం
బున నొకజాము దా నిలిచి పూర్ణమనంబునఁ బ్రస్తుతించి సూ
ర్యునిఁ గని మ్రొక్కి యింక నిట నుండినచోఁ దలి దిట్టునంచు నా
దినము గృహంబు చేరి శివదేవునిసన్నిధి కేఁగ మాని తాన్. 31

వ. అట్లు సేరి శివయోగీంద్రుఁ డిమ్మెయి నుపదేశించె నని యెఱిం
జెప్పక తోడిబాలికలం గూడి యెప్పటియట్లాడుచుం బాడుకొంచుఁ
బ్రతిదినంబును సిద్ధేశ్వరాలయంబునకుం బోయి శివునిఁ బూజించి ము
నివర్యుం డుపదేశించినమంత్రరాజంబు జపించుచు నుండి యొక్క
నాఁడు. 32

సూర్యుఁడు ప్రత్యక్షంబై సత్యవతికి వరమిచ్చుట.

సీ. గొజ్జంగిపూనీట మజ్జనం బాడి చెం
గావిపుట్టంబు చక్కంగఁ దాల్చి
తళుకొత్తుసొమ్ములం దంబుగఁ గైసేసి
కొని వేడ్క నెవరితోఁ గూడకుండ
మాడుగుపైఁ జేరి మహిమాఢ్యుఁ డగుశివ
యోగివర్యుని మది నొగి నుతించి
సౌరమంత్రంబును జపియించుచుండి దే
హంబును మఱచె భక్త్యతిశయమున

నప్పుఁ డెంతయు నాజలజాక్షి సేయు
జపమునకు మెచ్చి విప్రవేషంబు దాల్చి
వచ్చి రాసుతమ్రోల దివాకరుండు
నిలుచుటం జేసి దేహంబు దెలిసి యంత. 33

తే. భాసురామ్నాయరూపుని | భద్రయశునిఁ
ద్రిజగదారాధ్యు భవదూరు | దివ్యయోగి
జనమనోంబుజవాసు సజ్జనవిలాసుఁ
జూచె విప్రోత్తమునిమ్రోలఁ | జూడ్కి నెఱపి. 34

వ. అట్లు చూచి మనంబున నితం డర్కుండు విప్రరూపంబున వచ్చిన
వాఁ డని నిశ్చయించి సదమలభక్తిం గరపద్మంబులు మోడ్చి యి
ట్లు వినుతించె. 35

చ. వరనిగమస్వరూప ముని | వర్యమనోగృహదీప భూమిని
ర్జరగణసంతతాచరిత | సంస్తుతినిర్మలాప శత్రుభీం
కరబహుళప్రతాప భవకల్మష | సాగరశోష భక్తహృ
త్సరసిజవాస సర్వశుభసంశ్రయ | దీనశరణ్య భాస్కరా. 36

చ. విమలయశోధ నాహృదయ | వృత్తమెఱుంగుట కిట్లు విప్రరూ
పము గొని వచ్చితో యిటకు | బాలిశురా లగునాదు | పూర్వపు
ణ్యము గద యుష్మదంఘ్రినళి | నద్వయిఁ జూచి నమస్కరించుటల్
సుమహిత దేవవంద్య రిపు | సూదన సత్కృపపూర్ణమానసా. 37

వ. అని యనేకవిధంబులం బ్రార్థించుసత్యవతి కమ్మాయాభాసుడుం
డనుకంపార్ద్రహృదయుం డై యి ట్లనియె. 38

ధ్రువకోకిలవృత్తము.

నరవరేణ్యకుమారి మెచ్చితి | నన్నుఁ గూర్చి దృఢాత్మ తం
బరమభక్తినుతింప నిమ్మెయి | బ్రాహ్మణాకృతి వచ్చితిన్
వరముగోరు మొసంగు వాఁడ ది | వాకరుం డను నే ననన్
ధరణినాథకుమారి యూరక | ధాత్రిఁ జూచుచు నుండఁగన్. 39

తే. అపుడు సత్యవతిం జూచి | యంబుజాప్తుఁ
డనియె నోరాజకన్యక | యాత్మ నుండు
వాంఛ నెఱిఁగింప కూరక | వసుధఁ జూడ
నేల భవదీప్సితంబు నా | కెఱుక యయ్యె. 40

వ. అని ప్రియం బార నాసత్యవతిహృదయాంబుజంబునం దనదివ్యతేజం బార ననుగ్రహించి వలసినయప్పుడు దర్శనం బొసంగి పోయెద నని వచించి సుఖం బుండు మని యంతర్హితుం డయ్యె నంత. 41

సీ. ఆసత్యవతి విస్మ । యం బంది యిమ్మహి
కెవ్వఁడు రా నోపు । నినుఁడు గాక
శివయోగివర్యుని । చే నింత భాగ్యము
గంటిని లేకున్నఁ । గాంతునో కోఱ
యంచు నాదిత్యుని । యం దనురాగం బె
సంగి పల్మాఱును । సన్నుతించి
యీరహ్యాం బేరి । కెఱిఁగింపఁ గూడ దం
చెప్పటియట్లు తా । నెలమిఁ దోడి
బాలికారత్నములఁ గూడి । భావ మలర
నాటలాడుచుఁ బాడుచు । నాత్మయందు
నెపుడు శివయోగివరుని సి । ద్ధేశు నర్కుఁ
దలఁచుచును దల్లిదండ్రుల । కెలమి నెఱపు. 42

వ. ఇవ్విధంబున నుండఁ గొన్నిదినంబులకు సత్యవతికి నాదిత్యునియం దత్యంతానురాగంబు గల్గుటం జేసి తదనుగ్రహంబునఁ జూలు దాల్చి జననీజనకుల కెఱుంగఁజేయ కొకవిధంబునఁ గాలంబు గడపుచుండు సమయంబున. 43

వసంతర్తు వర్ణనము.

క. భాసిల్లెఁ బుష్పసుగంధా, వాసము మదచంచరీక । వారస్వానో
ల్లాసము శుకపికబృంద, గ్రాసము మధుమాస మతిసు । ఖవిలాసంబై.

కవిరాజవిరాజితము.

అరయ వసంతుఁడు వచ్చునిఁ కిమ్మలి । నాంబరము న్విడనాడి నవాం
బరము ధరించెద నందము గా నని । భాసిల శ్రీవనకాంత మనో
హరముగ నమ్మొయిఁ దాల్చెనొ మేల్కన । కాంబరమాశవనందరుపుల్
సురుచిరపల్లవపుష్పచయంబుల । శోభితమై తనరె న్వనిలోన్. 45

తే. చిత్రకుసుమావళులు పాకశాసనుచాప
దీప్తి ప్రసరించినట్లు ప్రదీప్త మగుచు
నరులతాగృహములమీఁద నొలయుగుచ్ఛ
ములు వనాంగనకుచయుగంబులుగ నొప్పె. 46

వ. అట్టిసమయంబున. 47

సీ. శారికాశుకపికచయసముచితంబులు
భూరివాద్యవిశేషములుగ నొప్ప
భ్రమరసందోహస్వభావనాదంబులు
విమలగీతంబులై వేడ్కమీఱ
వికచనానాసుమప్రకరసంజనితగం
ధపరాగ మించుగందపొడి గాఁగ
సత్పుష్పరసము వసంత మైతనరార
నరుణసుమావళి యగ్ని గాఁగ
సకలపరిపక్వఫలరససారధార
లాజ్యధారలు గా నెసలార సమద
భృంగసంతానబంధురశ్రేణి ధూమ
రేఖలై వఱలంగ సంప్రీతి నపుడు. 48

క. వనకాంతామణికి వసం
తునకుం గుసుమాస్త్రుఁ డెలమితో నుద్వాహం
బొనరించె మంత్రతంత్రము
లనురాగము పుట్ట నుడివి యాచార్యుం డై. 49

వ. అట్టిమహోత్సవంబున నొకవనపాలిక సత్యవతికడకుం జని తాఁ దె
చ్చినయభినవామోదకుసుమంబులను బరిపక్వమధురఫలంబుల నొ
సంగి దండంబు లిడి యిట్లనియె. 50

సుగంధివృత్తము. అమ్మ నామవిన్నపంబు నాలకింపు మిప్డు చి
త్రమ్ముగా వనమ్మునన్ లతాంతము ల్ఫలంబులున్

నెమ్మి మీఱి నెల్లచోట్లఁ నిండెదండి దానినిం
గొమ్మ రమ్మ తోడివారిఁ గూడి చూడ నెమ్మెయిన్. 51

వ. మఱియు నవ్వనంబు యాగశాలకై నడి సంతర్పణాహ్వానద్విజావళి
యుక్తంబై బాలురపోలె వంవిహంగకృతమధురరుతిసముంచితం
బై భూషణాలంకృతనర్తకుభాతి సంచలితకోమలలతాంచితకిసలయ
సుమాన్వితంబై దానశీలునిమాడ్కి సర్వాభీష్టప్రదంబై యుండుఁ
గావున. 52

తే. పోవుద మనంగ నారాజపుత్త్రి యపుడు
తోడిబాలికలును దల్లితోడ నుండు
పడఁతులును గూడి భూషణాంబరము లలరఁ
దాల్చి యావనపాలికదారి చూప. 53

వ. పదపంకేరుహయుగహంసకంబులు గల్లని మ్రోయం బ్రమదవనప్ర
వేశంబు చేసి సఖీజనంబులం గూడి యచ్చట. 54

చెలులతోడ సత్యవతి వనవిహారము చేయుట

సీ. మల్లియపొదరిండ్లమావిజొంపమ్ములఁ
దలిరులశయ్యలఁ దనివి దీరఁ
జేరి యాడుచుఁ గొంత సేపు నెత్తావిపూ
గుత్తులు గోసి మూర్కొంచుఁ జెంత
ద్రాక్షపందిరులలోఁ దలముగఁ బండిన
పండ్లను మెసవుచుఁ బ్రాఁతిగాఁగ
మ్రాఁకులపైఁ బ్రాఁకి మహిఁ గ్రేలాడు తీ
వెలఁ బట్టి యుయ్యేల వలె నొనర్చి
యూఁగుచును బ్రక్కపోఁకల నుండు పిట్ట
లఱవ విని వానిఁబోలె నొయ్యారముగను
బల్కులాడుచు లేళ్లను బట్టఁ బోవు
చక్కడక్కడ విహరించి యొక్కచోట. 55

కమలాకర వర్ణనము.

ధ్రువకోకిలవృత్తము.
అరయఁ గాముని చేతిబాణము లై పడంతుల నేఁచ నా
తురత దూఱెద రింత నేల మధుప్రసూదనుసంఘులం
బరఁగఁ జేరుద మంచు నాతనిఁ బ్రస్తుతించుచు నున్నవో
సరసిలో నసఁ బద్మవార మొసంగుఁ జక్కఁదనంబుతోన్. 56

చ. నను నెడఁబాయకుండఁ బ్రియనాథుఁడు గానక పోవు లేమొకో
యని రతి యెంచి మీఁ రరిగి యాతనిఁ దెం డని పంప వచ్చి గ
న్గొనరె శరంబులార మన కూరిమిఁ జేని నటంచుఁ దేఁటు లి
ట్లనువుగఁ బద్మరాజిఁ గని యడ్గుచు నున్న వనంగ నింపుగన్. 57

తే. ఝుంకృతులు సేయుఁ గమలక షాయగంధ
కలితశీతలపవనసంకులతరంగ
మాలికావృతపూర్ణ నైర్మల్యసలిల
యుక్తకాసారమును జూచి యుల్లసిలుచు. 58

పాదపవృత్తము. అందఱు హాయిగ నక్కొలనం బల్
పొందికమై డిగి పుష్పము లోలిం
గందుక మాడెడు కై వడిఁ బై నిం
పొందఁగ నొక్కరి కొక్కరు వేడ్కన్. 59

ఆ. కోసి మేలమాడుకొంచు వేసికొను చం
దుండు విహగములను దోలు చాల
దీర జలక మాడి రారయఁ దూండ్లకు
మెలఁగునంచ లనఁగ జలమునందు. 60

వ. ఇట్లు జలకమాడి గట్టున కేఁగి పుట్టంబులు గట్టుకొని రం దొకర్తు
రాచపట్టికి వలువ చెలువారం గట్టఁబోవ దానికి నారాచపట్టి యి
ట్లనియె. 61

తరలవృత్తము. కట్టకుము బిగించి వలువ గాంత నడుము నంచు దాఁ
గుట్టు విడువకుండ నొడివెఁ గొంకు పొడమి యంత నేఁ

గట్టు వదలు గాని యొలమిఁ గఁ గట్టెద నని గర్భ ము
న్నట్టిగుఱుతు లుండఁ గని మనంబుననుఁ దలంకుచున్. 62

క. ఈవింతఁ జూచితిరె ధా, త్రీవలయమునందు వింటిరే యెవ్వడేని
భావింపఁ గన్యగర్భం, బై వఱలుట యువిదలారఁ యన నవ్వారల్.

తే. అబ్బురంపడి కన్నియ యట్టు లుండఁ
గాంచి యిది యేమి మర్మం బటంచుఁ గొంత
తడవు యోచించి మేమిట్టు లడిగెద మని
జడియకుండఁగఁ జెప్పు మంచడుగ నపుడు. 64

సత్యవతి గర్భహేతువు చెలికత్తెలు పుణ్యవతికిం జెప్పుట.

వ. ఆరాజపుత్త్రి నభంబునం బ్రభాసితుం డగునాదిత్యుం జూచి శిరంబు వంచి భూమిం జూచుచుం బ్రత్యుత్తరంబు చెప్పనిదయ్యె నంత నా పడంతులు "కారణంవినానకార్య" మ్మనునార్యోక్తివలెఁ గారణంబు లేక కార్య మెప్పు డుండ దని తలంచి యూరక యుడుగు టుచితంబు గా దని యక్కన్నియం దోడ్కొని వచ్చి మేడం జేర్చి పుణ్యవతి పాలికిం బోయి యందఱు దండంబు లిడి సత్యవతివృత్తాంతంబు డాఁపక యెఱింగించి మాయం దొకయపరాధం బుండెనేని దండింపుఁ డని యభయంబు వేఁడి రంత నాపుణ్యవతి సత్యవతికడకుం బోయి.

మత్తకోకిలము. చూలుచిన్నెలు గల్గి యుండఁగఁ జూచి దా నవు డాత్మ నే
నేల పుట్టితి నక్కటా యిలనిక్కమారితకై వరా
లేల కోరితి దేవతావళినంచి బాపురె తొంటి నా
పాలిపాతకపుంజ మిట్టిక్రియఁ బట్టియై జనియించెనో. 66

ఆ. ఏమిసేయుదాన నీవింతచూలుకై
కారణంబు లేక కార్యమున్నె
యంచుఁ గూఁతుఁ జూచి యాగ్రహావేశయై
యడిగెఁ గఠినముగ భయంబు గదుర. 67

పంచచామరము. దురాత్మురాల చెప్పు మేరితోడి మైత్రి గల్గెనీ
శిరంబు ద్రుంపఁ జేయుదానఁ జెప్పకున్నచోనిఁకా

26431
25.3.9?

దరింప నోప నిట్టితప్పుఁ దద్దయుం గృపాత్మతన్
ధరాతలంబునందు రాజ ధర్మ మారయం జెడన్. 68

సీ. చెఱఁగు మాయక యిట్టి చిన్నె లెట్లొందును
గన్నెతనాన నిక్కంబు నుడువు
బాపురే లోకులు పాటింతురే నన్ను
నిట్టితప్పును మూసి పెట్ట మఱియు
ననరెలావున వంపు నగపడ దని దానఁ
జెడదె యశంబును జెడిప మాకు
నమృతాంబునిధి విషం బావిర్భవించిన
యట్లు పుట్టితివి హా యబ్జభవుఁడు
పూని కల్పించె నో నాకుఁ బుత్త్రిగాను
గడుపుచేటుగ నాయభాగ్యంబు నిట్లు
పుట్టుటం గూడ భగవంత పూర్వజన్మ
కర్మమో లేక యీవింత గల్గఁ గలదె. 69

వ. అని విచారంపడుచు ననేకభంగుల నడిగిన నాసత్యవతి శిరంబు వంచి భూమిం జూచుచు మాటాడక యుండుటం జేసి మహోగ్రభాషల నిందించుచు వెండియు నిట్లనియె. 70

ఆ. వచ్చినట్టినింద చచ్చినఁ బోదిఁక
సిగ్గు మాని నాకుఁ జెప్పు మెల్ల
గరిడిముచ్చువోలెఁ గనులెత్తి చూడక
పల్కకుండు టేల పాడి తప్పి. 71

ఆ. కోడిగ్రుడ్డు గొట్ట గుండ్రాయి యేటికి
నంచు నేఁ దలంచి యడుగు చుండ
మిన్నకుండ లాభమున్న దె కానిమ్ము
కత్తిపాలు నీవు గను మనంగ. 72

వ. సత్యవతి మొట్టకేలకు జననిముఖం బాలోకించి యిట్లనియె. 73

క. చాలింపు తల్లి నాతో
నీలీలం బరుషభాష లే లాడెదొ యి
క్కాలంబు వ్రాయి యొప్పటి
కోలిఁ మాటొండు నిల్చు నుర్వీస్థలిలోన్. 74

తే. ప్రియము పల్కినవారలఁ బెద్దలండ్రు
ప్రియము వల్కనివారలఁ బెద్ద లనరు
గానఁ బ్రియ మెప్డు పల్కంగ గౌరవంబు
గల్గుఁ గార్యము లీడఁగూడుఁ గద ధరిత్రి. 75

వ. మఱియు నాకు జనయిత్రి వగుటం జేసి దురుక్తుల కెదురాడనోప
కూరకుండుదాన నిజంబు వక్కాణింతు నీక నూరకుండుమని
యిట్లనియె. 76

క. అరయఁ బ్రపంచంబును దన
కరుణం బాలించునట్టి ఘనదైవం బి
క్కరణిం జేసెను వే ఱొక
నరునిం గానను నిజంబు నం దుండు దిలన్. 77

ఆ. పరఁగఁ బాముకాళ్లు పా మెఱుంగును నన్ను
గుట్టు చెప్పు మంచుఁ గొట్టఁ బోవఁ
దగునటమ్మ యెడఁదఁ దాలిమి నొందక
యీఱతాఱ లాడ నేల యనఁగ. 78

వ. అప్పుణ్యవతి సత్యవతివచనంబు లాకర్ణించి మనంబున కేమియుం
దోఁచక నింక నాథునికడకుం బోయి పుత్త్రికోదంతం బెల్ల నుడువ
నన్న రేంద్రుండు. 79

క. విని రౌద్రోద్రేకముచే
తను జాపవిముక్తశరవిరోధంబున హస్తం
బున ఖడ్గము మెఱయఁగఁ జని
తనయముఖం బారఁ జూచి తత్తఱపడుచున్. 80

వ. కట్టెదుట నిలిచి చంద్రహాసంబు జళిపించుచుం గులనాశకురాలా యని గద్దించి పిలిచి యిట్లనియె. 81

స్వాగవృత్తము. చంద్రవంశ్యమణి చారుయశుం డౌ
చంద్రగుప్తనృప చంద్రునితో భూ
మీంద్రు లంద ఱిల నీడె యటంచున్
సాంద్రకీర్తి తగ సన్నుతి సేయన్. 82

చంద్రగుప్తుండు పుత్త్రికగర్భకారణంబు విచారించుట.

మ. ధరణీపాలనఁ జేయుచుండుదు నితాంతశ్రీలఁ బెం పొంది భూ
సుర లాశీర్వచనంబు లియ్యఁగ క్షితీశు ల్మెచ్చ నిశ్చింతతో
నురుధర్మాచరణానుసారముగ నిత్యోత్సాహి నై శత్రుభీ
కర తేజోరతి నై సుబంధుతతి నై ఖ్యాతి న్మహీమండలిన్. 83

క. ఈరీతి నుండువానికి, గౌరవముం జెఱుప దుష్ట కార్యము భావం
బారంగఁ బూని చేసితె, నేరం బని తోఁపకుండ నెఱి నో దుష్టా. 84

తే. పాలవంటికులంబునం బరఁగఁ బుట్టి
యపయశంబును దెచ్చితి వధమురాల
తులసివనమున గంజాయి మొలక పొడమి
నట్లు కులఘాతుకి నీకు నాత్మహితులు. 85

సీ. ఎవరు బోధించిరే యిట్టిదుర్బుద్ధి నా
కెఱిఁగింపు లే కున్న నిపుడు కత్తి
పాలు సేయుదుఁ జూడు గాలినమన్ను తోఁ
గాలనిమ న్నెట్లు గలయు నట్లు
కులము వాసిన వెన్క గూడుట సరిగాదు
చేసినతప్పును మూసి నిన్నుఁ
మన్నించినంతట నన్ను లోకులు మించి
దూఱక యుందురె దుష్టచరిత
కనుక నీగుట్టు చెప్పి నా కత్తివేటు
పొసఁగఁ దప్పించుకొను మెదఁ బుత్త్రియనెడు

కరుణ సుంతైన నాకడఁ | గానఁబడదు
కల్లలాడకు గర్భ మొక్కరణిఁ గల్గె. 86

క. అనిన విని సత్యవతి యో
జనకా నీ కొక్కనపయ | శంబును నేఁ దె
చ్చినదానఁ గాను గోపా
గ్నిని ద్రోయకు మిడుతఁబోలెఁ | గృపఁ గను నన్నున్. 87

సీ. సమధికక్షమచేత | సకలకార్యంబులు
 సమకూడు భూరియ | శంబు గల్గు
గావునఁ గోపంబు | గడు మేలు గా దని
 విబుధులు చెప్పంగ | వినవొ జనక
మఱియు ధర్మాధర్మ | మార్గం బెఱింగిన
 మానవేశ్వరుఁడవు | మాన్యుఁడ విలఁ
గలుగుమర్మంబులు | దెలిసినవాఁడవు
 తప్పొండు లేదు నా | తనువులోనఁ
దల్లిదండ్రులు మీరలే | తప్పఁ బట్టి
యిల్లు వెడలింపఁ జేసిన | నింక నన్ను
నింత గొప్పఁగఁ జూతురే | యితరజనులు
పరుషభాషలు పల్కంగఁ | బాడియగునె. 88

తే. కడఁగి కంఠీరవము మత్త | గజముమీఁది
కుఱుకుఁ దోఁడేలుమీఁదికి | నుఱుకఁ గలదె
గౌరవము మాని యమ్మెయి | ఘనపథంబు
మాని దుష్పథమున నించు | కేని యేను. 89

వ. పోయినదానం గాను బుష్పింపనిపుష్పంబునకు భృంగంబు రా
నోప దనుధర్మం బెఱింగి నన్ను రక్షింపు మని వేండియు నిట్లనియె.

క. మఱి కన్నియ చూ లొందుట
యొఱగొడ్డియ మంచు నెంచి | యున్ను రనుచు న

న్నతిముఖిఁ బీడింపఁగ వల
దెఱఁగించెద దైవమహిమ యిది విను జనకా. 91

క. తొలిఁ గుంతికి నాదిత్యుం, డెలమిం జూలొందఁ జేసె నేర్పడ నాక
ట్లలరెం గావున నే నిలఁ, గులనాపకురాలు గాదు కోపం బేలా. 92

ఆ. కల్లలాడుదు నని కలలోనఁ దలఁపకుఁ
గన్ను పోవునట్టి కాటుకేల
బాస యొద్దియేని చేసెద నుడువుము
సత్య మెఱుఁగ వచ్చు జగతిజనక. 93

వ. కావున నూరక పీడింప నేల యనెడుకూఁతుం జూచి కొంతతడవు మనంబున నాలోచించి చంద్రగుప్తుం డిట్లనియె. 94

క. ఇప్పుడు సెప్పినమాటను
దప్పకుఁ జేయింతు నిపుడు దగఁ గోవిదు లే
చొప్పున వాక్రుచ్చెద రా
చొప్పున లేకున్నఁ ద్రుంతుఁ జొప్పడ శిరమున్. 95

వ. మఱియు రాజేంద్రుం డనయ్యు నిట్టిరహస్యం బేను వెల్లడి సేయకున్న నన్ను నెల్లరు నిందింతు రని వక్కాణించి కొల్వుకూటంబున కేఁగి చాతుర్వర్ణ్యంబును రావించి నయసంపన్నత మెఱయ ని ట్లనియె.

ఉ. వింటిరె యెప్పుడేని మనవృద్ధులు సెప్పఁగ మీరు గాని క
న్గొంటిరె కన్నెచూ లగుట క్రొత్తగఁ గంటిన యిప్డు కూఁతునం
దింట నెసంగి యున్న దది యేరికిఁ జెప్పక డాఁచిపెట్ట నా
కంటె నసత్యవంతుఁ డిఁకఁ గన్పడఁ డే నృపుఁ డయ్యు నిమ్మహిన్.

మ. అనరే లోకులు పక్షపాతి యని నన్న డ్డొండు లేకుండ దా
నన నాఖ్యాతి దొలంగదే జనము లన్యాయాన్వితు ల్గారె న
న్ననరే చుల్కఁగ భృత్యవర్గ మొగి నాకంబెట్లు నన్నొందు స
జ్జనముల్ మిత్రులు బాంధవుల్ నగరె దుశ్చారిత్రుఁ డంచుఁ ధరన్.

వ. కావున నాపుత్త్రి కన్యక యయ్యు నంతర్వత్ని యగుటం జేసి యది యెఱింగి తదుదంతం బడిగి దండింప నావలన నొకయపరాధంబు

లే దంచుఁ గుంతి కాదిత్యుండు కరుణించిన ట్లయ్యె నని వచియించె
నంత. 99

తే. కల్ల లాడకు మని యేను గనలి వల్క
నపుడు కొండొకతడవున కనియె జనక
సందియం బేల నాచేత సరవి నెద్ది
యేని బాసను జేయించి యెఱుఁగు నిజము. 100

వ. అని వల్కుటం జేసి విని సజ్జనంబుల కియ్య దెఱింగించి వా రానతి
చ్చిన ట్లొనరించు టుచితం బని తలంచి యెఱింగించితిఁ గావున. 101

తే. రాజపుత్త్రి యటంచు గారవము గనక
యిప్పు డాదుష్టురాలిని నిటకుఁ బిల్చి
గర్భకారణ మడుగుఁడు కరుణ మాని
యెల్లవారలు చూడంగ నేపు మీఱ. 102

తే. బాస చేసెదనని తాను బల్కెనేని
పూని చెప్పుఁడు కఠినము గాను బాస
సందియము మానునట్లుగ జనులు సత్య
వంతుఁ డనఁగఁ గులానికిఁ గాంతి యెసఁగ. 103

తే. తనయ ముద్దైనఁ జేసిన తప్పు ముద్దె
గూఁతు రని యూరకుండినఁ గులము సెడదె
బాపురే తొల్లి చేసిన పాపఫలము
గాక వే ఱొండు గల్గుట గలదె జగతి. 104

విజయసేనుని చరిత్రము.

వ. తొల్లి కుకురుదేశాధిపతి తనకుమారుండు చేసినదుష్కార్యంబు
నకుఁ బుత్త్రుం డని కరుణింపక శిక్షించె నని విని సభ్యు లదెట్ల
ని యడుగఁగాఁ జంద్రగుప్తుం డిట్లనియె. 105

సీ. వినుఁ డా కుకురుపతి వీరసేనుం డను
నరపతి కొక్కఁడ నందనుండు
విజయసేనుం డని వీరుఁడై యతఁ డొక్క
నాఁడు శృంగార వర్ణనంబునకును

బోయి యం దొక్కఁడుఁ ౹ బూర్ణఫలంబులం
గ్రాలురసాలవృక్షంబుఁ జూచి
ఫలములు గోయంగ ౹ భటునితోఁ జెప్ప నా
భటుఁ డిట్టు లనియె నో ౹ ప్రభువరేణ్య
పండ్లు గోయఁ జాలఁ ౹ బరికింప నీవృక్ష
మంతరిక్షమునకు ౹ నంటి యున్న
దంచు భీతి నొంది ౹ యనఁగ నాభూపతి
పుత్త్రుఁ డధికకోప ౹ మునఁ గడంగి. 106

తరళవృత్తము. తనయుఁ డీశ్వరుఁ డానతిచ్చిన ౹ దాని మానక సేయు వా
నిని భటుం డనవచ్చు నెమ్మెయి ౹ నీవు నీ పలుఁ కేల కా
దని వచించితి వెంతగర్వమిఁ ౹ కంత పోవును జూడరా
యని చెవిం దనకత్తిఁ గోసె న ౹ యారె నెత్తురు గాఱఁగన్. 107

వ. అంత నాసేవకుఁడు కర్ణబాధ కోపక వృషమియందు మైమఱచి వ్రా
లి కొంతతడవునకు లేచి నలుదెసలం గలయం జూచి వికృతకర్ణుం
డై రక్తధార లొలుక విజయసేనునితండ్రిపాలికిం బోయి దండంబు
లిడి యి ట్లనియె. 108

క. ఓరాజవర్య యిమ్మెయి
నూరక తప్పొందు పెట్టి ౹ యురుకోపముతో
ధీరుం డగుభవదీయకు
మారుఁడు కర్ణంబు గోసె ౹ మల్లడి గొనఁగన్. 109

వ. అట్లు గోసి యెటకేనియుం బోయె భవదాత్మజుం డగుటం జేసి శి
క్షింపుఁ డని చెప్ప నోప ననిన విని యవ్వీరసేనుం డాసేవకుని నూర
డించి కూర్చుండఁ బెట్టికొని యాసేవకు నెదుటఁ దనకుమారుని రా
లించి నిలువంబెట్టి సభాసదులు చూడ ని ట్లనియె. 110

క. తనశక్తికి మించినపనిఁ, గాని సేయనిభృత్యు నిట్లు ౹ గోయం దగునే
ఘనకల్మషాత్మ నీ వైక, తనయుండవె ఘాతుకుండ ౹ ధర్మవిరోధీ. 111

తే. తనయుఁ డంచును జేసిన తప్పు మాపి
వదలిన నైన లోకులు వంచకుఁ డని
పాడి తప్పినవాఁ డని పలువిధముల
దూఱుదురు దాన నాకీర్తి తొలఁగిపోవు. 112

వ. మఱియు సేవకుని బుత్త్రింబోలెఁ జూడం దగు నిట్టియకృత్యంబు కడంగి యొఱుకువాని తెఱంగునం జేసితి విట్టియపరాధనంబున కేమి సెప్పెద వని యడుగ నవ్విజయసేనుండు శిరంబు వంచి మాఱాడకుండుటం జేసి జనకుం డిట్లనియె. 113

తే. ప్రముచ్చిలితి నంచు నొరులకు వచ్చి నుడువు
వాఁడు గలఁడె ధరిత్రి నవ్వాగను దప్పు
చేయుటం జేసి నాతోడఁ జెప్ప వెఱచి
మిన్నకుండెదు సాక్ష్య మీ మీఁద నేల. 114

వ. అని కోపోద్రేకంబున వికృతకర్ణుఁ డైయుండు సేవకునిం బిల్చి నీచెవిం గోసినమాడ్కి వీనిచెవి గోయు మని చెప్ప నాభటుండు భయంపడి యూరకుండుటం జేసి తనకరవాలంబునం గుమారునిచెవిం గోసినవాఁ డయ్యెఁ గావున. 115

ఉ. చెప్పఁడు బాస నాతనయ చే నొనరించెద నెట్టిదైన మీ
రిప్పు డనంగ వార లిది యేమివిచిత్రము మున్న కన్నె యే
చొప్పునఁ జూలు దాల్చె నిది చూడఁగఁ గారణ మేదియో యొకం
డెప్పుడునైనఁ బుత్త్రి యని యుల్లమునం గృప మానఁ బాడియే.

చ. అని తలపోసి యిప్పుడు ధరాధిపుఁ డెమ్మెయిఁ బల్కె నమ్మెయిం
గని పలుకంగ మే లెసఁగుఁ గా దని పల్కిన నెల్లవారు దు
ర్జను లని యెంచి కోపపడు సాజము ఱేండ్లకు నిట్టిబుద్ధి గా
వునఁ దగుమాట లాడవలె నూరకయుంట ఫలంబు లే దికన్. 117

తే. అనుచుఁ బల్కిరి యిమ్మెయి నవనినాథ
చెఱఁగు మాయక చూ లగు తెఱఁగు మేను.

విన్నదియుఁ గన్నదియు లేదు | విన్నవార
మయ్య మీమాట యీవింత | యరుదుగాదె. 118

సీ. వ్రతదానములు చేసి | సుతఁ గాంచితివి సుధాం
బుధివంటికులము పెం | పొందఁ గోరి
కడకు నీవిధ మయ్యెఁ | గడు భవద్విఖ్యాతి
కూన మై రాజేంద్ర | యుర్వి నిట్టి
గుట్టు డాఁచితివేని | కోఁటడం బొనరింతు
రెల్ల జనంబులుఁ | దెల్లమిగను
గనుక నేదేని బా | సను జేయు మని దాని
నిజము గాంచుట మేలు | నెఱి దనర్ప
నవుడు లోకులు కడు మెచ్చి | యనరె "యారా
మనరేంద్రుండు ధర్మంబు | మానకుండఁ
దనకుమారిత చేసిన | తప్పిదమును
మూసిపెట్టక దండించె | బాసవలన. 119

సీ. తగ 'యథా రాజా తథా ప్రజా' యనునార్య
వచనంబుభంగి భూ | వరుఁడు వినఁగఁ
జొప్పడ సభ్యులు | సెప్పఁగ నాలించి
బాపురే యేమి నా | భాగ్య మంచు
నెంతయుఁ జింతించి | యిది యేదియో యొక
విపరీతహేతువ | వేఱు గాద
టంచు మనంబున | నెంచి కాఁ గలకార్య
మగు దీని కూరక | వగవనేల
యని దృఢాత్ముఁ డగుచు | నంతఁ జారునిఁ బిల్చి
పోయి దుష్ట మైన | పుత్త్రి నిటకుఁ
గొంకు మాని తోడు | కొని రమ్ము పొమ్మని
పల్క నేఁగి పుణ్య | వతి కెఱింగి. 120

వ. రాజునానతి నుడివి సత్యవతిం బంపు మని యమగుటంజేసి పుణ్యవతీ
దేవి భయభ్రాంతచిత్తయై యిట్లు చింతించె. 121

ఉత్సాహవృత్తము. భూరికోపమానసమునఁ బోయి ప్రాణనాథుతోఁ
నోరు పింతయేని లేక యుగ్రవృత్తి నక్కటా
యీరహస్య మేను డాఁపకేల చెప్పితిం బ్రియం
బారఁ బుత్త్రిపో యటంచు నాత్మ నెంచ కిమ్మెయిన్. 122

ఆ. చూలు గల దటంచుఁ జూడక యిప్పుడు
మ్రోల నిల్పి కత్తిపాలు సేయఁ
దలఁచె నోర్కి లేక దండించి యెటకేని
నుసల కేఁగు మంచు నుమవునోర్కి. 123

వ. మఱి యిట్టిసమయంబునం బ్రాణనాథుపాలికిం బోయి పుత్త్రిని ర
క్షింపు మని వేఁడు టుచితంబు గాదిఁ కేమి సేయుదు నని కూఁతుక
డకుం జని యిట్లనియె. 124

తే. సత్యవతి యేల పుట్టితె సభకుఁ బోయి
నిలుచునట్లుగ నాగర్భ నిరయమందు
నక్కటా పొమ్ము జనకుని యాజ్ఞ నరణి
ననుడు నక్కన్య జననితో ననియె నిట్లు. 125

తోదకవృత్తము. ఇంతకు నాఫల మిట్టుల యుండం
గాంతురె మీ రను కంపముతో న
త్యంతప్రియమ్మున హైమవతీశుం
డంతటి కుండ భయంపడ నేలా. 126

క. పుట్టించినభగవంతుఁడు
గిట్టింపఁడె యెప్పుడేని క్లేశం బేలా
పట్టుగ నాజనకుఁడు తలఁ
గొట్టించిన మేలె కొలువు కూటములోనన్. 127

తరళవృత్తము. కడుపుచేటుగఁ బుట్టి తం చను కంపవృత్తిఁ దొఱంగి న
న్నడకు నిమ్మెయిఁ జేసి తీవు నికారమేర్పడ నైననీ

కడుపుఁ గన్నఋణంబు దీర్పక క్రచ్చఱం జనఁ బాడిగా
దిసుదు దండము లా ఋణంబున కీడు గాఁగను నా మెడన్. 128

వ. ఇప్పటి ప్రేమ నుండు మని చెప్పి చారుని వెన్నడి బాలహంసగమనంబు భంగి మందగమనంబునం దండ్రిపాలికిం బోయి యొక్కెడ నిలుచుటం జూచి జనకుండు. 129

గర్భవతి యగు సత్యవతిని జంద్రగుప్తుండు కూఁతు రని కరుణింపక కొలువుకూటమునకు రప్పించుట.

క. ఓసి కులాధమురాలా, చేసిన పని డాఁపకుండఁ జెప్పుము వినన
ట్లీసభవారికి నన విని, యాసత్యవతీనలామ యతిభక్తి మెయిన్. 130

తే. ఆసమాజంబునుం జూచి యయ్యలార
వినుఁడు కరుణించి వేషంబు వేసి తేని
యాడకే యూరకుండ నెట్లగు నటంచు
మ్రొక్కు లిడి వల్కె నిమ్మెయి మొనసి యపుడు. 131

తే. ఎద్దుపుం జెడ్డఁగాకికి ముద్దుగాదు
నెమలికన్నీరు వేఁటకానికి నిజంబు
గాదు నాగుట్టు సెప్పినఁ గాని సత్య
మని వచింతురె లోకులు విని ముదమున. 132

క. వనరుహమిత్రుననుగ్రహ
మున నిమ్మెయిఁ గల్గె నన్యకముం గానను న
గ్గని యింకఁ జెప్పఁ డొకబా
సను దప్పక చేయు దాన సత్యము మెఱయన్. 133

వ. అని ధైర్యంబునం బల్కు రాజపుత్త్రిం జూచి యాసామాజికులు విస్మయపరీతచేతస్కులై యిట్లనికొనిరి. 134

సీ. మనము రాజేంద్రుని మానసం బేగీతిఁ
గల దట్లు వచియింపఁ గలమె బాస
నను వారు మఱికొందఱాయీశ్వరునిమాయ
గాని దీనికిఁ జెప్పఁ గలమె బాస

ననువారు కొందఱు । మనకేల యేనింద
గనుచుంద మూరక । ఘనత మెఱయ
ననువారు మఱికొంద । ఱాశ్చర్యపడి కన్నె
చూ లెట్లు దాల్చును । జోద్య మిదియు
ననెడువా రింత కీకన్నె । యందు సత్య
మున్న చో బాస యేదేని । యొనరఁ జేయు
ననెడువా రందుఁ గొంద ఱి । య్యబల బాస
చేయనోపునె యీచూలు । చేఁ గడంగి. 135

వ. మఱియు సూర్యననుగ్రహంబున నిట్లయ్యె నని వచియించె నది సత్యం బని తలంప నగునే యని పలువిధంబులం బల్కు చుండి రప్పు డాస భాంతరాళంబున నర్కుండు వృద్ధభూసురవేసంబు ధరియించి యుం డి మెల్లఁగ లేచి చంద్రగుప్తునిఁ జూచి యిట్లనియె. 136

తే. వినుము నరనాథ యెవనిచే । వెలుఁగుముజ్జ
గంబు లెవ్వానివలన స । స్యవ్రజంబు
వాయు నెవ్వనికృప వృద్ధి । వడయు జీవ
రాసు లెవ్వనిచే వేద । రాశి వఱలు. 147

వ. మఱియు నయ్యీశ్వరుండు సర్వకాలంబుల నను స్తదేశంబుల సర్వావ స్థల సకలవస్తువుల దశదిశల నాశ్రమంబుల బహిరాద్యవ్యక్తుఁడై సర్వ తోముఖుం డనం బరఁగు నయ్యనఘుండ సత్యజ్ఞానానంద పరబ్రహ్మం బుప్రభావం బిత్తెఱంగునం బ్రకాశించు నని వెండియు నిట్లనియె.

ఆ. వేషధారి యొకఁడ । వివిధవేషంబులు
దాల్చి వింతగా స । దస్సునందు
నాడినట్లు వెలుఁగు । నా పరబ్రహ్మమి
ట్లనని యెల్లవారి । యందు నెపుడు. 139

వ. అదియునుం గాక. 140

తే. వినుము యువకేతుఁ డనుయోగి । వీర్యసంయు
తోదకము ద్రాగి తొలి బాల । యోర్తు చూలుఁ

డాల్చె నిబ్బంగి మఱి యిట్లు - తా విభాండ
కుండు మృగమున ఋశ్యశృంగునిఁ గనం డె. 141

క. అనిలుం డూరక యంజన
యనుదానిం గనినకతన - హనుమంతుఁడు పు
ట్టెను బాహుబలయుతుం డై
ఘనత వహింపఁడె యతండు - కపివర్యుం డై. 142

వ. మఱియు నరుణాశ్వుం డను రాజపుత్త్రుఁ డగు యువనాశ్వుండు పుత్త్రు
లు లేమిం జేసి భూదేవ్రోత్తములవలన నింద్రయాగం బొనరించుచుండి
దీక్షామధ్యకాలంబున నొక్కనాఁటిరేయి తనకుఁ గడుదప్పి యగుటం
జేసి యచ్చట నారాధింపఁబడిన యింద్రకలశోదకంబు ద్రావె నంత
నయ్యువనాశ్వునకు గర్భం బావిర్భవించి మాంధాత జనించె నిది
యునుం గాక. 143

సీ. ఉత్పలావతి యను - యువతిని దొల్లిని
ర్వృతిచక్షుఁ డనుముని - మృగము గమ్మ
టంచు శాపం బిచ్చె - నాశాపమును బొంది
మృగముగ నడవిలో - మెలఁగుచుండ
నొకనాఁడు వేఁటాడు - టకు సురాష్ట్రమహీత
లేంద్రుఁ డయ్యడవికి - నేఁగి యచట
శాపాన్వితమృగంబు - సంచరించుటఁ జేసి
పట్టఁ జూచిన నది - పట్టుఁబడక
యేఁగునప్పుడు తనదేహ - మొసఁగ దానిఁ
దాఁకుటం జేసి చూలొంది - తామసుఁ డను
మనువు నాల్గవవానిని - గనె ధరిత్రి
నరయ దేవమహర్షుల - వరము లెపుడు. 144

క. సరవిగఁ బొందినవారలు
పరికింపఁగ నెద్దియేని - వడయుట యరుదే

ధరణీశ్వర యట్లోకవర
మొఱిమం గొని చూలు దాల్చి । యుండదె చూడన్. 145

వ. కావున నిబ్బాలికయందు సత్కృత్యం బున్న దని తలంచితివేని దీనిచే నొకయుగ్రప్రమాణంబు చేయించి నిజంబు గను మూర కిందుఁ జూలాలిని నిలువఁబెట్ట నేల యనిన విని రాజేంద్రుఁ డావృద్ధ భూసురేంద్రున కిట్లనియె. 146

తే. ధారుణీనిర్జరోత్తమ । తగినబాస
నీవ చెప్పుము యోచించి । నేర్పసంగ
నిపుడ చేయింతు సందియ । మెఱుఁగ నిందు
నంద ఱాగిఁ జూడ నన విప్రుఁ । డనియె నిట్లు. 147

మాయావిప్రుం డగు సూర్యుఁడు చంద్రగుప్తునకుఁ బ్రమాణవిధ మెఱింగించుట.

సీ. క్రూరోరగంబును । గుదురుచుట్టగఁ జేసి
తలమీఁద నిడుకొని । దానియందుఁ
గుమ్మరసారెను । గోసి యెత్తినపచ్చి
కుండనిండుగఁ గల్లు । మెండు పోసి
కల్లొల్కకుండఁ జ । క్కఁగ నుడివెడుత్రోవఁ
జనుచు భారం బని । మొనసి నేల
డించక యొందేని । యించుక కూర్చుండి
పాదమం చనక యం । భోజమిత్రుఁ
డస్తమింపక మున్న ప్ర । శస్తమైన
రమ్యకాంభోజపురి కుత్త । రమునఁ దురగ
పర్వతము తూర్పునందు నీ । పట్టణమున
కోలి దక్షిణదిశయందు । నుండునట్టి 148

తే. సర్వపావనిభాస్కర । శైవలినికి
నుత్తరప్రాంతమున విశా । లోర్వి బరఁగు

వృద్ధగాలవవృక్షంబు క్రింద నిడఁగ
వలయు నట్లిడ నిజవృత్తి వఱలు జగతి. 149

వ. మఱియు నీప్రమాణంబు పరీక్షింప నీవు పరివారంబుతో నరుగుచు “నీ చూలా లెందేని తల నుండుభాండంబును డించునేని యప్పుడ దాని శిరంబు ఖండింపు మని ప్రమాణలక్షణంబు నుడువ రాజేంద్రుఁ డా కర్ణించి యియ్యది తగుభాష యని వచించి కూఁతుం జూచి యిట్లనియె.

చ. క్రమముగ వింటె భూసురశిఖామణి చెప్పినదెల్ల నట్లు సే
యుము కులహీనురాల మఱియొక్కటి వేఁడిన నొప్ప నింక న
క్కమలభవుండు సత్కరుణఁ గావఁగ వచ్చినఁ గాని నీదుస
త్యము పరికింపఁ గావలయు నందఱు మే లని మెచ్చునట్లుగన్. 150

క. అని చెప్పిన నక్కన్నియ
విని జనకునిఁ జూచి యిప్డు వృద్ధుం డీస
జ్జనములు వినఁ జెప్పినభా
సను జేయుదు వేఱ యడుగ సత్యము తండ్రీ. 151

క. పలుతెఱఁగుల నగ్నిని లో
కులు దూఱఁగ నుసురు వెట్టి కొని యిఁక నీభూ
తలమున నుండఁగ వలయునె
కులనాశకురా లనంగ గురువర వింటే. 152

చ. దొరఁకొని ఱోటిలోనఁ దలఁ దూఱిచి రోఁకటిపోటుఁ జూచి నే
వెఱ వఱి భీతి నొందఁగనె వీడునె వచ్చినబాధ తండ్రి నే
నరవిఁ బినాకినీనదిని స్నానము సేయఁగ నానతి మ్మటం
చురుతరభక్తి వేఁడుసుతఁ నొప్పుగఁ జూచి నరేంద్రుఁ డిట్లనున్.

ఆ. స్నానమేల నీకుఁ జనకు మియ్యెడఁ బాసి
యనఁగ సత్యవతి ప్రియంబు గదుర
ననియెఁ దండ్రి యెందు నరుగ నాసిద్ధేశుఁ
బూజ సేయుకొఱకుఁ బోయి వత్తు. 154

తే. అనిన విని కూఁతుఁ జూచి యిట్లనియె దుష్ట
చేయరానట్టికార్యంబు చేసి శివుని

పూజ యొక్కటి సేయక । పోయినందు
వలన మిక్కిలితక్కువె । తలఁప నిపుడు. 155

వ. మఱియు నీపూజనెపంబున నొందేని పోఁ దలంచినదానవు కాఁబోలు నీకుఁ బూజ గీజ యని పో నసుగ వలనదూరకుండు మనిన నా సత్యవతి యాకర్ణించి జనకునిచరణారవిందంబుల వ్రాలి యిట్లనియె.

ఆ. జనక బాసచేసి । సత్యం బెఱింగింతుఁ
గాని యూర కేల । లేని పోని
మాటలాడె దేల । మఱి పూజనెపమున
నెటకుఁ బోయె దంచు । నిట్లు వలుక. 157

వ. ధర్మంబు గాదు "సత్యమేవజయతి నానృత" మ్మనునార్యోక్తివలె సత్యమే జయించు నసత్యంబు జయింపదు గావున నిప్పటికి నించుక కరుణించి సిద్ధేశు నారాధింపఁ బంపు మెటకేనియుం బోక యిప్పుడ వత్తు నానిజం బాకింత పరికింపు మని ప్రార్థించుపుత్త్రి కమ్మోయిం జంద్రగుప్తుం డానతిచ్చె నంత. 158

ఆశ్వాసాంతములు.

క. సుజనకుముదాళిరాకా, రజనికరా! సమదదుష్ట । రాక్షసహరణా
వృజినావళిప్రశోషణ, రజతాచలసదన భోగి । రాజాభరణా. 159

మాలినీవృత్తము. ప్రవిమలగుణధామా । భక్తలోకైకసీమా
భవదురితవినాశా । భవ్యమూర్తీ గిరీశా
దివిజవినుతపాదా । దీనరక్షానుమోదా
కవిజననుతిలోలా । కామితార్థానుకూలా. 160

గద్యము.

ఇది శ్రీమదాలూరువంశపయోధిరాకామృగాంక రామ
కృష్ణదైవజ్ఞపుత్త్రి సుజనవిధేయ వాసుదేవనామ
ధేయప్రణీతం బైన శ్రీసిద్ధేశ్వరీయం
బను మహాప్రబంధంబునందు
ద్వితీయాశ్వాసము.

సంపూర్ణము.

శ్రీ ర. స్తు.

శ్రీగణేశాయనమః.

శ్రీ సిద్ధేశ్వరీయము.

తృతీయాశ్వాసము.

శ్రీ మద్గంగాధర సు
త్రామార్చితపాదయుగళ ధనపతిమిత్రా
భూమీధ్రచాప కామా
క్షీమానసపద్మభృంగ శ్రీసిద్ధేశా. 1

తే. అవధరింపుఁడు మునులార యంత సత్య
వతి పినాకిని కేఁగి పావనజలంబు
లందు స్నానంబు సేసియు నార్ద్రవస్త్ర
మును ధరించి శివాలయమ్మునకుఁ బోయి. 2

వ. ఆసిద్ధలింగేశ్వరుని సభక్తికస్వాంతంబునం బుష్పములం బూజించి దండప్రణామంబు లాచరించి యంజలి ఘటియించి యిట్లు ప్రార్థించె.

సత్యవతి సిద్ధేశ్వరుని స్తుతించుట.

సీ. జయ పరమేశ సజ్జనహృదయోల్లాన
హార మహాదేవ మహానుభావ
సుకృతకర్మకలాప సురమహీధరచాప
దళితదైత్యకలాప ధవళరూప

కామితమందార । కారుణ్యసాగర
వరభక్తహృదయని । వాస యీశ
కరిచర్మవసన దుర్గ । ఖార్ణవశోషణ
కలుష కాననవహ్ని । కామహరణ
ఫాలకుముదాప్తమౌళి క । పాలధారి
ప్రమథనాథ విపక్షృహా । ద్భానుమేఘ
దక్షమఖభంగ మానిహృ । దబ్జభృంగ
సిద్ధవటపురీధామ శ్రీ । సిద్ధలింగ. 4

ఉ. ఘాసను జేయు మంచు ననుఁ । బాములు వెట్టఁ దలంచెఁ దండ్రి న
న్నీసమయంబునన్ మనుపు । మీశ్వర యే నొకదుష్టకార్యముం
జేసినదానఁ గా నటులు । సేసిన నీవ దెఱుంగ కుందువే
భాసురమంగళాంగ రిపు । భంజన దీనదయాత్మ శంకరా. 5

ఉ. ఘాసట లేదు నాకు నిల । బాంధవు లొక్కరుఁ దల్లిదండ్రు లి
ట్లోసరిలంగఁ జేసిరి మ । ఱొక్కరు రమ్మని పిల్వరో బృహ
ద్భానుమయాక్ష నన్నికఁ గృ । పామతు లెవ్వరు గాచువారు సం
త్రాసముఁ గూర్చువా రెవరు । ధూర్జటి యొక్కఁడ వీవు దక్కఁగన్.

పాదపవృత్తము. పాయక కాలుని । పాశముతోడం
బోయి భువిం బడఁ । బోయినమార్కం
డేయునిఁ బ్రోచిన । యీశ్వర నన్నుఁ
ట్లీమెడఁ గావు ము । మేశ గిరీశా. 7

తే. రావణుఁడు తొల్లి గర్వించి । రజతగిరిని
బంతివలె నెత్తి యాడించె । భయము మాని
కడపటను వాఁడు పొగడంగఁ । గరుణ గల్గి
గాచితివిగాదె యమ్మెయిఁ । గావు మయ్య. 8

క. మును బాణాసురుఁ డెలమిం
గొనియాడఁగ వాని వేఁడి । కోలునకు ముదం

కామితమందార కారుణ్యసాగర
 వరభక్తహృదయని వాస యీశ
కరిచర్మవసన దుఃఖార్ణవశోషణ
 కలుషకాననవహ్ని కామహరణ
బాలకుముదాప్తమౌళి కపాలధారి
ప్రమథనాథ విపక్షగ్రహద్భానుమేఘ
దక్షమఖభంగ మౌనిహృదబ్జభృంగ
సిద్ధవటపురీధామ శ్రీసిద్ధలింగ. 4

ఉ. బాసను జేయు మంచు ననుఁ బాములు వెట్టఁ దలంచెఁ దండ్రి న
న్నిసమయంబునన్ మనుపుమీశ్వర యే నొకదుష్టకార్యముం
జేసినదానఁ గా నటులు సేసిన నీ వదెఱుంగ కుందువే
భాసురమంగళాంగ రిపుభంజన దీనదయాత్మ శంకరా. 5

ఉ. బాసట లేదు నాకు నిల బాంధవు లొక్కరుఁ దల్లిదండ్రు లి
ట్లోసరిలంగఁ జేసిరి మఱొక్కరు ర మ్మని పిల్వరో బృహ
ద్భానుమయాక్ష నన్నిఁకఁ గృపామతు లెవ్వరు గాచువారు సం
తోసముఁ గూర్చువా రెవరు ధూర్జటి యొక్కఁడ వీవు దక్కఁగన్.

పాదపవృత్తము. పాయక కాలుని పాశముతోడం
 బోయి భువిం బడఁ బోయినమార్కం
 డేయునిఁ బ్రోచిన యీశ్వర నన్నుఁ
 ట్లీయెడఁ గావు ముమేశ గిరీశా. 7

తే. రావణుఁడు తొల్లి గర్వించి రజతగిరిని
 బంతివలె నెత్తి యాడించె భయము మాని
 కడపటను వాఁడు పొగడంగఁ గరుణ గల్గి
 గాచితివిగాదె యమ్మెయిఁ గావు మయ్య. 8

క. మును బాణాసురుఁ డెలమిం
 గొనియాడఁగ వాని వేఁడికోలునకు ముదం

పాహి బుధహృన్నివేశ కృపాంబురాశి
పాహి భూసురవేష దుర్భయవినాశ. 14

సీ. నానాఁడు నీదర్శనంబు లేకుండిన
మానవు లెమ్మెయి మనుదు రిలను
నానాఁడు నీదర్శనము సేయకుండిన
మానవులకు ముక్తి మార్గ మెట్లు
నానాఁడు నీదర్శనము సేయుచున్నచో
మానవు లొందరే మహితగతులు
నానాఁడు నీదర్శనము జీవనము ప్రాణి
కోట్లకు వేఱెద్ది కుముదవైరి
కర్మసాక్షి దినేశ సుఖప్రదాత
సర్వరిపుకుముదానీకసారసాప్త
దివ్యతేజోవిరాజిత దేవదేవ
సమయ మిది ప్రోచుటకుఁ బ్రశస్తస్వభావ. 15

వ. మఱియు నీపంచాశత్కోటియోజనవిస్తీర్ణం బగుభూమండలి న హోరాత్రంబులయందు ఛందోమయాశ్వహేషలు నుభయపార్శ్వంబుల న్మారకరపింగళాదులధ్వనులును జెలంగ వాలఖిల్యాది మునిసత్తములు ఋగ్యజురుక్తసారమంత్రంబులఁ బఠింప జాయారత్నం బగుఛాయాదేవిం గూడి యేకచక్రాన్విత శతాంగారూఢుండై సంచరించుచుం ద్రిలోకబాంధవుం డని పేర్కొన్ననిన్నుం బ్రస్తుతింప నాదిభోగీంద్రునకుఁ దరంబు గాదు గావున. 16

తే. మ్రొక్కెదను భాస్కరా యిదె యొక్క మ్రొక్కు
పెక్కు మ్రొక్కులుగా నెంచి ప్రేమఁ గావు
మనఘ నేఁ బోయి జనకుని యానతిచ్చు
బాస చేసెదఁ దోడ్పడు భద్ర మెసఁగ. 17

వ. అని పలుతెఱంగులం గొనియాడి యార్ద్రవస్త్రంబుతోఁ దండ్రిమ్రోలకుం బోయి దండంబు లిడి యచ్చటిజనంబులు వినంగ నిట్లనియె.

క. అయ్యా వచ్చితి నాచేఁ
జయ్యనఁ జేయింపు బాస జనములు గన నే
నెయ్యదియైనం జేసెద
నియ్యవనిం గీర్తి పొందుమీ హేతువుచేన్. 19

వ. అని పల్కెడుసత్యవతిం జూచి యచ్చటిజనంబు లచ్చెరువొందుచు ని ట్లనిరి. 10

తే. బాపురే యేమిధైర్య మీబాలికవద
నారవిందంబునందు భయాతిరేక
చిహ్నములు లేక పయిఁబయిఁ జెన్నుమీఱి
యుంటకును నేమి హేతు వై యుండు నొక్కొ. 21

సత్యవతి ప్రమాణంబు సేయుట.

వ. అని మాటాడుకొను చుండుసమయంబునం జంద్రగుప్తనరేంద్రుండు వ్యాళగ్రాహివలనఁ గ్రూరోరగంబును మద్యకారకునిచే మద్యంబును గులాలునివలన నార్ద్రఘటంబును దెప్పించి కూఁతుం జూచి యి ట్లనియె. 22

క. చేసెద బాసను నాపై
దోసము గనుపట్టెనేని ద్రుంపుము తల నం
చీసునఁ బల్కితివి గదా
రా సరవిం జేయు మిపుడు రహి నిజ మెఱుఁగన్. 23

వ. అని యావ్యాళగ్రాహిం బిలిచి చిఱచిఱలాడుచు బుసగొట్టుచు విసంబు గ్రక్కుచుండు నుగ్రభుజంగంబును సత్యవతిముందట విడిచి పొమ్మనుడు వాఁ డట్లు చేయ నది యంత. 24

ఆ. పడగ నేలఁ గొట్టి పఱచి జనంబులఁ
పైకి నుఱుక దానిఁ బట్టి చుట్టఁ
జేసి తలను దాల్చు చెచ్చెర నని కూఁతుఁ
జూచి యనఁగ నపుడు చూలుపడఁతి. 25

తే. అమ్మహాగ్రాహి నంత రయమునఁ బట్టి
పుష్పహారంబుఁ గంధరంబున ధరించు
నట్లు కంఠమున ధరించి యందఱకును
దండములు పెట్టి యిట్లనె తండ్రులార. 26

తే. ఇఁకఁ బ్రమాణంబు చేసెద నించుకేని
తప్పిదం బున్నఁ దగినయుత్తరు వొసంగుఁ
డంచు నాపామును శిరంబునందుఁ జుట్ట
చేసి యిడికొనె యందఱచ్చెరువు పడఁగ. 28

వ. అప్పు డెల్లవారి ట్లనుకొనిరి. 29

తే. ఏమి యీవింత భయమించుకేని లేక
యుగ్రభోగిని శిరమున నుంచుకొనియె
నుంచినప్పటి కది యొందు నుఱుక కుండ
నూరకున్నది మఱి మంత్ర ముండు నొక్కొ. 30

వ. అ ట్లేదేని మంత్రరాజం బిక్కన్య యెఱింగి యుండుటం జేసి తన్మహిమాతిశయంబున నూరకున్న దట్టిమంత్రంబు లనేకంబులు నేర్చియుండు లేకున్న నిప్పురుషప్రమాణంబు సేయ నొడిగట్ట దనుచుండ నాచంద్రగుప్తుండు పుత్త్రిం జూచి. 31

క. శిరమున నురగము నిడికొన
నరు దని నేఁ దలఁప దానియం దీఘటముం
బూరి నిల్పి మద్యమును గొని
పరిపూర్ణముగాను బోసి పాటవ మెసఁగన్. 32

తే. కుండలో నుండుక ల్లొల్కకుండ నిపుడు
వృద్ధవిప్రుండు సెప్పినవిధిని బామ్ము
త్రోవ యచ్చటి కిదె చూడు తోడ వచ్చు
వాఁడ నని చెప్ప నాసత్యవతి రయమున. 33

వ. వృద్ధవిప్రుఁడు సెప్పినమాడ్కి శిరంబున నమ్మద్యపూరితార్ద్రఘటం
బును వలయితభుజంబుపై నిడికొని చూపఱ కిట్లనియె. 34

క. అందఱకుఁ బ్రేమ మ్రొక్కెద
నందఱు దీవింపుఁ డింక నరిగెద మీ రా
నందంబునఁ బాడఁగనుం డర
విందాప్తుఁడు చరమదిశకు వెడలక మున్నే. 35

వ. మఱియు నాపోవుస్థానం బిటకు షడ్యోజనపరిమితదూరం బున్న
దని వింటి నని దక్షిణాభిముఖి యై పథంబుం జూచి సూర్యచంద్ర
శేఖరులను శివయోగీంద్రుని మనంబునం దలంచుచు నరుగుచుండె
నయ్యవసరంబున. 36

తరలవృత్తము. పరిజనంబులు వెంట రాఁగ నృపాలుఁ డశ్వము నెక్కి చె
చ్చెరఁ గొమారిత పోవురీతి విశేషకోపవికారుఁడై
పురజనావళి సూడఁ దాఁ గనఁ బోవుచుండెఁ గరంబునం
దరవరిన్ ధరియించి యప్పుడు తల్లి కూఁతున కాత్మలోన్. 37

ఉ. తప్పను దాఁచితే ననుచితం బని యెంచితి నెంచకున్న నీ
యొప్పమి గల్గునే యకట యోచన దోఁపక పోయె నింక నే
నెప్పుడు చూతుఁ గూఁతు నని యేడ్చుచు నింతె ఋణంబు కద్దనం
జొప్పడఁ బుట్టినందులకుఁ జూడఁగ నంచును జింత నొందుచున్. 38

క. తొలి నేఁ జేసినపూజా
ఫల మింతియ పో యటంచుఁ బలితోఁ బోవం
దలకొని యుం బో నోపక
యిలుసేరెను వెనుక మఱలి యీశ్వర యనుచున్. 39

ఆ. అపుడు పురజనంబు లందుఁ గొందఱు గూడి
యేఁగి చూత మెల్లరీవిచిత్ర
మెట్టు లగు నటంచు నేఁగి రాచూలాలు
నంత సరవి వేంకటాద్రిపథము. 40

క. చనుచుం దనబడి వచ్చెడు
జనములఁ దాఁ జూడకుండఁ జనుఁ ద్రోవ యిదే
యను చోరులఁ జూచి యడుగక
వనజాప్తునిమీఁదిభక్తి వదలక వడిగన్. 41

చ. శిరమున భాండ మున్నదని చిత్తమునందుఁ దలంపకుండ నం
బరమునఁ బోవుపక్షిపతి భాతి పథంబునఁ బోవుచుండె సా
దరమున నప్డు నందిని ముదంబున నెక్కి నభంబునందు శాం
కరియును దా మహేశ్వరుఁడు గావఁగ నేఁగుచు నుండెఁ గన్యకోన్.

వ. అట్లరుగుటం జేసి గణాధ్యక్షుండును వీరభద్రుండును షాణ్మాతురుం
డును భృంగీశచండికేశ్వరాదిభూతగణంబులును జూచి యి దేమి
వింత యని శంకరుని వెన్నడిం జనుచుండ నప్పు డాశాధిపతులు
వీక్షించి యి ట్లనుకొనిరి. 43

ఆ. ఎచటి కేఁగువాఁడొ యిమ్మొయి నీశ్వరుం
డెచట నేమిదోసఁగు లేరికైనఁ
గల్గెనో మఱెట్టి కట్టిడి యేభక్తు
బాధ వెట్టెనో విరోధముగను. 44

వ. మఱియు గర్భవతి యగునికన్యకారత్నంబును రక్షింపఁ బోవువాఁ
డోంనమోమృత్యుంజయాయ యని నమస్కరించిరి పులోమజాప్ర
ముఖామరాంగనలు నమోశూలపాణియే యని ప్రస్తుతించిరి మహా
యోగీంద్రులు గాంచి నమోత్రిపురాంతకాయ యని కీర్తించి రంత
నాచూలాలు సిద్ధవటపురంబును దాఁటి ఖరపాఖ్యపురమార్గంబునం
జనుచుండ నందలిజనంబు లారాజకన్యకను జూచి విస్మయపరీతచే
తస్కులై యి ట్లనుకొనిరి. 45

ఉ. ఇంటికిఁ గానికన్నె యిల నిమ్మొయిఁ జూలును దాల్చి యుండగాఁ
గంటిమె యెవ్వరేని మును గంటి మటంచును జెప్ప వీనులన్
వింటిమె యేమి కాల మిది వేల్పులవేఁడబమో తలంపఁగాఁ
దుంటలతోడఁ గూడి యిటు దూఁకలి పొందఁగఁ జూలు దాల్చెనో.

సీ. మఱియు నిక్కన్యకామణి చంద్రగుప్తభూ
పాలునిపుత్త్రి కాఁబోలుఁ జూడ
గర్భంబు దాల్చినకతన దానినిజంబు
గనుపట్టఁ బాస నిష్కరుణఁ బూని
తనరాజధర్మము దప్పి నటంచు భూ
జనములు చూడంగఁ గనికరంబు
వదలి సేయించినవాఁడు లేకున్నచోఁ
దరవరి కరమునం దాల్చి హయము
నెక్కి వెన్నడిఁ బో నేల యింతతీవ్ర
ముగ నటంచును బలువిధములుగ మాట
లాడుకొను చుండి రప్పురియందు గుంపు
గూడి యప్పుడు చూలాలుకొంకు విడిచి. 47

తే. జనపదంబులు సకలసస్యములవృద్ధి
చే నెసంగెడుభూములు చెన్నుమీఱు
వనములను దాఁటి వేగమ వచ్చె వీర
భద్రపురవీథి నచ్చటివారు లెల్ల. 48

సీ. కంటిరే యీరాచకన్నియఁ జూలుతోఁ
బచ్చికుండను దలపైని బూని
కడురయమ్మునఁ బోవుకత మేమి గల దొక్క
తోడ్పాటు లేకుండఁ ద్రోవఁ గడఁగి
మఱి చూలు దాల్చినమగువ లివ్విధమున
నడతురె మార్గముఁ దొడరి భళిరె
యేమి యీవింత మఱేదేని దప్పున్నఁ
జేసిరో దండన యీసుచేతఁ
జెలఁగు మాయక చూ లెట్లు చెందె మఱియుఁ
గుంతి తొల్లి ధరింపదె వింత మీఱ
నవ్విధం బగుఁ గాఁబోలు నైనఁ దల్లి
యొడఁద దయ లేక బాసకు నెట్లు పంపె. 49

వ. మఱియు నీచూలాలితల్లిదండ్రులకుఁ బురోహితామాత్యాదిజనంబు లైన 'నిక్కార్యంబు దేవఋషులమహిమాతిశయంబువలనం గల్గియుండు నిద్దానికి "నహసావిదధీతక్రియా" మను నార్యవచనంబుఁ బాటించి ప్రమాణంబు సేయింపుఁ' డని చెప్పక "యథారాజాతథాప్రజా" యనులోకోక్తివలె రాజు పోయినతెఱంగునం బోవుటం జేసి యిట్లయ్యె నని మాటలాడుకొను చుండి రప్పుడు. 50

క. ధరణీనాథుని వెన్నడిఁ, బరిజనములు నడవ లేక బడలి పథమునం
దురుతరువులనీడల ని,ల్చిరి తురగము నట్లు చేవ చెడి పుడమిపయిన్.

క. తడఁబడుచు నిల్చి నడవక
కడుడప్పి యెసంగి ఱేఁడు కాసారములం
దడవుచు జలములు ద్రావుచు
బడలి తురంగంబుతోడఁ బథమున నొకచోన్. 52

తే. భూరుహచ్ఛాయ నాయాసముడుగఁ జేరె
నంత నాసత్యవతి పథంబెంతదూర
మున్నదో యింక నని మది నెన్నకుండ
జనకునానతిచొప్పునం జనుచు నుండె. 53

వ. అట్లరుగుచు మార్గమధ్యంబున ఘోరమదేభశార్దూలవరాహభల్లూకోగ్రభుజంగాది జంతుసంతానాన్విత భూరిపర్వతమహీరుహకంటకలతానికుంజపుంజపరిపూర్ణదుర్గమకాంతారంబును గడచి వృక్షరహిత విశాలభూప్రదేశంబునం గలసెలయేళ్లు దాఁటి వచ్చుచు ముందట.

క. జలధులు మించుతటాకం
బులు గమలాకరము లొప్పభూదేవి శుభో
జ్జ్వలవసనము దాల్చిన దనఁ
బలువిధసస్యాభివృద్ధిఁ బరఁగెడు భూమిన్.

తే. ఎలమిఁ బొడగాంచి యించుకనిలిచి తండ్రి
యానతిచ్చినచో టెయ్యదని తలంచు

చుండ సస్యాన్వితానిలంబొడలఁ జల్లఁ
దనము గా వీచె బడలిక తలఁగ నపుడు. 56

అశరీరవాణి సత్యవతికి సురాభాండంబును డింపు మని చెప్పుట.

ఉ. రాజకుమారి చూడు మట రాజగృహంబులు రమ్యగోపుర
భ్రాజితనవ్యరత్నశిఖరంబులతో నెసలారుచుండఁ గాం
భోజపురం బదే యటకుఁ బోయినఁ గాంతువు భూరిగాలవ
క్ష్మాజము దానిమూలమునఁ గ్రచ్చఱ డింపుము మద్యభాండమున్.

వ. అని నభంబుననుండి వినంబడుటం జేసి యాచూలాలు ముదం బంది
యించుక నిలిచి కనుదోయి నలుదెసలం గలయం జూడఁ బురోభా
గంబున శారికాశుకపికమయూరప్రముఖానేకవిహంగసందోహకృత
మధురరుతివిసరసంకలితోద్యానవనంబులును దన్మధ్యంబునం గలు
షనిచయఘ్న యగుభాస్కరతరంగిణియుం జెలువాఱుచుండఁ ద
త్కాలంబున. 58

తే. సకలసౌభాగ్యకలితంబు సర్వశత్రు
సమదవారణవారపంచాననంబు
ఘనయశోధామ మఖిలసౌఖ్యప్రదంబు
పోరిఁ గనుంగొనెఁ గాంభోజపురవరంబు. 59

తే. అట్లు పొడగాంచి ముద మందు చాపురమున
కుత్తరపు దిక్కునదిదరి నుండుదీర్ఘ
శాఖ మగుసాంద్రదలోర్ధ్వవృక్షంబుకడకు
నరుగ నత్తఱి మఱల నంబరమునుండి. 60

క. విన వచ్చె బాలికా యిఁకఁ
జనకు ఘటం బిచట డింపు జనకుఁడు నీకా
జ్ఞ నొసంగినచో టిదిగో
గను గాలవపాదపంబుఁ గను లారంగన్. 61

సత్యవతి సురాభాండంబును డించి ప్రత్యక్షుం డైనపరమేశ్వరుని స్తుతించుట.

చ. అన విని యాపొలంతి ప్రమథాధిపు నెంచుచు నర్కు వేఁడుచుం
తనతల నుండుభాండమును దద్రుమమూలమునందు డించెఁ జ
య్యన నపు డంబరస్థలి సురాంగన లందఱు గుంపు గూడి తె
చ్చెను వనజాక్షు లందఱును శ్రీయుతకీర్తి ధరాతలంబునన్. 62

వ. అని విస్మయపరీతచిత్తు లై పుష్పవర్షంబు గురియించి రయ్యవసరం
బున నత్యంతానుమోదాత్ము లై శాంఖికులు శంఖనాదంబులు
సేయఁ బ్రమథగణంబులు గొల్వ వృషరాట్తురంగంబున నుమాసహి
తుం డై యయ్యంతర్వర్తి సమ్ముఖంబున నిలిచినం జూచి యాసత్య
వతి పరమానందదుగ్ధాంబుధినోలలాడుచు నిట్లు వినుతించె. 63

చ. జయ రజతాచలేశ గిరిజాకలితార్ధశరీర యోగిసం
చయకృతవాస దైత్యరిపుసంఘవిలాస మహేశ్వరా దుర
త్యయనిగమప్రకాశ కుసుమాస్త్రవినాశ యఘాపహా పుర
త్రయహర వ్యోమకేశ మదదానవనాశ భుజంగభూషణా. 64

తే. సకలలోకేశ సర్వేశ సవననాశ
సకలభూతహితప్రద సదయహృదయ
భక్తలోకైకరక్షణ పావకాక్ష
దీనమందార శంకరా దేవదేవ. 65

సీ. ఎవఁడు మూఁడుగుణంబు లెసఁగ ముమ్మూర్తులు
గాఁ బ్రకాశించెడు ఘనవిభుండు
ఎవఁడు మాయైకగృహీతచిత్తులకు ర
జ్జూరగభ్రాంతిని నొప్పువాఁడు
ఎవఁడు భూతలజల పవనాగ్నినభములం
దలరి ప్రపంచాత్ముఁ డైనవాఁడు
ఎవఁడు జీవులయందు నెసఁగి యంతయుఁ దాను
నిండి యక్షీణుఁ డై యుండువాఁడు

ఎవ్వఁ డీరేడుజగముల కీశ్వరుఁ డయి
విమలతేజంబు వెలిఁగించు వేడ్క నట్టి
నీదుమితిలేని మహిమంబు నెఱి నుతింప
శక్యమే నాకు శంకరా శరణు శరణు. 66

చ. పరుసగుబాస నీవరకృపన్ నెఱవేర్చినదాన నోమహే
శ్వర యిఁక నుండ నోపఁ బెఱవారలు చూడఁగ నిజ్జగంబునం
దరయ భవత్పదాబ్జములయందు రయంబునఁ జేర్చుకొమ్ము స
త్కరుణ నటంచు వేఁడునెడఁ గగ్గెను గుట్టొగిఁ జూలుమించుటన్.

తే. అపుడు నందిని డిగ్గి యుమాధిపుండు
సత్యవతిఁ బ్రీతిఁ జూచి నీసరణి ననియె
నమ్మరో చింత యేల నీవడిగినట్లు
మత్పదంబులకడఁ జేరు మఱియు నిపుడు. 68

తే. వినుము నీగర్భమునఁ బుట్టుఁ దనయుఁ డెలమి
వానిఁ గని మోద మొందుము దానిమీఁద
జనకుఁ డిట వచ్చి నీబాస సత్యమంచు
మెచ్చినం గాని యెటకేని మీఱి చనుట. 69

తే. తగవు గా దట్లు ప్రాయిన ధర్మము సెడు
మిత్రుఁ డస్త్రాద్రి కేఁగక మింట వెలయు
చుండువిధమును నీతండ్రి చూడ వలయుఁ
ద్వర యిదేటికిఁ గొండొక తడవు నిలువు. 70

వ. అదియునుం గాక యిపుడు నీగర్భంబునఁ బుత్త్రుఁ డావిర్భవించు నా శిశువుం జూచి సంతసించి యావల నిట కింద్రభాగంబునఁ గ్రోశద్వయపరిమితదూరంబునందు భాస్కరనది ప్రవహించుచుండుఁగాన నట కుం బోయిన. 71

తే. కందు వానదిమధ్యభాగంబునందుఁ
గడు వెడల్పగు ఱాయి యొక్కండు దాని

నట్టనడుమను జేరి మననమున నన్నుఁ
దలఁచుచుం జేత నాశిలఁ గొట్టితేని. 72

వ. అప్పు డాపాషాణంబు పటపట పగిలి యొక్కత్రోవగ నేర్పడు నా మర్మమార్గంబున నుండి నాకడం జేరి సుఖం బుండు మచ్చోట నయ్యాదిమొదలుగాఁ బాతాళఝురం బనం బరఁగి యందు నిరంతర మఘాపహారి యగుగంగ ప్రవహించుచు జనంబులకు రెండవవార ణాశి తెఱంగునఁ బ్రసిద్ధి గాంచు నదియునుం గాక. 73

మత్తకోకిలము. బాలికా నిరతంబు న న్మదిభక్తిమైఁ గుసుమాక్షతల్
ఫాలలోచన చంద్రశేఖర భవ్యరూప దయానిధీ
నీలకంఠ యటంచు నర్చనలెమ్మిఁ జేసితి విమ్మొయిన్
కాలుఁ దోలఁగఁ దొల్లిసేసె మృకండుమౌనిసుతుం డొగిన్. 74

వ. కావున నీసదమలభక్తిలత మదీయచిత్తంబునం బెనంగిన దగుటం జేసి నిన్ను రక్షింప సమకట్టి సిద్ధవటపురిం బాసి యిట కేతెంచితి నిఁక నీ మద్యఘటంబునం దుద్భవించి మహాక్షేత్రంబు లగు కాశీ కాళహస్తి కాంచి గోకర్ణ శ్రీశై లారుణాచల వృషభాచల వృద్ధాచల చిదంబరాదు లెట్టిక్షేత్రంబునం బ్రసిద్ధిగ మద్భక్త జనబృందంబులకు నీప్సితార్థంబు లానందంబుగ నొసంగుచుండెద నీకతన నిమ్మోడకు సత్యవతీక్షేత్ర మనియు సురఘటక్షేత్ర మని యుం జెప్ప నొప్పు నిఁక నంతర్హితుం డయ్యెద నని యామద్య భాండంబున లింగాకారంబునఁ బ్రకాశించె నంత సత్యవతి యయ్యా కారంబు గ్రుడగాంచి యనేకవిధంబులం బ్రస్తుతించుచు నుండు సమయంబున. 75

తే. కడువడిగఁ ద్రోవ నడచుటకతన బడలి
నిండుచూలాలు నచ్చటనిల్వ లేక
సొమ్మసిలె నేల నప్పుడుచూలుకుట్టు
గదుర దేహం బెఱింగి తాఁ గనులు దెఱచి. 76

తే. చూడ దగ్గఱ గట్టురా ॥ చూలి తనకు
బాసటగ వచ్చుటం జేసి ॥ పరమసుఖముఁ
గాంచె బాలార్కతేజసం॥కాశుఁ గ్రూర
జనవిరోధిని బుత్త్రిని ॥ సచ్చరిత్రు. 77

వ. అప్పుడాశిశువు కావు కావని యేడ్చుచుండుటయుం దెలియక సత్యవతి కొండొకతడవు దేహంబు మఱచియుండె నాసమయంబున నుమాదేవి యాంతర్హితురాలయ్యె ననంతరంబున. 78

చంద్రగుప్తుండు సత్యవతికడఁ జేరుట.

ఆ. ఒడలు దెలసి సరస ॥ నుండినశంకరిఁ
గానకుండుటకును ॥ మానసమునఁ
జింత నొందు చుండె ॥ నంతనచ్చటఁ దండ్రి
త్రోవ గానఁబడక ॥ తూలవ్రాయి. 79

క. కడు డస్సి పథముఁ దడవుచు
బడలినవారువముమీఁదఁ ॥ బథమునఁ దనవె
న్నడి రానోపక యయ్యై
యెడ నిల్చినవారియందు ॥ నెనఁ గొందఱితోన్. 80

వ. కొండొకతడవునకుఁ గూఁతురు వచ్చినయెడకుం జని ప్రతీచీదిశం జూడ నప్పుడర్కుండు చరమాద్రికేఁగకుండుటం జేసి పుత్త్రి చేసి నప్రమాణంబు సత్యంబని తలంచి యశ్వంబు డిగి పుత్త్రికడకుం బోయి. 81

సత్యవతిని చంద్రగుప్తుండు నిజపురంబునకుఁ బోవుదమని పిల్చుట.

తరళవృత్తము. నిలిచి యచ్చటఁ గావు కావని ॥ నేలపైఁ బడి యేడ్చుచుం
బొలుచు బాలునితోడ నుండెదు ॥ పుత్త్రినిం బొడగాంచి నా
తెలివిలేమికి నేమి సేయుదుఁ ॥ దేర కిమ్మెయిఁ బెక్కుగీ
తులుగ దూఱితి బాధవెట్టితి ॥ దుష్టురాలని యక్కటా. 82

సుగంధివృత్తము. బాసఁ జేసెఁ జెప్పినట్లు ॥ భంగ మొందు లేక ఛా
యాసమేతుఁ డైనయర్కుఁ డ॥స్తమింప లేదు ను

ల్లానమూరఁ జేరె నిష్కళంకచిత్త యై దుర
భ్యాసదోష ముండనేని భాసఁ జేయఁ గల్గునే. 83

వ. అని మనంబునం దలపోసి కూఁతుం జూచి ప్రియవచనమ్ముల నిట్ల
నియె. 84

క. అమ్మా కోపము సేయకు
నెమ్మది నాతోడఁ బల్కి నేరము లున్నం
బొమ్మని తిరస్కరింపకు
నిమ్మాడ్కిం జేసితి నని యెద నెంచకుమా. 85

తే. మున్ను నీతల్లి యాగట్టు మూయకుండ
వెల్లడించుటఁ జేసి యే విధినినైన
జనులు దూషింతు రిల నంచు సత్య మరయ
బాసఁ జేయించి తిట్టు లాయాసపడకు. 86

క. నానుడివినట్లు బాసను
బూని యొనర్చితివి మేలుఁ బొందితివి ధరా
జానికులంబునకు యశః
శ్రీ నెగడం జేసితివి ధరిత్రిఁ గుమారీ.

వ. కావున నీవు పరిశుద్ధురాల వని యిపు డెఱింగితి నీకుఁ బల్యాంకిక నొ
కండు దెప్పింతు నందు నీశిశువు నుంచికొని నిజపురంబునకు నాబ
డిం జను దె మ్మనెడుజనకునిపదారవిందంబులకు నమస్కరించి సత్య
వతి యిట్లనియె. 88

మ. జనకా నాపయి నాస వెట్టకుము దుశ్చారిత్ర నై యుండుదా
నిని గొంపోయి కులంబులో నిడఁగ దుర్నీతిప్రచారుం డటం
చును లోకుల్ గనిదూఱకుందురె మఱిచ్చోఁ బాసి నీవెంట రా
ననిపల్కంగ నరేంద్రుఁ డందులకుఁ జింతాక్రాంతుఁడై కూఁతుతోన్.

తే. అనియె నిమ్మాడ్కి నమ్మ యో యాత్మలోన
నెట్టిచింతలు వెట్టకు మెట్టితప్పు

లున్నఁ ద్రవ్వకు నాపయి నొంటి యిచట
నుండనేటికిఁ దగుమేడ నుండ బాల. 90

క. ఇది నిర్జనప్రదేశము, గద యిం దేమున్న దమ్మ కల్లుకడవ యు
న్నది వేఱె లేదు కావున, మదిఁ గోపము లేక రమ్ము మాసత్యవతీ.

చ. అని పలుమాఱు రమ్మనుచు నర్మిలిఁ బిల్చెడుతండ్రిఁ జూచి యి
ట్లనియె సురాఘటం బనుచు నాత్మఁ దలంపకుఁ జూడు దానిలోఁ
గనఁబడు చుండు నవ్యయసుఖప్రదలింగము భక్తలోకపా
వనమహిమానుషంగ మొగి వాంఛితదాయకసిద్ధలింగమున్. 92

{చంద్రగుప్తుండు కల్లుకుండయం దుద్భవించిన లింగముం జూచి నుతించుట.}

క. అని చెప్పఁ జంద్రగుప్తుఁడు
విని యాభాండంబుకడకు విస్మయచిత్తం
బున నేఁగి చూడ నందుం
గనుపట్టెను లింగ మొండు కన్నుల కెలమిన్. 93

తే. అప్పు డాదివ్యతేజోమయాకృతి గల
లింగమును జూచి భయభక్తిసంగతాత్ముఁ
డగుచు దండప్రణామంబు లాచరించి
ప్రస్తుతించెను దా మద్యభాండభవుని. 94

ఉ. శ్రీరజతాచలేశ శశిశేఖర శంకర నీలకంఠ కా
లారి త్రిశూలపాణి త్రిపురాంతక భూతగణాధినాయకా
ఘోరభవాబ్ధితారక యకుంఠితవిక్రమ ఫాలనేత్ర గౌ
రీరమణా కృపాశయధురీణ మహేశ్వర భక్తవత్సలా. 95

ఆ. చేయరానితప్పు చేసి చూలయ్యె నీ
దుష్టురా లటంచు మహితవలనఁ
దప్పెఱుంగుటకును దలఁచి యిమ్మెయిఁ బ్రమా
ణంబు సేయు మంటి నాగభూష. 96

తే. దానిసత్యం బెఱింగితి దానికతన
నిట్లు లింగాకృతిం దాల్చి యీఘటమున
ఘనత నెలకొన్న నినుఁ గంటిఁ గన్నులార
దక్షమఖభంగ శ్రితజనపక్షలింగ. 97

ఆ. పుత్త్రిచిత్తవృత్తిఁ బూని యెఱుంగక
చేసినాఁడ దానఁ జేసి యలిగి
నన్ను నీవు గావకున్నచో నెవ్వారు
గరుణఁ జూతు రయ్య కాలకంఠ. 98

క. గురుఁడు శివయోగిచంద్రుఁడు
పరమదయాకరుఁడు మును భవన్మంత్రము నా
కురుకృప నుపదేశించెను
నిరతముఁ బఠియింతుఁ దలఁతు నీసుగుణతతిన్. 99

వ. అని బహుప్రకారంబులం గొనియాడుచుండ నశరీరవాణి యిట్లని
యె. 100

సీ. కుతలేశ విను సత్యవతి సారమంత్రంబు
శివయోగివర్యునిచే గ్రహింపఁ
బడి తత్ప్రభావంబు వలన గర్భముఁ దాల్చె
నింతియ యపరాధ మేమి లేదు
మఱి బాల్యమువనుండి మత్పూజ భక్తిగఁ
జేయుచు నుండుటం జేసి తోఁడ
వచ్చితి నాసిద్ధవటపురిం బాసి యి
చ్చట నుండు నీమద్య ఘటమునందు
దానిపేరు వెలయ ధర భవదాజ్ఞను
బూని బాసఁజేసి భూరికీర్తి
పొందె దానికతనఁ బుణ్యాత్ముఁ డైతివి
బాధపెట్టి తంచుఁ బడకు చింత. 101

వ. మఱియు సకలపుణ్యక్షేత్రమహిమాతిశయంబు లిందుం బ్రభూతం

జగటుం జేసి సర్వఘోరరక్షోభూతపిశాచాదిదుష్టగ్రహభంజనుండ నై జన్మాంతరాసుప్రజాపహారుండ నై సమస్తకామ్యార్థప్రదాయకుండ నై యుండుదు నిమ్మేష నాకు రమ్యమందిరంబు నిర్మింపుము శిశుసహితంబుగఁ బుత్త్రిం దోడ్కొని పోయి తద్బాలకునిఁ బ్రవర్ధితుం జేసి సంతసంబున యువరాజుం జేసి సుఖం బుండు మిదియునుం గాక.

ఆ. సచ్చరిత్ర యైన సత్యవతికి గర్భ
మందు నుదయ మయ్యె నట్లు గాన
సకలజనులుఁ బ్రీతి సాత్యవతేయుఁ డం
చనఁగ నామ మిడుము జనవరేణ్యా. 103

వ. మఱియు నాబాలుండు. 104

శా. భూపాలవ్రజపూజితోజ్జ్వలపదాంభోజాతయుగ్మండు వి
ద్యాపారంగతుఁ డుగ్రశత్రుసమరవ్యాపారశూరుండు ధ
ర్మోపేతుండు ప్రశస్తలక్షణసమగ్రోదంచితాంగుండు ని
ష్పాపాత్ముండు యశోవిశాలుఁడు దయాకూపారుఁ డుర్వీశ్వరా.

తే. మఱి యుదారుండు సుగుణసమగ్రుఁ డార్త
జనశరణ్యుఁడు బంధుభూషణుఁడు నిత్య
సత్యసంధుండు సౌభాగ్యసంయుతుండు
సుకృతకర్మకలాపుండు సుజనహితుఁడు. 106

క. తనతల్లిన్బోలెఁ బరకాం
తను జూచెడువాఁడు గురుబుధజనులఁ బూజల్
మనసారఁ జేయువాఁ డిల
జనములఁ బ్రేమించువాఁడు సద్వృత్తి నొగిన్. 107

క. అని చెప్పఁగ న న్నరపతి
విని యిట్లనియె న్మహేశ వేడ్క ననుం జే
కొనుమయ్య సమయ మిది యేఁ
గొనసోపఁ బ్రపంచసుఖముఁ గొనకొని యింకన్. 108

వ. అనిన విని పరమేశ్వరుండు చంద్రగుప్తున కిట్లనియె. 109

తే. మానవేశ్వర మత్సన్నిధానమునకు
వచ్చుకాలంబు గల దంతవఱకు రాజ్య
పాలనము సేయు దౌహిత్రుఁ బ్రమద మారఁ
బెద్దసేయుము పత్నితోఁ బ్రీతి నుండు. 110

వ. అంతఁ గొంతకాలంబునకు దౌహిత్రుని యువరాజుం జేసి వాఁ
డొనరించురాజ్యతంత్రసామర్థ్యంబును గాంచి సంతసించుచు శివ
యోగీంద్రోపదిష్టమంత్రరాజంబును బఠించుచు నుండుము పర్య
వసానంబున మత్సన్నిధి కేతెంతు వనిన విని చంద్రగుప్తుండు పర
మానందాంబుధి మునింగి యాసిద్ధలింగంబునకుఁ బునఃపునఃప్రణా
మంబు లాచరించి పుత్త్రిం జూచి ప్రియంబున నిట్లనియె. 111

క. అమ్మా రా పోదము లే
వమ్మా బాలకునితోడ ననన విని తండ్రిం
బొమ్మనుడు సత్యవతితోఁ
గ్రమ్మఱ నిట్లనియెఁ బ్రీతి రాజేంద్రుఁ డొగిన్. 112

క. కోపంబు మాను నాపరి
తాపంబును దొలఁగఁ జేయు తనయా నీపైఁ
బాపం బొకండు లేదు కృ
పాపూర్ణమనమున రమ్ము పావనచరితా. 113

వ. అని యనేకవిధంబులం బిలువ నాసత్యవతి రా నోప ననుటం జేసి
దౌహిత్రుని నొకపల్యంకిక నిడికొని నిజపురంబునకుం బోయి
భార్యారత్నం బగుపుణ్యవతికిఁ బుత్త్రిగర్భంబున జనించినవాఁ డని
యాదౌహిత్రు నొసంగి పుత్త్రివృత్తాంతం బంతయుం జెప్ప నప్పుణ్య
వతి విని యత్యంతశోకపరవశ యై భర్తతో నిట్లనియె. 114

తే. కూఁతు నెబ్బంగి నేఁ గనుఁ గొందు నాథ
దానికడఁ జేర్చు నన్ను నేత్రంబు లారఁ

జూచి ప్రాణంబు విడిచి నే సుగతిఁ గందుఁ
గాలయాపనమును జేయఁ గాదు లెమ్ము. 115

తే. దాని నిజమిట్టి దని యెంచు కేని యెఱుఁగఁ
జాలనైతిని మొఱకునై సరకుఁ గొనక
యేమి సేయుదు నాకర్మ మిట్టు లుండ
నక్కటా యని వగచుపుణ్యవతిఁ జూచి. 116

వ. చంద్రగుప్తుం డిట్లనియె. 117

చ. గతజలసేతుబంధనము కైవడిఁ బోయినదాని కేల నీ
వతిపరితాప మొందెదు సహాయము దానికి శంభుఁ డుండె స
ద్గతిఁ గలిగింప భానుఁ డనుకంపముమైఁ గనుచుండె నింక దు
ర్గతి కేకహేతు వుండు నె యకల్మషురాలుగ నుండ నిమ్మహిన్.

తే. ఇప్పు డట కేను గాంతరో యేఁగి కల్లు
కడవఁ బుట్టినసిద్ధలింగమున కాల
యంబు గట్టించి నిత్యోత్సవాదు లెల్లఁ
బూని చేయింపవలెఁ గ్రమంబుగను గాన. 119

వ. ఏతచ్ఛిశురక్షణార్థ మొకపాలంతిని నియమించెద రమ్ము నాబడి నని
యట్లు చేసి వలసినవిత్తంబుం గొని పుణ్యవతితో రథారూఢుండై
పరిజనంబు లుభయపార్శ్వంబుల నడవ నమ్మద్యఘటంబుకడకుం
జనుచుండి రయ్యవసరంబున నాసత్యవతి యమ్మద్యఘటనికటం
బున నుండి యన్యజనముఖావలోకనంబు సేయ నోప నని తలంచి
తనవేఁడికోలున కాసిద్ధేశ్వరుం డానతిచ్చినయట్ల పూర్వభాగంబున
నేఁగి యం దున్నభాస్కరనదినడుమం గలవిశాలపాషాణంబును
జూచి తన్మధ్యభాగంబునకుం జని యమ్మహేశునిఁ బలువిధంబులం
బ్రార్థించుచు నాశిలను గరకమలంబునం దట్టినప్పుడు. 120

సత్యవతి పాతాళరంధ్రమార్గంబునఁ గైలాసంబునకుం బోవుట.

సీ. పెళపెళ యని వేయిపిడుగు లొక్కుమ్మడిఁ
బడినట్లు పెలుచ శబ్దంబు గల్గి

పటపట నాశిల పగిలె నం దొకగుహా
గన్పట్టె నందుండి కడువిచిత్ర
ముగ శూలిభృత్యులు మున్నడి వివిధవా
ద్యరవంబు లెలమిఁ జేయంగ వెంట
మహితపంచాక్షరీ మంత్రరాజంబుఁ బ
ఠించుచు యోగీంద్రు లేఁగుదేరఁ
గనకమయ మగుపల్యంకి కను సుభూత
గణము వెన్నడిఁ గొనిరాఁగఁ గలుషహరుఁడు
మహితకరుణాన్వితుఁడు మహా మహు డొకండు
తోడ నేతెంచి రాజేంద్రు దుహితఁ జూచి. 121

చ. సరసకు వచ్చి యిట్లనియె సత్యవతీ యిఁక రమ్ము దివ్యసుం
దర మగునందలంబున కుదంచదుదీర్ణగుణాఢ్య యమ్మహే
శ్వరునిలయంబుఁ జేరుటకు శంకరునానతిరీతి నంచు స
త్వరముగ నందలంబుపయి వారక చేర్చె ముదంబు నొందఁగన్.

తే. అట్లు గూర్చుండఁ జేసి మహాత్మ యభవ
హరమహాదేవ మృత్యుంజయా యటంచు
నందఱుం బ్రస్తుతించుచు నప్పథమున
నరిగి రప్పుడు తత్పథం బవనియందు. 123

వ. అన్యులకుం దెలియఁ గూడదంచుఁ బరమశివుం డొకమహాగండశిల
ను దద్ద్వారంబున కడ్డంబుగ నిడి నిజపదద్వయం బ్రొక్కానక్కార
ణంబున నాశిలయందుఁ దత్పదాకారంబు లేర్పడి యందుండి భాస్క
రనదీజలంబులు ప్రవహించుచుండుఁ గావున నయ్యెడకుఁ బాతాళ
ఝరం బని ప్రసిద్ధి యందుజలంబుల మునింగినవారి కఖిలపాపపుంజం
బులును సకలభూతగ్రహదుష్టరాక్షసశాకినీడాకినీపిశాచప్రపీడలు
నశించి శుభంబుగల్గు ననంతరంబ. 124

ఆ. అట్లు సత్యవతిని నందలంబునఁ గొని
పోయి దుగ్ధరాశిఁ బోలెఁ బూర్ణ

చంద్రమండలంబు చందాన వెలుఁగొందు
వెండికొండయందు వేడ్కఁ డించి. 125

వ. అందు అమ్మహారాజపుత్రికారత్నంబును నమితభక్తిం దోడ్కొని బహువిచిత్రరత్నమయమంటపప్రాసాదాంతరంబులు దాఁటి ప్రశస్తరత్నప్రభాకలితకాంచనకలశవిన్యస్తసకలకళాపరిపూర్ణ బ్రహ్మాంబు తెఱంగున వెలుంగురమ్యగోపురద్వారంబు లేడును గడచి తదంతరంబునం బ్రవేశించునప్పు డయ్యెడ. 126

సీ. ఏవంకఁ జూచిన నీశునిచరితంబు
లనురక్తిమైఁ జెప్పుకొనెడువారు
ఏతట్టు పొడగన్న నీశునిభక్తిని
బాయక భజనలు సేయువారు
ఏదిక్కుఁ గాంచిన నీశునిమానసం
బున నిల్పి మునివృత్తిఁ దనరువారు
ఏప్రక్కఁ గనుఁగొన్న నీశ్వరధ్యానంబు
సేయుచు నతనిఁ బూజించువారు
ఎందుఁజూచినఁ బ్రీతిగ నీశురూప
ములు లిఖించెడువారును మొనసి యీశు
మంత్రపఠనంబుచే మేను మఱచి యుండు
వారు మఱి నృత్యములు సేయువార లరయ. 127

వ. మఱియు నందందుఁ జంద్రకాంతోపలవేదికాసీన లగుపుణ్యాంగనలను సత్యవతి చూచుచుం బోవ నయ్యోషిద్రత్నంబులు సత్యవతిం జూచి. 128

తే. ఎవతె యిక్కన్యకామణి యెట్టిపుణ్య
కార్యములు సేసెనో యటుగాక యున్న
నిందు రాఁగలభాగ్యంబు పొందు నొక్కొ
పాకరిపునకేనియుఁ దొంటి ఫలము లేక. 129

వ. అని యనేకభంగులం బొగడుచుండి రావల నమ్మహాభక్తారత్నంబును గరుడకిన్నరగంధర్వాద్యనేకయక్షసందోహరక్షితం బగునవరత్న

మయకలశవిన్యస్తోత్తరద్వారంబునం బ్రవేశించి కోటిసూర్యప్రభాకలిత రత్నరచితరమ్యమంటపాంతరంబునకుం దోడ్కొని పోయి దివ్యతేజోవిరాజమాను లగుబృందారకాదిమహాయోగిసందోహసంసేవ్యమానం బగురత్నసింహాసనంబున నుమాసమేతుం డగుచంద్రమౌళీశ్వరుచరణారవిందంబులం జేర్చి రంత సత్యవతి శాశ్వతానందసుధాంబుధి నోలలాడుచు ననేకవిధంబులం గొనియాడుచు దండప్రణామంబు లాచరింప నమ్మహాదేవుఁ డత్యంతానుకంపాంతరంగుండై సత్యవతిని దగ్గఱకుఁ జీరి యి ట్లనియె. 130

క. ఓయమ్మ యుండు మిం దెడఁ
బాయక నీచేసినట్టి§బాసకుఁ ద్రైలో
క్యాయతకీర్తి యొసంగెను
బోయబలల కెల్లఁ గీర్తి§పొంపిరిఫూయెన్. 131

వ. అని తనముందట నిడుకొని యచటిమహాజనబృందంబులకుం బ్రియంబునం జూచుచుండె ననిన విని శౌనకాదిమునీంద్రు లావలివృత్తాంతం బేమని యడుగ సూతుం డిట్లనియె. 132

ఆశ్వాసాంతము.

క. శ్రీకల్యాణగుణాకర, రాకాద్విజరాజశేఖ§రా ధవళాంగా
నాకధునీధర శంకర, శ్రీకామాక్షీసమేత శ్రీసిద్ధేశా. 133

తోదకవృత్తము. పరమదయాకర§పావనగాత్రా
పరమమునీంద్రశు§భస్తుతిపాత్రా
పరమసుఖప్రద§భవ్యచరిత్రా
పరమయశోనిధి§పావకనేత్రా. 134

గద్యము.

ఇది శ్రీమదాలూరువంశపయోధిరాకామృగాంక రామ
కృష్ణదైవజ్ఞపుత్త్రి సుజనవిధేయ వాసుదేవనామ
ధేయప్రణీతం బైన శ్రీసిద్ధేశ్వరీయం
బనుమహాప్రబంధంబునందు
తృతీయాశ్వాసము.

సంపూర్ణము.

శ్రీరస్తు.

శ్రీగణేశాయనమః.

శ్రీసిద్ధేశ్వరీయము.

చతుర్థాశ్వాసము.

శ్రీకైలాసనివేశా
కాకోదరరాడ్విభూష కల్మషశోషా
నాకేశార్చితపద సు
శ్రీకలితా క్రతువినాశ శ్రీసిద్ధేశా. 1

వ. అవ్వలివృత్తాంతంబు వినుం డని మునులకు సూతపౌరాణికుం డిట్లనియె. 2

తే. పుణ్యవతితోడఁ జంద్రగుప్తుండు రథము
నెక్కి మార్గంబు గడచి మహేశు నాత్మఁ
దలఁచుచును మద్యఘట ముండుతావుఁ జేరి
పుత్త్రి యుండినయెడఁ జూడఁ బుత్త్రి యచట. 3

వ. కాన కుండుటంజేసి పుణ్యవతియుం దానుఁ జింతాక్రాంతస్వాంతులై యి ట్లనుకొనిరి. 4

క. మనకుఁ గనులారఁ బుత్త్రిని
గనుఁగొనుటకుఁ బ్రాప్తి లేదుగాఁబోలు నహో

మనగర్భంబుల నిమ్మోయి
జనియింపఁగ నేల పాపజనులై యుండన్. 5

వ. అని మఱియు నందందు నన్వేషించి పుత్త్రిజాడ యెందుం గానక. 6

మ. తనయా! యెందుల కేఁగితే తెలుపు మోతల్లి మముం గూర్మిమైఁ
గొనిపొమ్మందుల కేము వచ్చెదము మాకూర్రాపరాధంబు తె
ల్లను జిత్తంబున నుంచుకోఁ దగునె యేలా కిన్కమాయమ్మరో
యని చింతించెడుదంపతుల్ విన నుమా ప్రాణేశ్వరుం డర్మిలిన్.

వ. అమ్మద్యపూరితార్ద్రిభాండంబున నుండి యశరీరవాక్కున ననియె.

మ. వినుఁడో దంపతులార సత్యవతి నేనీక్షింప మర్త్యాళి నం
చును గ్రోశద్వయదూర మింద్రదిశగాఁ జూపట్టుస్రోతస్వినిం
దనరుం జారువిశాల మైనశిల యద్దానిం దగం గొట్టిపొ
యెను దద్ద్వారమునుండి నిశ్చలత ముక్తీశుం గనుంగొంటకున్. 9

వ. కావున నిపు డయ్యేడకుఁ బాతాళఝురం బనంబడు మీ రందేఁగి
యం దతిశుద్ధోదకంబున స్నానంబుచేసి రండు సత్యవతిని వెదుకఁ బని
లేదనిన విని వా రట్లు చని చూడ నచ్చట. 10

తే. మునులు దమశిష్యులకు వేదములను జెప్పు
చున్న వా రన నయ్యేటనుండి జలము
ప్రణవనాదంబునను మీఱి పాఱుచుండఁ
గర్ణముల కింపు మీఱఁగఁ గాంచి దాని. 11

వ. అంతరంబునకుం బోయి చూడ నందొకగండశిలయందు రుద్రపా
దంబు లేర్పడి తత్పదోపరిభాగంబున నుండి శుద్ధజలంబులు ప్రవ
హించుటం జేసి భార్యయుం దానుఁ దజ్జలంబులయందు హరహర
మహాదేవ యని స్మరించుచు స్నానంబుచేసి కూఁతు వ్రాయిన తెరు
వెం దున్న దని కొండొకతడవు పరికించి యీఝురంబు పుత్త్రికార
ణంబున నేర్పడెను గదా యని సంతసించి యచ్చోటు వాసి
వచ్చుచు. 12

తే. పుత్త్రి కాదిది మనపూర్వ పుణ్యరాశి
గాక వేఱేది గాదల కమలసూతి
దలఁచి పుట్టించెనో యిట్లు తనయగాను
మనకు నని చెప్పుకొను చిర్వురును ముదమున. 13

వ. ఆపాతాళఝురకూలంబున కేఁగి యచట. 14

పుణ్యవతీచంద్రగుప్తులు సుగ్రీవప్రతిష్ఠితం బగు రాములదేవాయలంబున కరిగి రాములను బూజించుట.

సీ. తొల్లి శ్రీరామచంద్రుండు వాలిని ద్రుంపఁ
బూని సుగ్రీవునిఁ బోరుమంచుఁ
బాసట చెప్ప నప్పగిది సుగ్రీవుఁడు
పోరంగ నవ్వాలి పొగరు మించి
పట్టి నేలం బడఁగొట్ట నామోఁదుల
కోపక పఱతెంచి యొందిలిపడు
చుండు టెఱింగి రాముండు సుగ్రీవుని
కడ కేఁగి యిట్లనెఁ దోడరి మీరు
పోరుచుండఁగ మీరూపు లారయంగ
నొక్కవిధముగ నుండ నేమాని బాణ
మేయ కుండితి నీహేతు వెఱుఁగు మంచుఁ
జెప్ప సుగ్రీవుఁ డప్పుడు చింతఁ బాసి. 15

వ. రామచంద్రుని పదారవిందంబులకు దండప్రణామంబు లాచరించి యి
ట్లనియె. 16

ఆ. రామచంద్ర నీవు రాజవే నిజముగ
రాక్షసాళిఁ ద్రుంప రాజునింటఁ
బుట్టినాఁడ వయినఁ బురుషోత్తముఁడు గావె
గానన కదా బిఱాన యిట్లు. 17

వ. దయాపరిపూర్ణహృదయంబున నాశ్రితజనరక్షాపరతంత్రుం డని
యెఱింగింప నాపఱతెంచి వచ్చినయెడకుం జని నన్ను భయంపడకు

మంచు నిజహృదయం బెఱింగించితి విశ్వకారణంబున నీవు లక్ష్మీనారాయణుఁ డంచు నిశ్చయించితి నని యనేకభంగుల నారామచంద్రునిం గొనియాడి యచటఁ ద్రిజగద్విదితంబుగ నొకయాలయంబు నిర్మించి యం దాస్వామిని సుఖాసీనుం జేసి "దయాపూర్ణాభిరాముం డ"నునామంబునం ద్రిమాసంబులవఱకుం బలువిధంబులం బూజించె నట్టిదేవాలయంబును జూచి పుణ్యవతీచంద్రగుప్తు లటకేతెంచి యారామునిఁ బూజించి యం దొకరమ్యవననిర్మాణంబు చేయించి మధ్యభాండేశ్వరునికడకుం జని కడుభక్తి మెఱయం గాంభోజపురపాలాగ్రేసరుసన్నిధి నుండు నొకవార్తాంతికోత్తముని రావించి యాలయనిర్మాణంబునకు ముహూర్తం బడుగ నా దైవజ్ఞుండు. 18

తే. అనియెఁ బరికించి యీవిభవాబ్దమాఘ
పూర్వదశమిని జలజాప్తపూజ్యదినము
మట్టమధ్యాహ్నలగ్నంబు మహితశుభము
కలుగఁ జేయు నటంచు భూకాంతుతోడ. 19

చంద్రగుప్తుండు సిద్ధలింగేశ్వరున కాలయంబు గట్టించుట.

వ. అనిన నాధరణీసురేంద్రునకుఁ బ్రియంబున నానరేంద్రుండు కనకాభరణాంబరంబు లొసంగి పంచి యాలయనిర్మాణకారుల రావించి యమ్ముహూర్తంబున 20

సీ. బహుచిత్రవిరచితప్రాకారపరివృతాం
బరచుంబితోరుగోపురము లొప్ప
మణిమయకల్యాణమంటపంబులు యజ్ఞ
శాలలు శృంగారశాల లెసఁగఁ
జంద్రకాంతోపలశయ్యాగృహంబులు
దృషరత్నరచితవేదికలు వఱల
రమ్యసభామందిరంబులు ప్రమథని
శాంతంబులు శతాంగశాల లలరఁ

ద్రిజగదంధకార దినకరబింబమో
యనఁగ గర్భగృహము నందు నవ్య
రత్నకలశ మొప్ప రచియింపఁగాఁ జేసి
కనక మొసఁగి శిల్పకారులకును. 21

వ. సమస్తప్రశస్తోత్సవంబులు సేయించి తత్పూజానియమం బనవరతం
బు భూసురాగ్రేసరులవలన నిర్వర్తించునట్లు చేసి పుణ్యవతియుం
దాను నత్యంతభక్తి నాస్వామినిఁ గీర్తించి యనంతరంబ. 22

చ. అరదము నెక్కి సత్యవతి యందలిసత్యపువృత్తి కొప్ప న
బ్బురపడుచుం బురంబునకుఁ బోయిరి తత్పురవాసు లెల్ల రి
ద్ధరణిపుఁ డాత్మపుత్త్రికను దండన చేయుటఁ గాదె పొందె సు
స్థిరయశముం ద్రిలోకములఁ దెల్లముగా మఱి పార్వతీశునిన్. 23

క. కనులారఁ జూడకుండిన
విని నాతనిపల్కు లెల్ల వీనులకుఁ బ్రియం
బున నీతనిపుణ్యం బే
మని చెప్పను మింకఁ బత్ని యట్టిద చూడన్. 24

వ. అని బహుభంగులం బొగడి రంత. 25

ధ్రువకోకిలవృత్తము. పురము సేరినయంతనాత్మజపుత్త్రునింగడుఁ బ్రీతిమైఁ
గరము లారఁగ నెత్తి ముద్దిడి కాలకంఠుకృపన్ భువిన్
బరఁగఁ బుట్టినవాఁడవో మముఁ బాయ కోర్వుగఁ బ్రోతువో
ధర యశంబును దెత్తువో యని ధర్మపత్నియుఁ దా నొగిన్.

వ. ఆబ్బాలుని ముద్దాడిరి నాఁటఁగోలెఁ బుణ్యవతి యాదౌహిత్రునకుం
బ్రతిదినంబును. 27

తే. ముదమునను జలకం బార్చి మోమునందు
భూతిఁ దగఁ బూసి కస్తూరి బొట్టు వెట్టి
లలితభూషలఁ దనువు నలంకరించి
పాలు పోయుచుఁ బెంచె నుయ్యేల నుంచి. 28

వ. ఇవ్విధంబునం బెంచుటంజేసి పూర్వపక్షచంద్రుం బోలెఁ బ్రవర్ధమానుం డై. 29

క. అడుగు లిడ నేర్చెఁ దడఁబడఁ
బుడమిం బరువెత్త నేర్చెఁ బొల్పుగ నంతన్
నోడువంగ నేర్చె నగుచుం
గుడువంగా నేర్చె బువ్వఁ గూర్చుండి రహిన్. 30

తే. తోడిబాలురతోఁ గూడి యాడ నేర్చెఁ
దొడరి దినువస్తువుల నెల్ల నడుగ నేర్చెఁ
దానుగా భూషణాదులఁ దాల్ప నేర్చెఁ
దప్పు లొప్పులు పరికించి చెప్ప నేర్చెఁ. 31

వ. ఇట్లంతకంతకుం బ్రవృద్ధి నొందుచుఁ బంచాబ్దంబులు నిండుసమయంబునఁ జంద్రగుప్తుండు నిజపురోహితోత్తముం డగు శాంతికుని మున్నిడుకొని యొకముహూర్తంబున సాత్యవతేయుం డనినామకరణంబు సేయించి విద్యారంభదినంబునం బురం బలంకరించి పత్నియుం దాను మహానందాక్రాంతస్వాంతు లై దౌహిత్రునితోడ మంగళస్నానంబు చేసి దివ్యమంటపంబునం గనకపీఠిఁ గూర్చుండి సంగీతవాద్యవిశేషంబు లొప్పార బ్రాహ్మణాశీర్వచనంబు లానందంబు నొనరింప బంధుమిత్రపురజనంబులు చూడ నాశాంతికునివలన నక్షరాభ్యాసంబు సేయించి యానాఁటనుండి యాతనియొద్ద విద్యాభివృద్ధికి విడుచుటంజేసి యాబాలకుండు. 32

క. గురుపాదయుగళసేవా
పరుఁ డై గురువర్యుఁ డిచ్చు పాఠంబులఁ దాఁ
గరమర్థిఁ జదివి తత్పద
పరమార్థం బడుగు బోధ పడునట్టు లొగిన్. 33

క. ఈరీతి సర్వవిద్యా
పారంగతుఁ డయ్యె నీతి పథ మెఱిఁగె ధరా

భారము వహించుప్రాయం
బారయ నిండారె షోడశాబ్దము లౌటన్. 34

వ. అంత నొక్కదినంబున మాతామహునిం జూచి సాత్యవతేయుండు దనజననియుదంతంబు సెప్పు మని యడుగుటం జేసి యతం డంతయుం జెప్పె నప్పుడు సాత్యవతేయుండు విస్మయపరీతచేతస్కుండై మాతామహునానతిం గొని. 35

భాస్కరనదిగట్టున నుండుకాంభోజమహారాజు దనపత్ని
తోడ వచ్చి సాత్యవతేయునిఁ దనగృహంబునకుఁ
గొంపోయి రాజ్య మొసంగుట.

సీ. పరిజనంబులు గొని తురగంబు నెక్కి త
త్పురఘటక్షేత్రముఁ జూడ నరుగ
నచ్చటిజనులు సత్యవతిపుత్త్రుం డని
కడుఁ బ్రియంబున వచ్చి కనుచు నుండి
రపుడు కాంభోజమహారాజునకు నిది
దెలియ నాతఁడు దన దేవితోడ
వచ్చి చూచెను వాని మెచ్చెను రూపలా
వణ్యంబునకు నంత వారి సత్య
వతిసుతుం డెంతయును గౌరవమునఁ జూచి
మాటలాడఁగ వార లామాటలకును
సంతసం బంది బాపురే జనుల కెల్లఁ
బుత్త్రు లున్నారు వీనితోఁ బోలఁ గలరె. 36

క. అని యాసాత్యవతేయుని
వినయపు వృత్తికిని మెచ్చి వీని మనము దో
డ్కొనిపోయి రాజ్య మొసఁగుద
మనపత్యుల మగుటఁ జేసి యాతనివలనన్. 37

వ. రక్షింపఁబడుచు మనవార్ధకంబున నిమ్మహాక్షేత్రంబునం దుండి కాలంబు గడపుద మని తలంచి సాత్యవతేయుని రమ్మని ప్రియంబునం

బిలువ నతం "డిమ్మ్రహాదేవుని౯ బూజించి పాతాళఝురంబున కేఁగి యందలిజలంబుల మునింగి యావల వత్తు"ననిన నట్లు సేయుమని యాదంపతులు నిజగృహంబున కరిగి రనంతరంబ. 38

సీ. సాత్యవతేయుండు ♦ సద్విప్రులను గొని
    సరవిగఁ బాతాళ ♦ ఝురముఁ జేరి
తల్లి పోయినరీతిఁ ♦ దగఁ జూచి విస్మయం
    బంది సద్భక్తిఁ దా ♦ నాజలముల
బ్రాహ్మణశ్రేష్ఠులు ♦ పావనమంత్రముల్
    సెప్పఁగ స్నానంబు ♦ చేసి రుద్ర
పాదంబులకు మ్రొక్కి ♦ బ్రాహ్మణోత్తములకు
    నెలమిని దానాదు ♦ లెల్లఁ జేసి
జననిపాదాబ్జములఁ జిత్త ♦ మునఁ దలంచి
శంకరుం గొనియాడు చా ♦ ఝురము వెడలి
వచ్చి సుగ్రీవరచితదే ♦ వాలయమును
జొచ్చి రాముల సేవించి ♦ సొంపు మీఱ. 39

వ. కమనీయంబు లగువనంబులం జూచుచు సిద్ధేశ్వరసన్నిధానంబునకుం జని సహస్రబ్రాహ్మణశిఖామణిపురస్సరంబుగ మహాన్యాసాది మంత్రరాజంబులచే క్షీరాదిబహువిధగంధోదకాభిషేకంబు సేయించి బిల్వాక్షతసురభికుసుమరత్నభూషణాంబరాదుల నలంకృతుం జేయించి ఘృతపక్వభక్ష్యభోజ్యంబులు సమర్పణంబు గావించి తల్లిం గంబున కెదురఁ జాఁగిలంబడి యిట్లని ప్రార్థించె. 40

చ. పురహర శంకరా రజత ♦ భూధరమందిర బాలచంద్ర శే
ఖర దురితాంధకారరవి ♦ గాఢభయార్తజనోపకార భా
సురధవళస్వరూప రిపు ♦ సూదన హైమవతీమనోహరా
పరమదయాకరా సుజన ♦ వంద్యపదాంబుజయుగ్మ శంకరా. 41

తే. దేవదేవ మహాదేవ ♦ దీనపోష
సచ్చిదానందరూప వి ♦ శ్వప్రకాశ

సకలమునిజనమానస ♦ సన్నివేశ
ప్రకృతిసర్పమయూర పురాణపురుష. 42

చ. హర పరమేశ మజ్జనని ♦ యందు దయారస ముంచినట్లు నీ
గర మనురక్తిమైఁ గని యకల్మషవృత్తిఁ బొసంగ నిమ్మ స
చ్చరితులపాద సేవనము ♦ సంతసముం దగఁ గూర్చు నీపదాం
బురుహములందు నామొనఁదఁ ♦ బొందఁగఁ జేయు శుభప్రదాయకా.

వ. అని బహుభంగులం గొనియాడి యనంతరంబు భూసురోత్తములకుఁ
బారితోషికంబు లొసంగి పరిజనంబులతో నిజపురంబునకుం బోవున
వసరంబునఁ గాంభోజపురాధీశ్వరుం డగుభద్రసేనుండు సాత్యవతే
యునిపోబడి నెఱింగి ప్రియం బారఁ దా నేఁగి యక్కామీనుం దన
మందిరంబున నుచితస్థానంబునఁ గూర్చుండఁ జేసి పత్నియుం దాను
నిట్లనియె. 44

తే. అయ్య మే మనపత్యుల ♦ మగుటఁ జేసి
యింక నీరాజ్యపాలనం ♦ బే లటంచు
నెంచి సద్రాజపుత్రున ♦ కిచ్చి వాని
వలనఁ బోషింపఁబడుచు నీ ♦ శ్వరుని సేవ. 45

ఉ. చేయుచుఁ గాలముం గడపఁ ♦ చిత్తములందుఁ దలంచినార మ
ట్లీయవనిం గనంగ నొకఁ ♦ డేని సుశాంతగుణోన్నతుండు గా
శ్రీయుతలక్షణుండుగ ధ ♦ రిత్రిని బాలన సేయువాఁడు గాఁ
బాయని ప్రేమతోడ మముఁ ♦ బ్రాపునఁ జేరిచి ప్రోచువాఁడుగాన్.

క. ఇంతకు లభింపమికి మే
మెంతయుఁ జింతించుచుంటి ♦ మిపు డాగౌరీ
కాంతునికృప ని న్గంటిమి
సంతోషం బయ్యె మమ్ము ♦ సదయతఁ గనుమా. 47

వ. మఱియు వృద్ధులము మే మాసిద్ధేశ్వరస్వామిచరణారవిందంబులం
దలంచుచుండు మిఁ కేమి వలసినది లే దంచుఁ దమయభీష్టం బెఱిఁ

గించుటంజేసి సాత్యవతేయుం డూరక యాపల్కు లాలించి తల
యూఁచి కొండొకతడవున కావృద్ధదంపతులం జూచి యి ట్లనియె.

మ. వినుఁ డోవృద్ధులు మీయభీష్టము జగద్విఖ్యాతిగాఁ గూర్తు నై
నను మాతామహు లుండ వా రిడినయానం బాసి వే యొండు చే
సినచో ధర్మువె వారికిం దెలిపి మీచేఁ గొందు రాజ్యం బటం
చని యావృద్ధుల కొప్పఁ జెప్పి మది దుర్గాధీశుని న్వేఁడుచున్. 49

తే. పరిజనంబులఁ దోడ్కొని తురగ మెక్కి
పురమునకు సంతసంబునఁ బోయి యధిక
భక్తి మాతామహులపద పద్మములకు
మ్రొక్కి లిడి మాతృవృత్తాంతమునకుఁ దాను. 50

వ. పరమాశ్చర్యంబు నొంది మీరు మహామహు లని కీర్తించి కాంభో
జపురీశుండు సెప్పినవృత్తాంతం బెఱింగించె నంతఁ జంద్రగుప్తుఁ
డయ్యుదంతంబు విని విస్మయచిత్తుఁ డై సాత్యవతేయుం జూచి యి
ట్లనియె. 51

తే. అయ్య యెవరేని పిలిచి ప్రియంబుగాను
బుష్పతాంబూలవస్త్రసుభూషణములఁ
రాజ్యమును బుత్త్రినిని నిజరాజతురగ
రథముల నొసంగఁ గొనుట భద్రంబు మఱియు. 52

వ. కాలోచితసిద్ధాన్నంబును బరిపక్వఫలంబులును సస్యాన్వితసుక్షేత్రం
బును ధనధాన్యంబులును బూర్ణగర్భధేనువును ఛత్త్రచామరోష్ణీషం
బులును సుగంధవస్తువులును గొనుట పరమయోగ్యంబు గావున
నివు డాకాంభోజపురీశునకు "మీయభీష్టంబు చొప్పునం బ్రవర్తింతు"
నని యొకకమ్మ వ్రాసి చారునిచే నొసంగి పంపుము తదనంతరంబ.

ఆ. మనము మాఖమాసమునఁ బోయి బ్రహ్మోత్స
వంబు సిద్ధలింగభవున కెలమిఁ
జేయ వలయు వారు సెప్పిన ట్లప్పుడు
చేసికొంద మయ్యశివునికృపను. 54

శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము.
సుల్తాన్‌బజార్, హైదరాబాద్. 1.

ద్రుతవిలంబితవృత్తము. అనుచుఁ జెప్పెఁ బ్రియంబున నంతఁ దా
విని లలిం దనవృత్తిని నుండె న
జ్జనవరేణ్యుఁడు జాయను జూచి యి
ట్లనియె వింటె సుతాత్మజుఁ డిమ్మెయిన్. 55

తే. చేసికొని వచ్చినాఁ డనఁ జెలఁగి యామె
విని మనోనాథ రాజ్యంబు వేఱొకండు
వచ్చు టది భాగ్యమే కద వసుధ వానిఁ
జేయఁడే రాజులకు మేటి శివుఁడు కృపను. 56

వ. అని దౌహిత్రునియదృష్టంబునకుం బరమామోదంబు నొందుచుం
డి రివ్విధం బుండఁ గొన్నాళ్లకు మాఘమాసంబు వచ్చుటం జేసి చం
ద్రగుప్తుండు నిజపరివారంబును గొని భార్యను దౌహిత్రునిం గూడి
రథం బెక్కి సురాఘటక్షేత్రంబునకుం జని క్రమంబుగ సిద్ధేశ్వరును
త్సవాదులు చేయించి మగుడ వచ్చుసమయంబునం గాంభోజపురీశుం
డు గాంచి. 57

కాంభోజపురాధిపతి యగుభద్రసేనుఁడు సాత్యవతేయున కుఁ దనరాజ్యం బొసంగుట.

తే. చంద్రగుప్తునికడ కేఁగి సత్ప్రియంబు
దనర నరనాథ నాగృహంబునకు మీరు
వచ్చి మదభీష్టమును దీర్పవలె నటంచుఁ
జెప్ప నాచంద్రగుప్తుండు చెలఁగి యపుడు. 58

వ. అందఱుం దోడ్కొని యాభద్రసేనునిమందిరంబున కేఁగ నతం
డవ్వారి సగౌరవంబునఁ గూర్చుండఁ జేసి సాత్యవతేయునకు మదీ
యరాజ్యం బొసంగ నిశ్చయించితి నందుల కతఁ డంగీకరించితి నని
యొకలేఖ మీయానతిఁ బడసి లిఖించి పంచె మేము వృద్ధు లగు
టం జేసి కాలం బూరక గడపు టుచితంబుగాదు యముండు కరుణ
లేఁడు గావునఁ బరమేశ్వరు నారాధించుచుం బరలోకంబు గన వల
యు మీయిష్టం బేక ననినఁ జంద్రగుప్తుం డిట్లనియె. 59

చ. జనవర ప్రీతిఁ బ్రోచు మిము సాత్యవతేయుఁడు మీయభీష్టముం
గొని మఱి మాకు సమ్మతముఁ గూర్చును గావున నట్లె చేయుఁ డం
చనఁగఁ బురోహితోత్తముని నప్పుడు రమ్మని లగ్న మొండు గ
న్గొనుఁ డనఁ జూచి యిట్లనియెఁ గూర్మిగ నాతఁడు రాజవర్యుతోన్.

వ. మూఁడవదినంబునరుణోదయకాలంబు పట్టాభిషేకాది కార్యంబులకుఁ గడుశుభం బనియె నంత నాభద్రసేనుఁ డాసుదినంబునఁ బుణ్యవతీచంద్రగుప్తులకు సాత్యవతేయునకు మంగళస్నానంబు సేయించి నూతనవస్త్రభూషణాదుల నలంకృతులం జేసి దా నట్లు సుస్నాతులై నవవస్త్రధారు లగుచుం బురోహితోత్తమ పురస్సరంబుగ సాత్యవతేయుని నిజపుత్త్రింబోలె సంకల్పించి సకలజనంబులు చూచి సంతసింపఁ దమరాజ్యం బొసంగి మంగళవాద్యంబు లొప్పార వరవారణారోహునిం జేసి పురంబునం బ్రసిద్ధంబుగ నుత్సవంబు సేయించె నంత సాత్యవతేయుండు మాతామహీమాతామహులకు నభిమానజననీజనకు లగుభానుమతీభద్రసేనులకుఁ బ్రియంబుగఁ బ్రణామంబు లాచరించి వారిశుభాశీర్వచనంబులం గొనియె నంత భద్రసేనుండు పురోహితాదిజనంబులకు నుచితసన్మానంబులు చేసి పంచి నాఁటఁగోలె రాజ్యపాలనంబు వదలి సుఖం బుండె నంత సాత్యవతేయుండు మాతామహీమాతామహులను సిద్ధవటపురంబునకు నంపి కాంభోజపురిపాలనంబు సేయుచు భానుమతీభద్రసేనులం గాపాడుచుఁ గొన్నాళ్లుండి మంత్రియందు రాజ్యభారంబు పెట్టి భానుమతీభద్రసేనులం దోడ్కొని స్వపురంబునకుం జని యాభానుమతీభద్రసేనుల మాతామహీమాతామహులను ముదంబునఁ దనరం జేయు చుండ నొక్కనాఁడు చంద్రగుప్తుండు దౌహిత్రునిం గూర్చి భార్య యగు పుణ్యవతితో ని ట్లనియె. 61

చంద్రగుప్తుఁడు దౌహిత్రుని యౌవరాజ్యాభిషిక్తునిఁ జేయుట.

చ. సకలకలాప్రవీణుఁ డగుసాత్యవతేయుని యౌవరాజ్యనా
యకునిఁగఁ జేయ నెంచితిఁ బ్రియంబుగ నీ కిది సమ్మతంబె యూ

రక యిఁక నుండు టేల యనఁ రాణి ముదంబునఁ జెప్పె నిట్లు వే
ల్పోకసుతుఁ డున్నవాఁడె మనయుర్వికి నాథునిఁ జేయ వల్లభా. 62

ఉ. కావున దీని కే నొకటి గాదని సెప్పుట యుండునే యశ
శ్శ్రీ వెలయంగ నల్లె యభిషిక్తునిఁ జేయు మనంగఁ జంద్రగు
ప్తావనినాథుఁ డంత విబుధాళి సభాభవనంబుఁ జేర్చి తా
భావ మెఱుంగఁ జేసె వినిపల్కిరి వారలు తేని కిమ్మొయిన్. 63

తే. రాజ దౌహిత్రునకు యౌవరాజ్య మిచ్చి
సుఖముగా నుండఁ దలఁచుట శుభము గాదె
యనుచు సుముహూర్త మొక్కండు గని నరేంద్రు
నకు నెఱింగించి రాసులగ్నమున నతఁడు. 64

వ. పురంబు నలరికరింపఁ జేసి బంధుమిత్రజనంబులను సకలరాజన్యులను
సగౌరవంబున రావించి మంగళగీతవాద్యంబు లొప్పారఁ బుడమివే
ల్పు లాశీర్వదింపఁ బురోహితవరేణ్యపురస్సరంబుగఁ దా నా
సాత్యవతేయునకు శిరంబునం గిరీటంబు వెట్టి కరంబున ఖడ్గం బొ
సంగి యువరాజుం జేసె నాఁటఁగోలె సాత్యవతేయుండు మాతా
మహిమాతామహులకును దనయభిమానజననీజనకు లగుభాను
మతీభద్రసేనులకును సకలసౌఖ్యంబుల నొసంగుచుం గడుముదం
బున రాజ్యభారంబు వహించి యుండ నొకనాఁడు సభాభవనం
బునఁ బేరోలగం బుండుసమయంబున. 65

సాత్యవతేయునికడకు సూర్యుండు విప్రవేషంబున
వచ్చి హితోపదేశము చేయుట.

క. తన తేజంబున వెల్గెడు
తనయునికడ కేఁగి రాజధర్మంబుల నె
ల్లను జెప్పి వత్తమని వి
ప్రునిరూపము దాల్చి భాస్కరుఁడు సంప్రీతిన్. 66

క. చను దెంచి పుత్త్రివర్యునిఁ
గనుఁగొని దీవింప నతఁడు గద్దియ డిగి వి

ప్రునిపదపద్మములకు వం
దనముల నొగిఁజేసి భక్తి దనరారంగన్. 67

వ. పసిండిపీఁటయందుఁ గూర్చుండఁజేసి వినయంబు మెఱయ నమ్మాయా
విప్రునకు నిట్లనియె. 68

తే. భూసురోత్తమ తొల్లి నే జేసినట్టి
పాపపుంజంబు భవదంఘ్రి పద్మరజము
వలనఁ బాసెను బరమపావనుఁడ నైతి
ననుచుఁ గొనియాడుచుండఁ బ్రియంబు మీఱ. 69

చ. జలరుహమిత్రుఁ డిట్లనియె సాత్యవతేయ ననుం బ్రియంబునం
బలుకుచు గౌరవించుటను బట్టి ముదంబును జెందితి న్మహీ
తలమున సద్వివేకులకు ధర్మ మిదే కద యంచు నింక నా
తలఁ పెఱిఁగింతు నీ వొకఁడు దప్ప మఱెవ్వరు నుండ రాదిటన్.

వ. అని చెప్పుటంజేసి సాత్యవతేయుం డత్తఱి సభాంతరాళంబున నుం
డుజనంబులం బ్రియంబున ననిచి యేకతం బుండుసమయంబు నమ్మా
యాదివాకరుం డిట్లనియె. 71

సీ. విను సత్యవతియందు వేడ్కమై నే నిన్నుఁ
గనినాఁడ నేదివాకరుఁడ నీకు
జనకుండఁ బుత్త్రివాత్సల్యంబు నెగడంగ
సరవి హితోపదేశంబు సేయ
వచ్చినాఁడను విప్రవరుఁ డని తలఁపకు
నాపల్కు లన్ని మనసున నుంపు
మని చెప్పఁ దొడఁగె నెయ్యంబునఁ బ్రియపుత్త్రి
జగతిరాజుల కెల్ల సత్వగుణము
వలయు మఱి నీవు బాలుఁడు వసుధశత్రు
వులకుఁ గాలాంతకుఁడుఁబోలెఁ జెలఁగి ధాత్రి
పాలనము సేయ నోపవు భద్రయశముఁ
బొందుమార్గం బెఱుంగవు పోషణముగ. 72

వ. కావున నీ విప్ర ప్రధానం బైనకూచరణంబు సేయు మద్దానివలనం బ్రపుణ్యంబును సద్యశోధనంబును బంధుమిత్రప్రపూజ్యతయును సద సద్వివేకంబును రాజ్యసుఖంబును శాత్రవజయంబును దురతిక్రమక్రియాసాధనంబును సకలరాజన్యవశీకరణంబునుం గలుగు నాశాంతంబు లేనిచో సర్వకార్యంబులు సెడు నని వెండియు ని ట్లనియె. 73

ధ్రువకోకిలవృత్తము.

సరసం జేరి ప్రియంబుఁ బుట్టఁగ ♦ సంస్తవం బొనరించు దు
శ్చరితులం గడుదూరమం దిడు ♦ సద్బుధావళితో నిరం
తరముఁ గూడు సభాస్థలిన్ నృప ♦ ధర్మపాలన సేయు నీ
శ్వరపదాబ్జము లాత్మ నెంచుము ♦ వార కెప్పుడుఁ బుత్త్రకా. 74

చ. మనకు సమానుఁ డెవ్వరిల ♦ మానవనాథులలో నటంచు నా
మును బడఁ బోకు సజ్జనస ♦ మూహము నెప్పుడు ప్రేమఁ జూడు మే
జనములఁ గాని దూఱకుము ♦ సఖ్యము సేయకు క్రొత్తవారితో
ననయము ధైర్యము న్విడకు ♦ నాలమునన్ రిపుతోడఁ బోరుచోన్.

క. సేవకులను బుత్త్రులుగా
భావింపుము దూఱ కెపుడు ♦ భయపడి నిన్నుం
బ్రోవు మని వేఁడుజనములఁ
గావుము బంధువులఁ బేర్మిఁ ♦ గనుము కుమారా. 76

తే. భూసురోత్తములను ♦ భూషింపు మెప్పుడుఁ
దనరఁ బాత్ర మెఱిఁగి ♦ దాన మిమ్మ
యెట్టి కార్యమైన ♦ నెసలార యోచించి
చేయు దాన మేలు ♦ చెందుఁ జుమ్మ. 77

చ. పరమరహస్య మెవ్వనికిఁ ♦ బ్రాణసఖుం డని చెప్పఁ బోకు స
ద్గురువచనానుసారముగఁ ♦ గూర్మిఁ జరింపుము పేదవాండ్ర సా
దరమున నేలు దీనుల కు ♦ దారత నుండుము మంత్రివర్యులం
గర మనురక్తిమైఁ గను మ ♦ కాలమునం దెట కేని పోకుమా. 78

ఉ. కాల మెఱంగి పల్కు నిజకార్యములందు నుపేక్ష గూడ దే
యాలము సేయ కెంతయు ధనార్జన మిం పొనరింపు కాఁపు లా
నేలిక మాకు దేవుఁ డననేలుచుఁ బన్నులు దీయు మూరకే
కాలము పోఁ జరింపకు సుఖప్రదమార్గ మెఱుంగు పుత్త్రికా. 79

చ. అడిగిన పేదవారలకు నప్పుడ తోఁచినవిత్త మిమ్ము నీ
వడఁకువ మంచి దెప్పు డొగినమ్మియిఁ జేయక రేపు మాపటం
చిడికొన రాదు గర్వము వహింపకు దాన మొసంగువేళ నీ
విడినది చాల దం చడుగ నించుక మెచ్చుగ నిచ్చి పంపుమా. 80

ఆ. స్వకులనిందకులను వర వేదశాస్త్రపు
రాణదూషకులను రహిని భూసు
రోత్తమాళిజీవనోపాయముల వన
కూపములను జెఱచు క్రూరమతుల. 81

ఆ. బధిరమూకవృద్ధ పంగునిర్ధనజను
షాంధజనుల గేలి సల్పువారి
నించుకేని కరుణ నెంచక శిక్షింపు
దానఁ దప్పు లేదు తనయ నీకు. 82

తే. అగ్నిసాక్షిగ నుద్వాహమై సుఖంబు
నొసఁగు భార్యాలలామంబు నుల్ల మలర
నుండ మించుక దుఃఖంబు నొందఁ జేయ
కందుచేఁ గీడు వాటిల్లు నయ్య వింటె. 83

తే. మఱియుఁ బరభార్యఁ గోరకు మహితసాధు
జనులఁ గూడుము వినయము సత్యవాక్కు
మానకుము గౌరవాసక్తి దీనబంధు
పోషణము సేయు పెద్దల పూజ విడకు. 84

వ. ఇదియునుంగాక కళింగరాజేంద్రునిపుత్త్రి నీకుఁబరిణయం బగు దాని
యందు సత్సంతానంబు వడసి మాతామహీమాతామహులను

భానుమతీభద్రసేనులను రక్షించుచు సుఖం బుండు మంచు విధి
పూర్వకంబుగ నరుణాస్త్రిం బనుమంత్రరాజంబు నుపదేశించి యిఁక
నేఁ బోయి వత్తునని నాసత్యవతీసూనుఁ డత్యంతభక్తిమై నమ్మా
యాదివాకరునిచరణారవిందంబులకుం బ్రణమిల్లి యిట్లనియె. 85

తే. గురువరేణ్య భవత్పదసరసిజములఁ
దలఁచినప్పుడ నాకు సుదర్శనంబుఁ
గరుణ నొసఁగుము భవదాజ్ఞఁ దిరము గాను
జిత్తమున నుంతు ననినట్లు చేసెద నని. 86

చ. తరమిడి విప్రవేషుఁ డగుతామరసాప్తుఁడు ప్రాయె నంతఁ దా
నురుతరభక్తి నాతనిహితోక్తులు చిత్తమునందు నిల్పి ధీ
వరు లగుమంత్రులం గలసివారక రాజ్యము నేలుచుండె దు
శ్చరితులగర్వశత్రు వయిసజ్జనకల్పమహీజ మై భువిన్. 87

వ. అమ్మెయి నుండుటం జేసి పుణ్యవతీచంద్రగుప్తులును భానుమతీభద్ర
సేనులును సాత్యవతేయునకు వివాహంబు సేయం దలంచి రా సమ
యంబునం గళింగవిషయాధీశుండు నిజకుమారికారత్నం బగుచారు
మతికి స్వయంవరమహోత్సవదినంబు నిర్ణయించి సకలరాజన్య
కుమారులకు శుభరేఖలు పనుపుటం జేసి చంద్రగుప్తునికడకు. 88

క. మన మార విప్రుఁ డొక్కఁడు
చని తచ్ఛుభరేఖ యొసఁగి చారుమతీరూ
పనియతి పొగడెం బ్రేముడీ
తనరారఁగ నతఁడు సమ్మదస్వాంతుం డై. 89

కళింగదేశాధిపతి చంద్రగుప్తునికడకుఁ బత్రికా
స్వయంవరలేఖను బంపుట.

క. వరభూషణాంబరంబులు
పరమానందంబు నొంది పసదన మాభూ
సురవరుని కొసఁగె నాతం
డరిగెం గైకొని ముదమున నలరుచుఁ బురికిన్. 90

వ. అంతఁ జంద్రగుప్తుండు పుత్త్రికాగమనం బంతయు నింట నెల్లర కెఱింగించి యాముహూర్తంబునకు సాత్యవతేయునిఁ బంపుటకు నిశ్చయించి యుండె. 91

ఆశ్వాసాంతము.

క. పరమామ్నాయచతుస్సా
గరపరివృతప్రణవదేశ ఽకలితా వి త్తే
శ్వరమిత్రా భూతేశ్వర
ద్విరదాననగురువరేణ్యా ఽ వృషరాడ్తురగా. 92

స్రగ్విణీవృత్తము. శ్రీమహాదేవ గౌ ఽ రీశ్వరా శంకరా
సామగానప్రియా ఽ చంద్రమౌళీశ్వరా
కామితార్థప్రదా ఽ కాలకంఠా భవా
కామవిద్వేషణా ఽ కాల మృత్యుంజయా. 93

గద్యము.

ఇది శ్రీమదాలూరువంశపయోధిరాకామృగాంక రామ
కృష్ణదైవజ్ఞపుత్త్రి సుజనవిధేయ వాసుదేవనామ
ధేయప్రణీతం బైన శ్రీసిద్ధేశ్వరీయం
బనుమహాప్రబంధంబునందుఁ
జతుర్థాశ్వాసము.

సంపూర్ణము.

శ్రీరస్తు.

శ్రీగణేశాయనమః.

శ్రీసిద్ధేశ్వరీయము.

పంచమాశ్వాసము.

శ్రీమత్సనకాదిముని
స్తోమాలంకృతసభేశ తుహినాచలక
న్యామణికైరవ చంద్ర మ
హామహిమా మద్యపూరి తార్ద్రిఘటేశా. 1

తే. అంత మునులార చంద్రగు ప్తావనీశుఁ
డాస్వయంవరదినమునం దతిముదమునఁ
దనదుదౌహిత్రు నొగిఁ బరి జనులతోడ
నాకళింగాధిపతిపురి కనిచె నచట. 2

వ. కళింగదేశాధీశ్వరుండు పురం బలంకారంబు సేయించి స్వయంవరం
బునకు వచ్చు రాజకుమారులకు మందిరంబులు నిర్ణయించినవాఁడ
య్యె నాసమయంబున. 3

సీ. గౌళబంగాళనే పాళచోళేశులు
పౌండ్రకమళయాళ పాండ్యపతులు
కోసలపాంచాల కుంతలనేతలు
కేరళసాళ్వాది భూరమణులు

ద్రవిడోత్కళాంధ్రమా । ళవమత్స్యసౌధులు
లాటకర్ణాటవ । రాటపతులు
కాశ్మీరసౌవీర । గాంధారనృపతులు
ఘూర్జరబర్బర । కుకురుధవులు
మద్రకొంకణకరహాట । మగధనిగధ
శబరకేకయబాహ్లీక । శకవిదేహ
కొంకణావంతిసౌరాష్ట్ర । కురువిదర్భ
చేదివత్సమహారాష్ట్ర । సింధువిభులు. 4

కళింగరాజపుత్త్రికాస్వయంవరంబునకు వచ్చినరాజకుమారుల గౌరవంబున విడుదులను జేర్చుట.

క. చనుదెంచిరి తమతమపరి
జనములతో నాకళింగ । జనపతి వారిం
ఘనతం దోడ్తెచ్చుటకుం
దనబంధుపురోహితప్ర । ధానులతోడన్. 5

క. సంగీతవాద్యములతోఁ
బంగరుపళ్లెరములందు । ఫలపుష్పాదుల్
బంగరుపచ్చడములు గొని
పొంగుచుఁ దద్రాజవర్య । పుత్త్రిలకడకున్. 6

వ. పోయి పురోహితపూర్వకంబుగ విచ్చేసినరాజకుమారరత్నంబుల కందఱకుఁ గురంగనాభసమన్వితచందనామోద పుష్పదామంబులను వివిధమధురఫలంబులను గనకమణిమయభూషణాంబరాదుల నొసంగి సగౌరవంబున నెల్లరం దోడ్కొనివచ్చుచుండ నాపురవరంబున.

తే. ఎందుఁ జూచినపచ్చని । పందిరులును
దుఱఁగలించెడుముత్యాల । తోరణములు.
వివిధఫలపుష్పవల్లరీ । విలసితేక్షు
దండసంయుతకదళికా । స్తంభములును. 8

క. చెలఁగెడుసదనద్వారం
బులు కప్రపుముగ్గు లొలయు భూతలములు రం
గులు మీఱుచిత్రపటములు
చెలువారుచు నుండెఁ గలిమిచెలి కాలయమై. 9

వ. అంత రాజు రాజపుత్త్రులం దోడ్తెచ్చి యుచితసుందరమందిరంబులం జేర్చి తనకార్యంబుల నుండె నయ్యవసరంబున. 10

{చారుమతి సురూపగుణాన్వితరాజకుమారు నెక్కుడని నేర్పు మెఱయించి చూచి రమ్మని మోహనవల్లిని బంపుట.}

ఉ. రాజకుమారి చారుమతి రాజకుమారులరాకఁ జూచి యా
రాజకుమారులందు రతిరాజును బోలి ప్రశస్తశీలవి
ద్యాజవసత్త్వధైర్యనిపుణాన్వితుఁడై సుగుణాఢ్యుఁడై మహా
రాజకులప్రసూతుఁ డయి రాజిలువానిని నేర్పు మీఱఁగన్. 11

వ. పొడగాంచి రమ్మని మోహనవల్లి యనుచెలికత్తియను బంపుటం జేసి యది రాజకుమారులవిడుదులకడ నిల్చి పూబంతులు గట్టుదాన నని పలుకుటం జేసి పాంచాలభూవిభుండు విని యిట్లనియె. 12

ఆ. పూలదండ లంద ముగఁ గట్టుదానవె
యెందునుండి నేర్చి తీవు చెపుమ
యనఁగ రాజు లిండ్ల ననయ మిప్పని సేయు
దాన నడుగు టేల ధరణినాథ. 13

క. అని నుడువఁగ విని యమ్మోయిఁ
దనరారఁగఁ గట్టు మల్లి ధరణిపుత్త్రిం
గనువేళ వలయు నన మో
హనవల్లి యదే విధమున నందం బెసఁగన్. 14

వ. పుష్పదామంబులం గట్టి యొసంగె నద్దాని రాజకుమారులు చూచి ముదం బంది రాసమయంబున నెల్లజేండ్లం జూచె నందు సాత్త్వవతే యుండు నక్షత్రప్రకరంబునఁ జంద్రుంబోలె నుండుటం జేసి తనమన మ్మున. 15

ఉ. ఈరమణీయరూపుని మహేశుఁడు మన్మథు రూపు మాపి యం
భోరుహగర్భుచే మఱలభూతలమం దిటు పుట్టఁ జేసె నో
చారుమతీవిభుండుగ విచారము లేటికి నింక దానితో
భూరిముదంబు మీఱఁగను బోయి వచించెద నైన నేర్పడన్. 16

ఆ. ఎవ్వ రెఱుఁగ కుండ సీతనివృత్తాంత
మెఱుఁగవలయుఁ గడకు నేఁగి యంచు
నచటనుండి వత్తునని చెప్పి ఱేఁడుల
ముదలఁ బొంది వచ్చె ముదము నెగడ. 17

వ. అట్లుచితకాలంబున లేచి సాత్యవతేయునివిడిదికిం జని యతనికి
దండంబు లిడి యిట్లనియె. 18

క. చారుమతీసఖి నగుదును
గారవమునఁ బుష్పమాలికలు గట్టుచు నే
భూరమణుఁడు శుభలక్షణుఁ
డై రాజిలు నట్టివాని నరయుట కెలమిన్. 19

క. చారుమతి పంప వచ్చితి
నో రాజకుమార యనఁగ నుల్లానముతో
నా రాజపుత్త్రిలక్షణ
మారయ నా కెఱుఁగఁ బల్కుమని యడుగఁగఁ దాన్. 20

వ. చారుమతీశుభలక్షణంబులు ప్రియంబు గదుర వక్కాణింప నాసా
త్యవతేయుండు విని మహానందంబు నొంది మోహనవల్లితో ని
ట్లనియె. 21

అంబురుహవృత్తము.

అందఱ రాజకుమారులఁ జూచితె యందు నెవ్వరు దానికిం
బొందువడుం బరువంబుగఁ జెప్పను బొంకకుండ ననంగ నా
సుందరునిం గని వల్కె నగోత్తమ చూచినందఱిలోఁ బ్రియం
మ్మొందెడు నీపయిఁ గావున వచ్చితి నుల్లసిల్లుచు నే నొగిన్. 22

వ. భవద్వంశోదంతంబు సంగ్రహంబుగ నెఱింగింపుఁ డేను బోయి చారుమతి కెంతయు ననురాగం బుదయింప నుడివెద ననవుడు నాసూర్యపుత్త్రిం డొకపత్రికయందు. 23

చారుమతికి సాత్యవతేయుండు తనవృత్తాంత మొకపత్రికయందుఁ బనుపుట.

సీ. మగధదేశాధీశుఁ డగుచంద్రగుప్తమ
హీతలేంద్రునకు దౌహిత్రుఁ డేను
వసియించుపురి సిద్ధవటము ప్రభాకర
శర్మ నాదేశికసత్తముండు
జనులు సాత్యవతేయుఁ డని నన్నుఁ బిల్తురు
విబుధపూజనమె చూవృత్తి నాకు
సత్యమృదుత్వశౌచశ్రీలు గలయువ
తిం బెండ్లియాడఁ జిత్తంబునందుఁ
దలఁచియున్నాఁడ నింతకు జలజభవుని
తంత్ర మెట్లున్నదో యది తతి నెఱుఁగఁ
బడుఁ గదా యైనఁ జంద్రునిఁ బరముదమునఁ
గోరదే చక్రవాకంబు గూర్మి నెపుడు. 24

క. అని యిట్లు వ్రాసి యమ్మో
హనవల్లికరమున నిడఁగ నది కడుమోదం
బును బొంది దాని నొడి నిడి
కొని చేనికిఁ జెప్పి ముదలఁగొని తా నంతన్. 25

ఆ. పోయి చారుమతికిఁ బొందుగ దాఁ జేసి
నట్టికార్యములఁ బ్రియమున నుడివి
కమ్మఁ జేత నొసఁగఁ గని దానిఁ జదివి యి
ట్లనియెఁ బొలఁతి నెయ్యమార ననుడు. 26

క. ఈపత్రిక లిఖియించిన
భూపాలునిముఖసరోజముం జూచితె త

ద్రూపమునకు సదృశుం డే
భూపాలుం డుండు లేఁడె । పోల్పఁగ ననఁగన్. 27

ఉ. మోహనవల్లి యిట్లనియె । మోహము పుట్టఁగ రాకుమారి క
మ్మోహనమూర్తితో సదృశ । మూర్తిగ జేఁ డొకఁ డుండు లేఁడ యు
త్సాహము గల్గదే యతని । చక్కఁదనంబును జూడ మన్మథుం
డాహరుచేత రూపు చెడె । నం చిలఁ బల్కుట దబ్బరల్ సుమా. 28

ఆ. అతనిరూపునకు హి । మాంశుఁడు లజ్జచేఁ
గొన్ని నాళ్లు మఱిఁగి । కొన్ని నాళ్లు
సత్త్వగుణము చూపి । చనవుమై వెల్గెడు
నంచుఁ జెప్పవచ్చు । నమ్మ చూడ. 29

క. అని బహుభంగులఁ బొగడుచు
మనసారఁగఁ జేసెఁ జారు । మతి కారాజేం
ద్రునిమీఁద వలపు రాసుత
తనకరమున నుండుకమ్మఁ । దలకొని మఱలన్. 30

తే. చదువుకొను చుండునపుడు గ్ర । చ్ఛఱి నెడఁదఁ
దోఁచె నయ్యారె నాతల్లి । తో నొకప్డు
జనకుఁడు వచించెఁ గద యట్టి । చంద్రగుప్త
నృపతిదౌహిత్రుఁ డితఁడొక్కొ । నిజము గాను. 31

వ. అదియునుంగాక. 32

క. సత్యవతీసుతుఁ డగుటను
సాత్యవతేయుఁ డని పేరు । సమకూడె మఱియా
దిత్యునికృపఁ దాఁ గల్గుట
సత్యంబ ప్రభాకరుండు । సద్గురుఁ డగుటన్. 33

వ. అట్టిమహానుభావుండు నాకు భర్త యగుట నాపూర్వసుకృతంబ
మఱియు నతనిగుణరూపవిద్యాశీలాదు లింకఁ బరిశీలింపఁ దగ దని
వెండియు నిట్లు తలంచె. 34

తే. చక్రవాకంబు గోరదె చంద్రురాకఁ
గూర్మికోఱ కని వ్రాయుటఁ గోర్కి యతని
కెంత నాపయి నుండునో యెడఁద నింత
కీశ్వరుఁడు నన్నుఁ గూర్పఁడె యొల్లి యంచు. 35

వ. కొంతవడి తలపోసి మోహనవల్లి యొనర్చిన నేర్పునకు సంతసించి దా
నితో ని ట్లనియె. 36

మత్తకోకిలము. ఎల్లి మోహనవల్లి నా కవనీశ్వరుల్ పొడచూపుచో
నెల్లవారలఁ జూచు చూరక యేను వత్తును వెంట నా
యుల్ల మారఁగ నీనృపాత్మజు నొద్ద నేరుపు నింపు సం
ధిల్లఁ బల్కుచు నిల్వ మీతని తీరు చూడ వలెం దగన్. 37

వ. అని మోహనవల్లికి మున్నడి నియమించె నంత. 38

చంద్రోదయవర్ణనము.

తే. శాత్రవుం డగుభానుండు చరమదిశకు
నరిగె భయమేమి యిఁక నా కటంచు మించి
తిమిరదైత్యుండు వచ్చెనో తిమురు చనఁగ
నలువలంకులఁ దిమిరంబు బలిసె నపుడు. 39

తే. అంతకంతకుఁ బూర్ణామృతాబ్ధిలోని
భూరిరంగత్తరంగముల్ పొంగి నింగి
కెగసెనో యనఁ బ్రాగ్దిశ నెసఁగె వెల్ల
మిసిమి యామీఁద దెసలెల్లమించె నంత. 40

క. చెలువారఁ బులోమజ సొ
మ్ములు దాలిచి తనయొయారముం జూచుటకుం
దొలిదిక్కుమేడముంగల
నిలిపినదర్పణ మనంగ నెల యొగిఁ బొడిచెన్. 41

వ. అయ్యవసరంబునం జెలికత్తియల నందఱం బ్రియంబునం బోయి భు
జించి రం డనిన వా రేఁగి రంత సౌధోపరిభాగంబునకుం జని పండు

వెన్నెలయం దొక్కెడం బఱచినమృదుశయ్యను జేరి సాత్యవతేయుని
వలన నెగడుమదనానలంబునకు సహింప నేరక. 42

మన్మథదూషణము.

ఉ. దండనసేయ కుండఁ దలిదండ్రులు ముద్దుగఁ బెంచి రట్లు తే
కుండినచో ననీతుఁ డయి యుత్కటగర్వము నొంది పుష్పకో
దండము వట్టి యిమ్మెయి నెదం గుసుమాంబక మేయఁ బూనితే
దండు కెలంకులం గొలువఁ దారొక్కని నిర్దయతన్ రతీశ్వరా. 43

తే. వావి వరుసలు లేకుండఁ గావరమునఁ
గుసుమబాణంబు లేయంగఁ గూర్మిపతుల
జిహ్వావక్షోర్ధతనువులం జేరి గోలి
భారతీందిరాగౌరులు క్రూరమతుఁడ. 44

చ. అనుపమరూపయావనము లం దనుభోగమునందు సాటి యై
దనరురతీసతీమణిని దర్పక పాసి చలంబు మై ననుం
జెనకుట పాడియే శివుని చే నశియింపఁగఁ జేయుమన్ వెసం
జను మిఁక బాపురే యిటులు చానల నేఁచిన మేలు గల్గునే. 45

చంద్రదూషణము.

తే. అనుచుఁ గుసుమాంబకుని దూఱు నపుడు మింటఁ
జుఱుకువెన్నెలఁ జంద్రుఁడు నెఱయఁ గాయఁ
జారుమతి దాని కోపక చంద్రుఁ జూచి
తొడరి యాసెజ్జఁ బాయక దూఱె నిట్లు. 46

తే. ఓరి దోషాకరా సుకులోదయుండ
వయ్యు నించుకదయ లేక యంగజునకు
జోక వైతివి గదర దోషాకరుండ
నంగ నీ కిల సార్థక నామకంబ. 47

తే. పుట్టితివి పాలకడలి నీపుట్టుక సెడ
దానఁ బుట్టిన గజకామ ధేనుకల్ప

కావనీజసుధాకాన్తి | భాదు లతుల
గుణములం గాంచె నీ కట్టి | గుణము లేడ. 48

తే. కలకుఁదురకలదేవర | గాక యున్న
గురునియిల్లాలితోఁ బొందు | కూళ భూమి
తలమునం దొక్కుఁ డున్నాఁడె | ధర్మవృత్తి
మానిబాపురే నీ కిది | మంచి దగునె. 49

తే. అపుర తోఁబుట్టునింటిని | నైనఁ బ్రేమఁ
జూడ నోపినవాఁడవె | శూలపాణి
పరఁగ నీశాంతకాంతిఁ బు | ష్పంబు కరణి
శిరమున ధరించికద కోప | చిత్తుఁ డయ్యె. 50

క. పెనుఁబాపతేఁడు నిను గ్రిం
గినయప్పుడు మాంత్రికు లొగిఁ | గృపమై విధిచో
ప్పనఁ దన్మంత్రములు పఠిం
చినకతనం బ్రదికి యిట్లు | చెనకెద వకటా. 51

తే. అంచుఁ జంద్రుని నిందించు | నపుడు మరుఁడు
కుసుమబాణంబు లురమున | నెసఁగఁ బొంచి
యేయఁ దనపాన్పుపైఁ సొమ్మ | వోయె నంతఁ
జెలులు గొందఱు డగ్గఱఁ | జేరి యెలమి. 52

వ. మృగమదఘనసారమిళితమలయజంబు మైఁ నలంది వీవనలం గొని విసరి రప్పు డారాచపట్టి నిదురించి మేల్కొన్న చందంబున లేచి మోహనవల్లిం జూచి యిట్లనియె. 53

క. చెలియా సాత్యవతేయుని
చెలువంబుం జూడఁ గోరెఁ | జిత్తము నా కా
చెలువునిఁ గూర్చునె పల్కుల
వెలఁదిమగం డెంచి యంచు | వెండియు ననియెన్. 54

వ. మదనానలంబున కొండలు తాళ నోపకున్నది యేమి సేయుదు ననిన

నప్పడఁతి యప్పుడు పాలోఁగిరంబును బసిఁడిగిన్నె నిడికొని వచ్చి
యి ట్లనియె. 55

మత్తకోకిలము.

అమ్మ తె మ్మిది యారగింపు ప్రి § యంబునం గమలాసనుం
డమ్మహీపతి కీవు భార్యగ § నర్థిఁ గూర్చును బో నిజం
బిమ్మెయిం బలుమాఱు నారక § యేల నెంచెదు వర్ధరా
త్రమ్ము మీఱె ననంగ నావర § రాజపుత్రిక లేచి తాన్. 56

తే. దాని నించుక భుజియించి § తల్పమునను
జెలులు బాదంబు లొ త్తంగ § నెలమి నిదురఁ
జెంది సాత్యవతేయుని § జేరినట్లు
గంటిఁ గల యేమి చిత్ర మి § క్కల నిజంబె. 57

వ. అని చెలులం జూచి చెప్పుచు నుండుసమయంబున. 58

సూర్యోదయవర్ణనము.

సీ. కమలషండమునకుఁ § గల్గె సమ్మోదంబు
కలువలగరగరి§కంబు తగ్గెఁ
గోదమ తేఁటులు గుంపు § గూడి పాడఁ దొడంగె
నిక్షుసాయకుఁడు వి§ల్లెక్కుడించెఁ
జక్రవాకముల క§వక్ర తేజము మించె
నలచకోరములకు § నాస తలఁగెఁ
గొంకుచేఁ జీఁకటి § గుహాలందుఁ జొచ్చెను
నలుదిక్కులం దొఁగెఁ § దెలుపు మించె.
నళుకుఁ గల్గెను జారచో § రులకు నెదల
వృక్షములు వాసి పక్షులు § వెడలి పాఱె
శిష్యులకు వేదబుక్కులు § సెప్పఁ బూని
రోర్పుమై విప్రు లంతటఁ § దూర్పునందు. 95

తే. దాంభవృత్తి సురద్విషు § ల్తాపసులను
హింససేయుటఁ గాంచి స § హింపలేక

తచ్ఛిరంబులఁ దెగటార్చి దానవారి
పంచెనో చక్రమనఁ బుట్టె భానుఁ డెలమి. 60

వ. అంతఁ దత్సమయోచితక్రియాశీలు రై వచ్చి రాజకుమారవరేణ్యుల
మాల్యాభరణాంబరంబులు దాల్చి వివిధవిచిత్రాలంకృతస్వయంవర
మంటపంబునకుం జని యుచితాసనంబులం గూర్చుండి రాసమయం
బున. 61

చారుమతిని చెలు లలంకృతురాలుగఁ జేయుట.

క. పొలఁతులు సంపెఁగనూనెం
బొలుపుగ రాసుతకు నంటి పూనీట ముదం
బలరఁగ మజ్జన మొనరిచి
యలసట పో విసరి తావి యగుధూమంబున్. 62

ఆ. గుబులుకొనఁగ నిడుదకురులకు నొసఁగి చి
క్కనువు మీఱఁ దీసి యారఁ జేసి
శర్కరామృతంబుఁ జయ్యనఁ గ్రోలంగ
నొసఁగి రంతఁ జెలులు మసలకుండ. 63

సీ. పస మించు చెంగావివలువఁ బొల్పుగఁ దాల్చి
కస్తూరి నెఱఁ దిలకంబు వెట్టి
క్రొమ్మెఱుంగులు మీఱఁ గూర్చిన బంజాల
కమ్మలు వీనులఁ గ్రాలఁ జేసి
బెడఁగారుసొమ్ములు జడఁ జొంకముగ నిడి
జిగి మానికంబులఁ జెలఁగుతళ్కు
ముంగరఁ దగఁ బెట్టి మురు వగుచంద్రహా
రములుభూషలు కంధరమునఁ బూన్చి
కరయుగంబుల రత్నకంకణము లొప్పఁ
జేసి నడుమున మిసిమి గజ్జెలను గూర్చి
డాలు మించెడురవలయొడ్డాణ మొసఁగ
నిడి పదంబుల కందెలు దొడిగి యంత. 64

చ. సురభిసుమైకమాలికలఁ జొప్పడ వేణి నలంకరించి భా
సురముగ మేనఁ జందనము సొంపుగఁ బూసి కరంబునందు సుం
దరతరమల్లికాకుసుమదామ మొసంగిరి యప్ప డొక్క సుం
దరి నృపునాజ్ఞఁ గైకొని ముదం బెసలారఁగ వచ్చి రాసుతన్. 65

తరళవృత్తము. కని స్వయంవరమంటపంబునఁ గాంతరో సనుఁ గోరి వ
చ్చిననరేంద్రులు లేచి నా రని చెచ్చెరం జనుదెంచి తో
డ్కొనుచు రమ్మనియోః భవజ్జనకుం డనంగఁ బ్రియాంగనల్
దనుఁ గెలంకులఁ గొల్వఁగా నెడఁదం బ్రమోదము నొందుచున్.

వ. అస్వయంవరమండపంబునకుం జన నారాజకుమారులు పొడగాంచి
యిట్లనికొనిరి. 67

తే. శంబరాసురరిపుహస్త సాయకంబొ
నవసుధాంశునిరేఖయొ వివిధరత్న
ఖచితచిత్రంబొ రతిచేతఁ గ్రాలుశుకమొ
వరజయంతునిపట్టపు వారణంబొ. 68

క. జలజాకరమునకుం జను
కలహంసయొ లేక కమల గర్భుం డిలఁ జె
న్నలరఁగ బసిండిక్రొమ్మెఱుఁ
గులఁ బడఁతిం జేసె నేమొ కో యనుచుండన్. 69

తే. రాజచంద్రులఁ జూపఁగఁ రాజునాజ్ఞఁ
గొని పురోహితుఁ డాతేని కూఁతుతోడ
నాస్వయంవరమంటప మందు నిలిచె
వివిధమంగళవాద్యముల్ వేడ్కఁ జెలఁగ. 70

చారుమతీస్వయంవరమహోత్సవము.

వ. అయ్యవసరంబునం బురోహితోత్తముండు చారుమతి కాయాయి
దేశాధిపతు లని వచ్చినరాజకుమారుల నిమ్మెయిం జూపఁ దొడంగె.

సీ. అమ్మరో చూడు మీయన గౌళనాయకుం
డతఁడు బంగాళదేశాధినాథుఁ

డితఁడు కోసలవిభుం డితఁడు పాంచాలేశుఁ
డితఁడు మాళవధవుం డితఁడు మత్స్య
వల్లభుం డితఁడు సాల్వమహీశుఁ డాతఁడాం
ధ్రధవుండె యితఁడు కేరళనరేంద్రుఁ
డతఁడు కాశ్మీరదేశాధిపు డితఁడు ఘూ
ర్జరనాథుఁ డతఁడు మగధధరణీంద్రుఁ
డితఁడు కొంకణరాజేంద్రుఁ డితఁడు బాహ్లి
కాధిపతి యాతఁ డుత్కళనాథుఁ డతఁడు
శకధరిత్రీశుఁ డితఁడు వత్సపతి మఱియు
నతఁడు సౌరాష్ట్రభూపాలుఁ డంచు నెలమి. 72

వ. సకలరాజన్యకుమారవర్ణ్యులం జూపుచుం బోవ నొక్కెడ నుడు
గణంబున నుడురాజుంబోలె నాదిత్యులయందు విష్ణుకైవడిం బరిఢవి
ల్లుసాత్యవతేయుని నితఁడు మగధభూపాలుం డని వచింపఁ జారుమతి
మోహనవల్లిముఖం బాలోకింప నది కనుసైగ సేయ నించుక యా
తనిముఖారవిందంబుం గాంచి తనమనంబున. 73

క. మనసిజుఁడు రూపవంతుం
డని చెప్పుటె కాని కన్నులారఁగ వానిం
గనుఁగొన్నవారు లేరిలఁ
గనుఁగొంటిని నేఁడు శంభుకరుణం గనులన్. 74

మ. తొలి నేఁ జేసినపున్నెమౌర యని సంతోషాత్మయై యెల్లరా
జులుఁ జూడం దనచేతిపూసరము తత్పూర్వ్యాత్మజస్కంధమం
దలరం బెట్టెను దూర్యనాదములఁ గర్ణానంద మొందంగ ము
న్నలవైదర్భులయట్లు దేవతలు నాకనారీతుల౯ మెచ్చఁగన్. 75

క. అత్తఱిసాత్యవతేయుం
డత్తరుణీమణికరాబ్జమతిసంతోషా
యత్తాత్ముఁడగుచుఁ బట్టె న్న
పోత్తము లెసఁగ జూడఁ దోడికయువతులు పొగడన్. 76

ఉత్సాహము. అంత రాజపుత్త్రి తెల్ల । రా స్వయంవరంబు న
త్యంతప్రీతిఁ జూచి యూర । కాశ చేని టుండ న
క్కాంత మనలఁ గోరునే యుఁ । కంద తేఁగు టుత్తమం
బింత కీశుకరుణ దాని । కెగ్గు సేయఁ బాడియే. 77

తే. అనుచుఁ దమపట్టణములకు । నరదములను
గూరుచుండియు నేఁగిరిఁ । గూర్మి నెగడ
చారుమతి వెంటఁ దోడ్కొని । సంవి నత్త
మామయదుగుల కెఱిగి సమ్మదము మీఱ. 78

వ. సాత్యవతేయుండు నిజపురంబునకుఁ బ్రయాణంబు సేయఁ గని కళింగ
భూవిభుం డిట్లనియె. 79

క. విను మయ్యా విధ్యుక్తము
గను బెండిలి సేసి మిమ్ముఁ । గడువేడుకసైఁ
బనుపంగ నుచిత మని తా
ఘనతఁ బురోధఃప్రపూర్వ । కంబుగ నెలమిన్. 80

సాత్యవతేయుండు చారుమతిని వివాహంబు చేసికొనుట.

వ. శుభముహూర్తం బొకండు నిశ్చయించి తల్లగ్నంబునకు స్వబాంధు
మిత్రజనంబులను జామాతృమాతామహీ మాతామహాదిప్రియజనం
బులను రావించి సంగీతవాద్యంబు లొప్ప రమణీయకల్యాణమంట
పంబునం గనకరత్నమయపీఠియందుఁ గూఁతు నల్లునిఁ గూర్చుండఁ
జేసి నవ్యసుగంధతైలంబున నంగనామణులు నలుఁగులు పాడు
చు శిరంబుల నంటి మంగళస్నానంబు సేయించి రంత. 81

ఆ. ఆకళింగనరవ । రాగ్రేసరుఁడు పుత్త్రి
కొసఁగు వస్త్రభూష । లొక్కపసిఁడి
పళ్లెరంబునందు । ఫలపుష్ప తాంబూల
చందనాదు లుంచి । యంద మలరు. 82

వ. భూషణాంబరంబు లొక్కపళ్లెరంబున జామాత కొసంగ నిడికొని కల్యాణమంటపంబునకు యోషిద్రత్నంబుల చే నెత్తించుకొని వచ్చి పురోహితులకడం బెట్టించె నయ్యవసరంబున. 83

క. చారుమతీసతికి నలం
కారంబును జేసి రెలమిఁ గాంతలు తద్గా
త్రీరమణుం డమ్మెయి శృం
గారంబును జేసికొనియెఁ గౌతుక మెసఁగన్. 84

మత్తకోకిలము.

భూసురేంద్రులు బంధుమిత్రులు భూమిపాలురు మెచ్చఁగా
నాసమైఁ బురకాంత లెల్ల మహాద్భుతంబుగఁ జూడఁగాఁ
భాసురాంబురుహాక్షు లందఱు పాట లింపుగఁ బాడఁగా
వాసి మీఱుసుగీతవాద్యరవంబు దిక్కులు నిండఁగన్. 85

వ. ఉండుసమయంబునఁ బురోహితోత్తముండు మంగళాష్టకంబులు సెప్పుచు నాచారుమతీసాత్యవతేయుల నక్కల్యాణమంటపంబునకుఁదోడ్కొని వచ్చి నవరత్నఖచితవిశాలపీఠిం గూర్చుండఁజేసి విధ్యుక్తకర్మకలాపంబు లొనరించి చారుమతీకంధరంబున నిడుమని సాత్యవతేయునికరంబునం జారురత్నాంచితమంగళసూత్రం బొసంగ నతండు. 86

క. అంగభవారిని నిజజన
నింగమలాప్తుని బుధాళిని జిత్తమునం
దుంగడుభక్తిఁ దలంచి సు
మంగళసూత్రంబు గట్టె మంగళమలరన్. 87

వ. అనంతరంబ. 88

తే. చెలఁగి భూసురవర్యు లాశీర్వదింప
వందిమాగధు లానందమొంది పొగడ

నతివ లానంద మానందమాయె నంచుఁ
బాడుచుండఁగ నొగిఁ దలఁబ్రాలు పోసె. 89

తే. అంతనా దంపతులఁ బీఁటయందు నుంచి
యగ్నిఁ బూజించి లాజహోమాదు లెల్ల
సరవిఁ జేయించె నవ్వధూవరుల కెలమి
బంధుమిత్రములు భూషణాంబరము లపుడు. 90

మత్తకోకిలము. కానుక ల్గొని వచ్చి యిచ్చిరి గౌరవం బలరంగ భూ
జాని యప్పుడు కూఁతు నల్లుని సంతసంబునఁ గాంచి నా
మానసాబ్జమునందుఁ గోరినమాడ్కిఁ గూఁతున కిట్టి సం
ధానముం దగఁ బొనిఁ గేమి కృతార్థుఁ డైతి ననుచుఁ దాన్. 91

వ. వివాహదినంబులయందు హర్షోత్కటస్వాంతంబున సకలజనంబుల
ను మృష్టాన్నంబునం దనిపి యనంతరంబు ప్రియంబుగ బంధుమిత్ర
పురోహితామాత్యావనీసురవందిమాగధాదిజనంబులకు నుచితవస్త్రా
లంకారాదు లొసంగి వారిం బంచి దుహితృజామాతలం గొన్నిది
నంబు లింట నుంచుకొని యొకసులగ్నంబున నవ్వధూవరులం బ్ర
యాణంబు సేయించి యాదినంబున. 92

తే. సద్గజాశ్వశతాంగముల్ సాధుగోస
హస్రమును సుందరాభరణాంబరములు
నొసఁగె జామాత కతఁడు సంతసము నొంది
వానిఁ గైకొని యతిభక్తి వఱలనపుడు. 93

వ. అత్తమామలయడుగుఁదమ్ములకుం బత్నీసమేతుఁడై దండప్రణామం
బు లాచరించి వారిశుభాశీర్వచనంబులం గొని నిజపురంబునకుం బో
వునవసరంబునం జారుమతిం జూచి తజ్జననీజనకు లిట్లనిరి. 94

చారుమతికిఁ దలిదండ్రులు నీతులు గఱపుట.

మత్తకోకిలము. అమ్మరో నిరతమ్ము భర్తపదాంబుజమ్ములు భక్తిఁ జి
త్తమ్మునం దిడు వేఱెదైవము ధాత్రి లేదిఁక నమ్ము స

త్యమ్ముఁ దప్పకుఁ బెద్దవారల నర్థిఁ జూడు మొకింత కో
పమ్మునైఁ బరుషంబు లాడకు భక్తిఁ బాయకు మేలగున్. 95

చ. మనకు సమాన తెవ్వరని మానసమందుఁ దలంపఁ బోకు ని
ర్ధనికుల గేలి సల్పకుము దార్కొని దూఱకు భృత్యవర్గముం
బని చెడి యేఁగ రా దొరుల ప్రార్థనకుం బతిఁ బాసి యొంటిగాఁ
గనకుము సుందరాంగు లని కన్నులఁ బూరుషులం గుమారికా. 98

ఉ. వచ్చినబంధుమిత్రులను వంచన సేయక యన్నపానముల్
హెచ్చుము లేక పెట్టు కృప పొంపిరివోవఁగ నంగహీనులం
గ్రచ్చుఱఁ జీరి లే దనక రాతిరివేళలఁగాని యోగిరం
బిచ్చుట మంచి దమ్మ విను మెప్పుడుఁ బొందకు దానమందెదన్. 97

తే. వ్రతము లేవేని పతియాన వదలి సేయ
ఫలము లే దందుఁ బతియానఁ దలఁగకుండు
పతినిఁ బూజింప నదె మహావ్రతము దాని
కంటె లేమల కొకగతి గలదె జగతి. 98

క. పురుషునిసుఖదుఃఖంబులు
పరికించి తదానుగుణ్య పథమున నోగిఁ బొ
మ్మొరులకుఁ గీడెంచకు స
చ్చరితలతోఁ బల్కు పుణ్యసాధన మబలా. 99

ఆ. లేనివస్తువుఁ దెమ్మని లేనిపోని
మాటలాడుచు భర్తను మానభంగ
కార్యములఁ ద్రోసి నవ్వెడు కాంత లుండు
నెడకుఁ జనకుము పతిభక్తి విడిచి యెపుడు. 100

చ. అనిసుగుణంబులం దనయ కాత్మ నెసంగఁ బొసంగఁ జెప్పి యి
ట్లని రనురక్తి నల్లునకు నయ్య మదీయకుమారి కష్టముం
గన దిది యొంతమాత్రమును గావున నిప్పటిప్రీతి డెందమం
దొనరఁగ నెప్డు నుంపుము మృదూక్తులు పల్కుచు భద్రమయ్యెడున్.

తే. సకలదుర్గాభితరణంబు సకలధర్మ
ములకు మూలంబు నిత్యసమ్మోదకరము
కీర్తిసంధాయకంబు రోగార్తినివహ
నిగ్రహము సాధుపత్నీపరిగ్రహంబు. 102

వ. కావున నిద్ధర్మంబునుం గూర్చి పెక్కులు వక్కాణింప నేల యనవు
డు నాసాత్యవతేయుండు విని యాయనుల కుత్తమవచనంబులం జెప్పి
పరివారంబుతో నిజపురంబునకుం జని భార్యయుం దానుం దనవా
రికిం బ్రియం బారంబ్రణమిల్లి వారియాశీర్వచనంబులం గొని చారు
మతిం గూడి సుఖంబుండె నంత నొకనాడు మాతామహుం డగు
చంద్రగుప్తుండు సంసారవిముఖుం డగుచు సాత్యవతేయునకుం బట్టా
భిషేకంబు సేయం బూని పురోహితపురస్సరంబుగా నొకముహూ
ర్తంబు నిర్ణయించి సకలరాజన్యుల కెఱింగించి చిత్రకారుల
రావించి. 103

చంద్రగుప్తుడు సాత్యవతేయునకుఁ బట్టాభిషేకము సేయుట.

సీ. పురవీథులందు సుందరముగఁ బచ్చని
పందిరు ల్వేయించి పలుతెఱంగు
లగుచిత్రవస్త్రంబు లొగి దాని కలరంగ
గట్టించి ముత్యాల పట్టుకుచ్చు
లెసఁగుతోరణములఁ బొసఁగ సింగారించి
చిత్రపటంబులు చెలఁగు కెక్కి
యంబులు రాజసౌధాగ్రంబులం దొప్పఁ
బెట్టించి యందందు బిరుదపటము
లరయ నిడఁ జేసి రాజచిహ్నములు దనరు
మకరతోరణములు సభామంటపమున
వఱల నెలకొల్పి ప్రతిగృహద్వారమునను
వివిధఫలపుష్పగుచ్ఛము ల్వ్రేలయునట్టి. 104

వ. కదళికాస్తంభంబు లొప్పార నిల్పి భూప్రదేశం బాతయుం గురంగనాభఘనసారఘుసృణసంకలితహిమాంబువులకలయంపిఁ జల్లించి పలు వింత లగురంగులు చెలంగు రంగవల్లికలం దీర్పించె ననంతరంబ. 105

తే. సకలరాజన్యులను బంధునికరములను
హితులఁ బ్రెగ్గడలను బురోహితుల నెల్ల
గరిమ రావించి యా సులగ్నంబునందు
నృత్యసంగీతవాద్యంబు లెసఁగ నపుడు. 196

వ. చారుమతీసాత్యవతేయులకు మంగళస్నానంబు సేయించి సకలభూషణాంబరాలంకృతులం గావించి కల్యాణమంటపంబునం గాంచనపీఠంబునఁ గూర్చుండఁ జేసె నప్పుడు పురోహితుండు తండులపూర్ణపాత్రంబునఁ గనకకలశంబు లుంచి సముద్రోదకంబును నవరత్నధాన్యంబులను దత్కలశంబుల నిడి పంచపల్లవంబులును బీతాంబరంబులును నారికేళంబు నందుంచి యలంకరించి పుణ్యాహవాచనాదిపావనమంత్రంబులం జెప్పి తద్విధ్యుక్తకర్మకలాపంబు లెల్ల నడపి నవరత్నకిరీటంబును బూజింపఁ జేసి సర్వరాజన్యవైశ్యశూద్రమిత్రామాత్యపురజనబృందంబు లానందంబునం జూడ నిరుగెడలం బాలంతులు కరకంకణంబులు మొరయ వింజామరంబులు వైవ వందిమాగధులు పొగడ నవనీసురోత్తములు ప్రవిమలవేదమంత్రాక్షతపుష్పంబులం జేకొని యాశీర్వదింపఁ దత్కలశోదకంబును శిరంబునం జల్లి క్రమ్మఱ నూతనవస్త్రాదికముల నలంకృతులం జేయించి రత్నసింహాసనంబునం గూర్చుండఁ బెట్టె నప్పుడు చంద్రగుప్తమహారాజచంద్రుండు పుణ్యవతీసమేతుం డై యొకపార్శ్వంబునను గాంభోజమహీపాలుం డగు భద్రసేనుండు భానుమతీయుక్తుం డై యొకపార్శ్వంబునను నిల్చి సాత్యవతేయునిశిరంబునం గిగీటంబు నిడి తమకరంబుల రాజ్యధురంధరం బగునంగుళీయకంబు లొసంగి శ్వేతచ్ఛత్రఖడ్గంబు లిచ్చి రనంతరంబ. 107

తే. చంద్రగుప్తమహీశుండు సంతసమున
విప్రులను బంధుమిత్రుల వినయ మారఁ
బసదనంబు లొసంగి తాఁ బంపె నాఁటఁ
గోలె సాత్యవతేయుండు కువలయంబు. 108

గీ. అలర నేలుచుండె నాయేలుబడిఁ జూచి
సంతసంబు నొంది చారుమతికి
బుద్ధి సెప్పి మేము పోయి సిద్ధేశుని
గూర్చి సేవచేసికొనుచు భక్తి. 109

వ. పాతాళఝరంబున నొక్కెడ. "వార్ధకే మునివృత్తీనా" మను సూక్తిచొప్పున వృద్ధు లగుమేము మునివృత్తి నుండెద మనిన విని భానుమతీభద్రసేను లమ్మోయిం బోవ నిశ్చయించి యంద ఱానందంబునం జారుమతీసాత్యవతేయుల దీవించి పాతాళఝరం బునకుం బోయి యం దొకయుచితస్థానంబునం జేరి క్రమంబున న య్యాశుపదారవిందభజనంబు సేయుటం జేసి తత్పరత్వంబున నన్న పానంబులు సరకు గొనక దేహంబులు మఱచియుండి పర్యవసానం బున నాసిద్ధేశ్వరచరణారవిందంబులం జేరిరి గావున.

సీ. పరమేశుఁ బూజించు కరములుకరములు
శితికంఠు వర్ణించు జిహ్వ జిహ్వ
కామారిఁ జూచెడు కన్నులు కన్నులు
భవుకథ లాలించు చెవులు చెవులు
శ్రీహరుఁ గోరెడు చిత్తంబు చిత్తంబు
శ్రీశంభునకు మ్రొక్కు శిరము శిరము
భర్గుని వలగొన్న పదములు పదములు
శంకరు జపియించు జపము జపము
దేవదేవుని సేవించు దినము దినము